# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

24.8.2025 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 75 | పేజీలు : 16 Pages : 16 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## స్పీకర్ నోటీసులపై సర్వత్రా ఉత్కంఠ

**ఏం జరుగుతుందో అని రాజకీయంగా చర్చ**

**ఉప ఎన్నికలపై ఆశ పెట్టుకున్న బీఆర్ఎస్**



**హైదరాబాద్, ఆగస్ట్ 23:** సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరగబోతుందన్న చర్చ సాగుతోంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని అంతా ఉత్కంఠగా చూస్తున్నారు. ముఖ్యంగా విపక్ష బిఆర్ఎస్ ఈ విషయంలో ఆసక్తిగా ఉంది. ఎలాంటి నిర్ణయం రాబోతందున్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఉప ఎన్నికలు రావఆలని కూడా బీఆర్ఎస్ కోరుకుంటోంది. సుప్రీం తీర్పు ఆధారంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. అయితే మిగిలిన మరో ఐదుగురికి కూడా త్వరలో నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మిగతా 2 లో

## టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే



సీఎం రేవంత్‌ను మాత్రం కలిశా

నోటీసులపై గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

2





## ఓట్ చోర్‌పై నిరసనలకు సన్నాహాలు

**లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్**

**పార్టీపరంగా బీసీలకు 42 శాతం టికెట్లు**

**బీసీ బిల్లుపై సుప్రీంలో సవాల్‌కు నిర్ణయం**

**కేసీఆర్ సవరణతో తీరని అన్యాయం**

**గాంధీభవన్ సమావేశంలో సీఎం రేవంత్**

**హైదరాబాద్, ఆగస్ట్ 23:** ఓట్ల చోరీ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఓట్ల చోరీకి సంబంధించిన ప్రచార లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పీఏసీ సభ్యులతో కలిసి లోగోను విడుదల చేశారు. ఓట్ల చోరీపై రేవంత్‌రెడ్డి ఇటీవల భాజపాపై విమర్శలు ఎక్కుపెట్టిన విషయం తెలిసిందే. ఓట్ల చోరీని అడ్డుకుందామని.. రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతిద్దామని పిలుపునిచ్చారు. రాహుల్ చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రాష్ట్రంలోనూ ఆందోళనలునిర్వహించాలని నిర్ణయించారు. ఇకపోతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించిన నేతలు.. పార్టీపరంగా బీసీలకు 42 శాతం టికెట్లు- ఇవ్వాలని నిర్ణయించారు.

మిగతా 2 లో



## స్థానిక ఎన్నికలకు ముందే పదవులు పందేరం

పీసీసీ కోర్ కమిటీలో నేతల అభిప్రాయం

స్థానిక ఎన్నికల వ్యూహంపై చర్చించిన భేటీ

2




ధర్మస్థల వ్యవహారం

## అంతా ఉత్తిదే

అబద్దాలతో బురిడీ కొట్టించిన ముసుగు వ్యక్తి

అబద్ధమనిచెప్పడంతో అరెస్ట్ చేసిన సిట్

.. వివరాలు 4లో



## ప్రధాని మోడీపై అభ్యంతరకర పోస్ట్

మహారాష్ట్ర, యూపిల్లో తేజస్వీపై కేసులు నమోదు

.. వివరాలు 4లో



## ఉత్తరాఖండ్‌లో మరోమారు వరదలు

యువతి మృతి.. మరో వ్యక్తి గల్లంతు

.. వివరాలు 3లో



## హైడ్రాతో తగ్గిన ఆక్రమణలు

**దేశంలో ఎక్కడా ఇలాంటి సంస్థ లేదు**

**నాలాలను రక్షించంతో పాటు ఆక్రమణలు తొలగిస్తున్నాం**

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**హైదరాబాద్, ఆగస్ట్ 23:** హైదరాబాద్‌లో వరదలు, మురుగునీటి సమస్యలు, చెరువుల కబ్జాలు, పర్యావరణ సమస్యలు వంటి క్లిష్ట అంశాల పరిష్కారానికి ఒక ప్రత్యేక సంస్థ అవసరమని భావించిన ప్రభుత్వం, గత ఏడాది జూలైలో హైడ్రా అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు- చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మీట్ ద ప్రెస్‌లో మాట్లాడుతూ సంస్థ పని తీరు, భవిష్యత్ దిశపై కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2 లో

## సిరిసిల్ల కార్మికులను ఆదుకోండి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ



3

## ‘యూరియా’పై ఆందోళన వద్దు



**రాష్ట్రానికి సరఫరా పెంచేందుకు అన్ని రకాల చర్యలు**

**ఆర్‌ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి పునరుద్ధరణపై మార్గనిర్దేశం**

**సచివాలయంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు సమీక్ష**

రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

## 5 లక్షలతో పేదల ఇంటి నిర్మాణం అసాధ్యం

- కనీసం 12 లక్షలకు పథకం పెంచాలి
- మంత్రి పొంగులేటితో ఈటెల రాజేందర్ భేటీ
- మల్కాజిగిరి సమస్యలపై చర్చ



3

## అధికార లాంఛనాలతో సురవరం అంత్యక్రియలు

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- నేడు మఖ్దూం భవన్‌కు సురవరం భౌతిక కాయం
- దత్తాత్రేయ నివాళి

2





2

## నిత్యపెళ్లి కొడుకు ఆ కానిస్టేబుల్

- వరుసగా ఐదు పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు
- ఓ బాలిక ఉండడంతో బయటపడ్డ వ్యవహారం
- పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు

## సల్వాజుడుం తీర్పు సుప్రీం కోర్టుది

దానిని కేంద్రహోం మంత్రి అమిత్ షా చదివితే బాగుంటుంది

ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

4





## ఓట్ చోర్ ఆందోళన మూర్ఖత్వం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 2లో

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు...



# అధికార లాంఛనాలతో సురవరం అంత్యక్రియలు

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్ట్ 23:** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరపాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వెంటనే ఈ ఆదేశాలను అమలు చేయాలని దానికి సంబంధించిన ఏర్పాట్లు- చేయాలని సిఎస్‌ను సిఎం రేవంత్ ఆదేశించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. నేడు మధ్యాహ్నం సురవరం భౌతికకాయానికి అధికారం లాంఛనాలతో గౌరవ సూచకంగా అధికారులు నివాళ్లు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో పాటు- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయయుడు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిసింది.

**నేడు మఖ్దూం భవన్‌కు సురవరం భౌతిక కాయం**

సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్ నుంచి మఖ్దూం భవన్‌కు తరలించనున్నట్లు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు, ప్రజల సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మఖ్దూం భవన్‌లో భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం సాయంత్రం 5 గంటలకు సురవరం పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలావుంటే భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల బండారు దత్తాత్రయ తీవ్ర సంతాపాన్ని తెలియజేసారు. సురవరం భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నిత్యపెళ్లి కొడుకు ఆ కానిస్టేబుల్

**వరుసగా ఐదు పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు**

**ఓ మైనర్ బాలిక ఉండడంతో పోక్సో చట్టం కింద అరెస్ట్**

**సూర్యాపేట, ఆగస్ట్ 23:** సూర్యాపేట జిల్లాలో నిత్య పెళ్లికొడుకుగా చలామణి అవుతున్న కానిస్టేబుల్ కృష్ణంరాజుపై సూర్యాపేట గ్రామీణ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నడిగూడెం పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అతడు వరుసగా నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడని, అందులో మూడో వివాహం ఏడాది క్రితం సూర్యాపేట మండలానికి చెందిన పదోతరగతి బాలికతో జరిగినట్లు- ఇటీ-వల వెలుగు చూసింది. ఈ విషయంపై జిల్లా ఎస్పీ నరసింహ స్పందించి వారం రోజుల క్రితం కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అతడి వృత్తి కానిస్టేబుల్ కానీ, మరోవైపు అతడో నిత్య పెళ్లి కొడుకు. ఓ మైనర్ అమ్మాయితో పాటు- నలుగురిని పెళ్లి చేసుకున్న అతను మరో పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో అతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లాలోని నడిగూడెం పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కృష్ణంరాజు (40)ని ఇటీవల సస్పెండ్ చేశారు. ఇప్పటివరకూ అతను ముగ్గురు మహిళలుతో పాటు- మైనర్ బాలికను కూడా వివాహం చేసుకున్నాడని.. ఐదో పెళ్లికి సిద్ధమయ్యాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను పెళ్లి చేసుకున్నట్లు- విచారణలో తేలింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పి నరసింహ వెంటనే కృష్ణంరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. మైనర్‌ను వివాహం చేసుకున్న ఘటనపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. కానిస్టేబుల్ వివాహం చేసుకున్న బాలిక వయసు 13ఏళ్లు కావడంతో ఆమె తల్లి నుంచి ఫిర్యాదు తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు- గ్రామీణ ఎస్సై బాలునాయక్ తెలిపారు. చివ్వెంల మండలానికి చెందిన కృష్ణంరాజు గతంలో తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన సమయంలో ఇసుక వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు- ఆరోపణలు రావడంతో సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత నడిగూడెం ఠాణాలో నియమించగా ప్రస్తుతం సూర్యాపేట కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

# ఓట్ చోర్ ఆందోళన మూర్ఖత్వం

**అలా అయితే తెలంగాణలో ఎలా గెలిచారు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 23:** బిహార్ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ఆర్జేడీకి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలియరకాంగ్రెస్ వారే గదరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఓట్ చోరీ అయితే తెలంగాణ, కర్నాటకల్లో ఎలా విజయం సాధించారని అన్నారు. బిహార్‌లో ఇల్లీగల్ ఓట్లు- ఎక్కువ ఉన్నాయి. హైదరాబాద్‌లో డబుల్ ఓట్లు ఉన్నాయి.. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. దొంగ ఓట్లతోనా? తీవ్రమైన నేరాల్లో ఉన్న సీఎం, మంత్రులు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగాల్సిందే. గతంలో దీనిపై కాంగ్రెస్ లేఖ రాసింది.. ఇప్పుడు మౌనంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాడుతున్న భాష పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనను సైంధవుడు అని అన్నారని ఆయన తెలిపారు. కళ్ళు పీకి గోలీలు ఆడుకుంటానని, తొండలు పెడతామని, పేగులు తీసి మెడలో వేసుకుంటానని, హవులగా.. ఇలా రకరకాలుగా పరస్పర విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. తాను ఆర్ఎస్ఎస్ స్క్రిప్ట్ చదువుతున్నానని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ తాను ఆర్ఎస్ఎస్ కాబట్టి చదువుతానని అన్నారు. ఇది తెలంగాణ భాష కాదన్నారు. రాజకీయాల్లో శత్రువులు ఉండరాదని, ప్రత్యర్థులు మాత్రమే ఉండాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ఓట్ చోర్‌పై నిరసనలకు కాంగ్రెస్ సన్నాహాలు

మొదటి పేజీ తరువాయి




శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో పలు అంశాలపై నేతలు చర్చించారు. రాష్ట్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న కమిటీల నిర్మాణంపై చర్చించారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోరీ, గద్దీ ఛోడ్ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. యూరియా కొరతపై భారత రాష్ట్ర సమితి, భాజపా చేస్తున్న రాజకీయాలు కూడా నేతల మధ్య చర్చకు వచ్చినట్టు- సమాచారం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామని పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చామని.. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో బీసీలకు మేలు జరగాల్సిందేనని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబడాలన్న సీఎం రేవంత్.. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదన్నారు. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీం కోర్టులో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని సీఎం చెప్పారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందని చెప్పారు. విడిగా సుప్రీం కోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి చాల సమయం పడుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరత పైన డ్రామాలు ఆడుతున్నాయని సీఎం విమర్శించారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తానని కేటిఆర్ అనడంలోనే వాళ్ల తీరు అర్థం అవుతుందని సీఎం ఎద్దేవా చేశారు. యూరియా కోసం నాలుగు సార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్ ను కలిశానని.. యూరియా పంపిణీ పైన క్షేత్రస్థాయిలో మానిటరింగ్ ను పెంచాలని సీఎం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు వీహెచ్, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికలకు ముందే పదవులు పందేరం

**పీసీసీ కోర్ కమిటీలో నేతల అభిప్రాయం • స్థానిక ఎన్నికల వ్యూహంపై చర్చించిన భేటీ**



**హైదరాబాద్, ఆగస్ట్ 23:** స్థానిక ఎన్నికలకు ముందే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సిఎం రవంత్ రెడ్డికి కాంగ్రెస్ నేతలు సూచించారు. దీంతో కార్యకర్తల్లో భరోసా వస్తుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ కోర్ కమిటీ- సభ్యుల సమావేశం జరిగింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై చర్చించారు. కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు 30వ తేదీ లోపు ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు ఎలా అనే అంశంపై సమావేశంలో చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ముగ్గురు మంత్రులకు ఆ నియోజకవర్గ ఉప ఎన్నిక వ్యవహారాన్నీ అప్పగించినందున పార్టీ పరంగా బలోపేతమయ్యేందుకు ముమ్మరంగా కసరత్తు కొనసాగుతున్నట్లు- సభ్యుల దృష్టికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఉన్న ఫిర్యాదులను స్పీకర్ పరిశీలించారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీ-సులు ఇచ్చిన స్పీకర్ మిగిలిన వాళ్లకు కూడా ఒకటి రెండు రోజులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ముందుకు వెళ్లాలి అన్న అంశంపై చర్చించినట్లు- సమాచారం.

# 'యూరియా'పై ఆందోళన వద్దు

**హైదరాబాద్, ఆగస్టు 23 :** రాష్ట్రానికి యూరియా సరఫరాను పెంచేందుకు మా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ప్రతిపక్షాల దుష్ప్రచారంతో రైతులు ఆందోళనకు గురి కావొద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్సీఎల్) యాజమాన్యం, వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్సీఎల్ లో ఉత్పత్తి నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సీజన్ లో 145 రోజుల్లో 40 రోజులు మాత్రమే ప్లాంట్ పనిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఇలాంటి పరిస్థితులు తలెత్తుతుంటే శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆర్ఎఫ్సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ ను ప్రశ్నించారు. మిమ్మల్ని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదని, రాష్ట్రాభివృద్ధిలో మాతో కలిసి నడిచే భాగస్వామిగా చూస్తున్నామని స్పష్టం చేశారు. ప్లాంట్ పునరుద్ధరణకు రూపొందించిన యాక్షన్ ప్లాన్ ను సమీక్షించి మార్గనిర్దేశం చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణను చూడొద్దన్నారు. రామగుండంలో ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు ఆర్ఎఫ్సీఎల్ మాతృ సంస్థ ఎన్ఎఫ్ఎల్ కు సంబంధించిన ఇతర ప్లాంట్ల నుంచి తెలంగాణకు ప్రతి రోజు ఒక రేకు యూరియాను సరఫరా చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయంలో మీకేమైనా ఇబ్బందులుంటే కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్ఎఫ్సీఎల్ రామగుండం యూనిట్ హెడ్, జీఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా రాకతో తగ్గిన ఆక్రమణలు

మొదటి పేజీ తరువాయి

హైడ్రా లాంటి సంస్థ దేశంలో ఎక్కడా లేదు. ఇది కొత్త ప్రోగ్రామ్, కాబట్టి ఇంకా చాలా తెలుసుకోవాల్సి ఉంది. సిబ్బంది తక్కువ ఉన్నప్పటికీ, మేము బాగానే పనులు చేస్తున్నాం. తప్పులు జరిగితే వాటిని సమీక్షించుకుంటాం అన్నారు. హైడ్రా ఏర్పాటు- తర్వాత ప్రభుత్వమే జిహెచ్ఎంసి యాక్ట్‌లో మార్పులు చేసి సంబంధిత అధికారాలు కల్పించిందని కమిషనర్ తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ సహకరిస్తున్నారని చెప్పారు. వరదల్లో మురుగు నీరు సమస్యలను పరిష్కరించడం, అకాల వర్షాల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ, చెరువులు-నాలాలను రక్షించడం హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ చెప్పారు. నాలాల్లో వేలాది ట్రక్కుల పూడికతీత పనులు చేశాం. సిబ్బంది చేతనే మ్యాన్‌హోల్స్, నాలాలు క్లీన్ చేయించాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కొన్ని ఫోర్కాస్ట్ ఇబ్బందులు ఉన్నా, ఇప్పుడే చేస్తున్న పనులు వచ్చే 100 ఏళ్లకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 65 శాతం చెరువులు మాయం అయ్యాయి. పొల్యూషన్ వల్ల అనేక సమస్యలు వచ్చాయి. వాటిని అడ్డుకోవాలి. ఈ÷ూ పేరుతో చెరువులు కొట్టేయాలని చూస్తే ఊరుకోం. చెరువుల మాదిరిగా నాలాలను కూడా నోటిఫై చేసి కబ్జాలను నిరోధిస్తాం అని హెచ్చరించారు. అలాగే, బతుకమ్మ కుంట, కూకట్పల్లి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత స్థానికులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. హైడ్రా ఏర్పడి సంవత్సరం పూర్తయిందని, ఈ కాలంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కమిషనర్ తెలిపారు. తక్కువ మ్యాన్‌పవర్‌తో ఎక్కువ ప్రొడక్టివిటీ- సాధించాం. ఇప్పటి వరకు 500 ఎకరాలను కాపాడగలిగామని గర్వంగా చెప్పారు.

# స్పీకర్ నోటీసులపై సర్వత్రా ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి

ఫిరాయింపుల కేసు విచారణకు సంబంధించి నిర్దేశిత సమయాన్ని ఆ నోటీసుల్లో పేర్కొనలేదని సమాచారం. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్దేశిరచిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం ప్రకటిస్తారా..? లేక పెండింగ్‌లో పెడతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటు-న్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. సుప్రీంకోర్టు గడువు ముగిసేలోపు స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బీఆర్ఎస్‌లో గెలించి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురికి శుక్రవారం నోటీసులు పంపించారు. వీరి విచారణ ముగిసిన తర్వాత మరికొందరికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నది. వచ్చే వారం నుంచి వీరి విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన కేసులో 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గత నెల 31న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దానిపై అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో స్పీకర్ చర్చించారని సమాచారం. ఆ తర్వాతే ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. పార్టీ ఫిరాయించిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారందరికీ నోటీ-సులు ఇచ్చి, వివరణ తీసుకొన్న తర్వాత స్పీకర్ తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. స్పీకర్ నోటీసులతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏం చేస్తారనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. కాగా, తనకు నోటీసులు అందాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.

**టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నా**

**గద్వాల, ఆగస్ట్ 23:** టెక్నికల్‌గా తానింకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీస్‌లపై గద్వాల ఎమ్మెల్యే స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారని చెప్పారు. నోటీసుపై న్యాయనిపుణులతో మాట్లాడి వివరణ ఇస్తానని తెలిపారు. తాను అసలు పార్టీ మారలేదని, టెక్నికల్‌గా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని వెల్లడించారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని చెప్పారు. ఇప్పటికీ తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. మా కార్యాలయానికి స్పీకర్ నోటీస్ పంపారని తెలిపారు. నోటీస్‌పై న్యాయనిపుణులతో మాట్లాడి రి÷-లపై ఇస్తానన్నారు. అభివృద్ధి లక్ష్యంగానే తన చర్యలు ఉంటాయని చెప్పారు. తన నియోజక వర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు చెప్పుకొచ్చారు.

# నేటి సాక్షి

TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..

ఆదివారం 24 ఆగస్టు 2025 కరీంనగర్




# 5 లక్షలతో పేదల ఇల్లు అసాధ్యం

- కనీసం 12 లక్షలకు పథకం పెంచాలి
- మంత్రి పొంగులేటితో ఈటెల రాజేందర్ భేటీ
- మల్కాజిగిరి సమస్యలపై చర్చ



**హైదరాబాద్, ఆగస్ట్ 23:** బిజెపి ఎంపిలు అయినప్పటికీ.. రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు విషయంలో ఆయన శనివారం సచివాలయంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్రం నుంచి ఎక్కువగా నిధులు రావాలని తాము కోరుకుంటామన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదని పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన కొందరు పేదల జాబితాను మంత్రికి అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం కింద ఇంటి నిర్మాణం రూ.5 లక్షలతో పూర్తి కావడం లేదని, కనీసం రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో వాటిలో దొంగలు పడుతున్నారని అన్నారు. జవహర్‌నగర్‌లో మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన భూముల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కూల్చడం సరికాదని ఈటెల స్పష్టం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తాజాగా రాష్ట్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన ఆయన సమస్యలపై వివరణాత్మక చర్చ నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ పరిధిలో పేదలకు కేటాయించాల్సిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సమస్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గతంలో తప్పిపోయిన పేదల జాబితాను మంత్రి పొంగులేటికి అందించినప్పటికీ, ఇప్పటివరకు కేటాయింపులు సక్రమంగా జరిగేవి లేవని, అలాటెమంట్ పక్రియ పూర్తి కాకపోవడంతో భూములు దొంగల పుటకు చేరుతున్నాయని చెప్పారు. అలాగే, ఐదు లక్షల రూపాయలతో పేదవాడు ఇల్లు కట్టే పరిస్థితి కుదరదని, నిజానికి కనీసం 12 లక్షలుగా ఖర్చు ఉంటుందని ఈటల రాజేందర్ వివరించారు. జవహర్ నగర్‌లో ఉన్న భూములు ప్రభుత్వానికి సంబంధం లేకుండా, మాజీ డిఫెన్స్ అధికారులకు కేటాయించబడినందుకు విమర్శలు వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా ఉన్న ఇండ్లను కూల్చడం కరెక్ట్ కాదని, 60-80 గజాల భూముల్లో ఇళ్ళు నిర్మించినవారు కటిక పేదలే కాక ధనవంతులైనవారే కాదన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబును కలిసే అవకాశం లేకపోవడంతో ఈ సమావేశం ఏర్పాటు చేయలేకపోవడంపై బాధ వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నేరుగా సహకరించకపోవడం, అవసరమైతే కేంద్రంతో చర్చలు చేస్తామనే వైపు ఆయన వెల్లడించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారాల్లో నియమాలు, బాధ్యతలపై ఈటల రాజేందర్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్ర మంత్రులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గూర్చి, కేంద్రంపై మాత్రమే ఒత్తిడి చూపడం సరైనదా కాదని పేర్కొన్నారు. అంతేకాక, ఈటల రాజేందర్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి కోసం పార్టీలు ఓట్ల కోసం అభ్యర్థన చేయాలని సూచించారు. ఈ భేటీ, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పేదల ఇళ్ల సమస్యను పరిష్కరించడానికి కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకునే దిశగా ముందడుగు కాగలదనే దృక్పథాన్ని ప్రసారం చేస్తుంది.



## ఉత్తరాఖండ్‌లో మరోమారు వరదలు

### యువతి మృతి...మరో వ్యక్తి గల్లంతు

**డెహ్రాడూన్,ఆగస్ట్23:** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు, వరదల పరిస్థితి కొనసాగుతోంది. చమోలి జిల్లాలోని థరాలి పట్టణంలో భారీ వర్షంతో తలెత్తిన వరదల దుర్ఘటనల్లో ఓ యువతి మృతి చెందింది. మరో వ్యక్తి జాడ తెలియకుండా పోయింది. ఈ జిల్లాలో ఇప్పటి పరిస్థితి గురించి అధికారులు శనివారం ప్రకటన వెలువరించారు. భారీ వర్షంతో ఈ పట్టణం అతలాకుతలం అయింది. అనేక చోట్ల ఇళ్ల వద్ద భారీ స్థాయిలో బురద మేటలు వచ్చి చేరాయి. అనేక మార్కెట్‌లలో అడుగుతీసి అడుగు వేయడానికి వీల్లేకుండా ఉంది. ప్రజలు ఎక్కడికక్కడ బందీ పరిస్థితిని ఎదుర్కొన్నారు.పూర్తి స్థాయిలో సహాయక చర్యలు చేపట్టినట్లు- రాష్ట్ర విపత్కర పరిస్థితుల నిర్వహణ కేంద్రం తెలిపింది. వరద కాలువ తున్ని గధేర పొంగిపొర్లుతూ సమీపంలోని పిందార్ నదిలో ఉధృత రీతిలో చేరుకునే క్రమంలో మధ్యలోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. దారి పొడవునా అనేక వాహనాలు బురదలో కూరుకుపొయ్యాయి. ఓ ప్రాంతంలో జరిగి,న దుర్ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. వరదల తీవ్రతకు ఓ వ్యక్తి కొట్టు-కుపోయాడు. ఇప్పటికీ అనేక చోట్ల పలువురి ఆచూకి లేకుండా పోయింది. పరిస్థితిపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. మహిళ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు ఆదేశించారు.

# చెన్నూరు ఎస్‌బిఐ వ్యవహారంలో విస్తుపోయే నిజాలు

### రూ.12.61 కోట్ల బంగారం, రూ.1.10 కోట్ల నగదు అపహరణ

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంక్ అధికారులు




**చెన్నూరు, ఆగస్ట్ 23 :** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్‌బీఐ-2 బ్రాంచిలో బంగారం, నగదు భారీగా అపహరణకు గురైనట్లు- అధికారులు గుర్తించారు. బ్యాంకు అధికారుల ఆడిట్ నేపథ్యంలో ఈనెల 21న ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గత 3 రోజులుగా బ్యాంకు, పోలీసు అధికారులు విచారణ జరిపారు. రూ.12.61 కోట్ల విలువైన బంగారం, రూ.1.10 కోట్ల నగదు అపహరణకు గురైనట్లు- తేలడంతో శనివారం బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన నరిగె రవీందర్ ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్నారు. అతడితో పాటు- మరో తొమ్మిది మంది అనుమానితులను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. నరిగె రవీందర్, కొంగండి బీరేశ్, నరిగె సరిత, నరిగె స్వర్ణలత అలియాస్ గోపు, ఉమ్మల సురేష్, కొదటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎసంపల్లి సాయికిరణ్, ఎల్.సందీప్, మోత్కూరి రమ్యలపై కేసు నమోదు చేసినట్లు- సీఐ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టు-కుని బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ రితీశ్‌కుమార్ గుప్తా స్థానిక బ్యాంకులో విలేకరులతో మాట్లాడుతూ.. జరిగిన ఘటనపై తాము పూర్తి స్థాయిలో విచారణ జరిపి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు- చెప్పారు. బ్యాంకు ద్వారా వినియోగదారులకు ఎలాంటి ఆర్థిక నష్టం వాటిల్లదని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# అధికారిపై కక్షతో తాగునీటిలో పురుగుల మందు

### విద్యార్థుల అస్వస్థతతో బయటపడ్డ బండారం

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్ 23:** అధికారిపై కక్షతో గురుకుల పాఠశాల సిబ్బంది తాగునీటిలో పురుగుల మందు కలిపడంతో విద్యార్తులు అస్వతస్థకు గురయ్యారు. దీంతో వారంతా ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రం భూపాలపల్లిలో కలకలం రేపింది. పట్టణంలోని గురుకుల విద్యాలయంలో శుక్రవారం కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురుకుల విద్యాలయంలో పనిచేస్తున్న ప్రత్యేక అధికారి బి.వెంకన్నపై కక్షసాధింపు చర్యలో భాగంగా సైన్స్ టీచర్ రాజేందర్‌తోపాటు- మరో ఇద్దరు ఉపాధ్యాయులు, వంట మనిషి నలుగురూ కలిసి తాగునీటిలో పురుగుల మందు కలిపినట్టు- విచారణలో తేలింది. నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ కరే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు పరామర్శించారు. సైన్స్ టీచర్ రాజేందర్ తాగునీటిలో పురుగుల మందు కలిపినట్టు విద్యార్థులు.. కలెక్టర్, ఎస్పీకి తెలిపారు.



## యూరియా కొరతపై హైడ్రామా

### రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం

### మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్ట్ 23 :** రైతు ప్రయోజనాలు పక్కన బెట్టి, ఎరువుల కొరత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రామాకు తెరతీసాయని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. యూరియా కొరత తీర్చడంపై దృష్టి పెట్టడం మానేసి, తమ తప్పు లేదన్నట్లు- చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. 'దేశంలో యూరియా కొరత లేదని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం ఇవ్వడం లేదంటున్నారు. వీరద్దరిలో ఎవరు నిజం? ఎవరు అబద్ధం? ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమా? లేక రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమా' అని హరీశ్ రావు నిలదీసారు. దేశవ్యాప్తంగా 143 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, అందుబాటు లో 183 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని, ఇప్పటికే 155 లక్షల మెట్రిక్ టన్నులు విక్రయించామని కేంద్రం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసారు. ఇదే విధంగా, ఉఆ 45 లక్షల టన్నుల అవసరానికి 49 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయని, కఔ 58 లక్షల టన్నుల అవసరానికి 97 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయని కేంద్రం తెలిపిందని తెలిపినట్లు- గుర్తు చేసారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు నిజమైతే, రైతులకు ఎరువులు అందించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వమే తప్పిదానికి బాధ్యత వహించాలన్నారు. దేశం మొత్తంలో ఎరువుల కొరత లేకపోయినా, తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు పడుతుండటం రేవంత్ సర్కారు నిర్లక్ష్యాన్ని చూపుతుందని విమర్శించారు. రైతులను మోసం చేయడం మానేసి, తక్షణమే అవసరమైన ఎరువులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## సిరిసిల్ల కార్మికులను ఆదుకోండి

### రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలు మాఫీ చేయండి

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కేటీఆర్ లేఖ



**హైదరాబాద్,ఆగస్ట్ 23 :** సిరిసిల్లలోని పవర్ లూమ్ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. పవర్ లూమ్ కార్మికులపై పడుతున్న రూ.35.48 కోట్ల బ్యాక్ బిల్లింగ్ బకాయిలను మాఫీ చేసి, వారికి రావాల్సిన రూ.101.77 కోట్ల విద్యుత్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. సిరిసిల్ల ప్రాంతం పవర్ లూమ్ పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ సుమారు 25 వేల పవర్ లూమ్‌లు నడుస్తున్నాయని లేఖలో కేటీ-ఆర్ వివరించారు. మారిన మార్కెట్ పరిస్థితులతో బతకలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకున్న సిరిసిల్ల నేతన్నల తలరాత మార్చేందుకు తమ హయాంలో బతుకమ్మ చీరల పథకం తీసుకొచ్చామన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పని దొరకడంతో పాటు స్థిరమైన ఆదాయం లభించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం పవర్ లూమ్ యూనిట్లు- ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులను తిరిగి ఆత్మహత్యల వైపు నెడుతున్నాయని కేటీ-ఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుటీర పరిశ్రమల కేటగిరీ కింద 50 శాతం విద్యుత్ టారిఫ్ సబ్సిడీ పొందుతున్న యూనిట్లు-, అవగాహన లోపంతో ఎస్ఎస్ఐ యూనిట్లుగా మారడంతో ఇండస్ట్రీ కేటగిరీ కిందకు వచ్చాయని కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు, అలాగే 191 ఇతర యూనిట్లకు మొత్తం రూ.35.48 కోట్లు- బ్యాక్ బిల్లింగ్ బకాయిలు పడ్డాయని తెలిపారు. ఈ భారీ మొత్తాన్ని చెల్లించే స్థితిలో కార్మికులు లేరని, ఫలితంగా వారికి పవర్ లూమ్స్ నడపడం కష్టంగా మారిందన్నారు. పవర్ లూమ్స్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.101.77 కోట్ల సబ్సిడీ విడుదల కాకపోవడంతో, సిరిసిల్ల కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లయ్ సొసైటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని కేటీఆర్ తెలిపారు. టీ-జీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించాల్సిన విద్యుత్ కొనుగోలు ఖర్చులను కూడా చెల్లించలేకపోతున్నదని వివరించారు. నేత కార్మికులను ఆదుకోవడానికి, వారి జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీ-ఆర్ కోరారు. బకాయిలను మాఫీ చేసి, సబ్సిడీలను విడుదల చేసి నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# బ్యాట్ దొంగతనం కోసం వెళ్లి..

### అడ్డుకున్న సహస్రను చంపేసిన బాలుడు

### వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి




హైదరాబాద్, ఆగస్ట్ 23: ఓటీటీలో క్రైమ్ వెబ్ సిరీస్‌లు చూసి.. పక్కాగా ప్లాన్ చేసి.. ఎనిమిదేండ్ల సహస్రను పదో తరగతి విద్యార్థి అత్యంత దారుణంగా కత్తితో పొడిచి చంపిన సంగతి తెలిసిందే. ఒక్క బ్యాట్ కోసమే ఆ బాలికను చంపినట్లు- నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు- సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఇవాళ వెల్లడించారు. అయితే సహస్ర హత్యకు కారణమైన బ్యాట్‌ను పోలీసులు మీడియా ముందు ప్రదర్శించారు. ఇక ఆ బ్యాట్‌పై రెడ్ కలర్ గుర్తులో ఎంఆర్ఎఫ్ అని రాసి ఉంచారు. సహస్ర తమ్ముడు రెగ్యులర్‌గా ఈ బ్యాట్‌తో క్రికెట్ ఆడేవాడని, దాన్ని చోరీ చేయాలనే ఉద్దేశంతోనే సహస్ర ఇంటికి చోరీకి వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలిందని సైబరాబాద్ సీపీ తెలిపారు. కిచెన్‌లో ఉన్న బ్యాట్‌ను చోరీ చేసే క్రమంలో చిన్న అలజడి రేగడంతో.. సహస్ర అప్రమత్తమై ఎదురించింది. దీంతో ఆమెను బెడ్‌రూంలోకి తోసేసి కత్తితో 18 సార్లు పొడిచి చంపినట్లు- నిందితుడు ఒప్పుకున్నాడు. అయితే ఈ నేరాన్ని అంగీకరించేందుకు నిందితుడు.. రకరకాల కట్టుకథలు సృష్టించినట్లు- పోలీసులు తెలిపారు. చివరకు అతని ఇంట్లో ఉన్న రక్తపు మరకలతో కూడిన బట్టలు, కత్తి అతన్ని పట్టించాయన్నారు. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన కూకట్‌పల్లి సహస హత్య కేసు మిస్టరీ వీడింది. హత్య కేసు మిస్టరీని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. సహస్రను చంపింది పక్కింటి పదో తరగతి బాలుడు అని తెలిపారు. సహస్ర హత్యకు గురైన రోజే తమకు అనుమానం వచ్చి బాలుడిని విచారించామని.. కానీ తనకేమీ తెలియదని అబద్ధం చెప్పాడన్నారు. నాలుగు రోజుల పాటు- అనేక మందిని విచారించామని.. అయితే ఓ పిల్లోడు క్లూ ఇచ్చాడని.. హత్య జరిగిన రోజు ఆగస్టు 18న ఉదయం 8:30-8:40 గంటల సమయంలో సహస్ర ఇంటి సమీపంలో నిందితుడు తచ్చాడుతూ కనిపించినట్లుగా పిల్లోడు సమాచారం ఇచ్చాడని.. దీంతో తమ అనుమానం బలపడిందన్నారు. అనంతరం బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడని చెప్పుకొచ్చారు. గత ఐదేళ్ల నుంచి నిందితుడు సరిగ్గా స్కూల్‌కు వెళ్లడం లేదని.. ఓటీ-టీ-లో -క్రై-మ్ సినిమాలు, మిస్టరీ సీన్లు చూడ్డాం. యూట్యూబ్‌లో క్రైమ్ థ్రిల్లర్ మూవీలు చూడ్డాం అలవాటు- చేసుకున్నాడని.. ఎప్పుడూ స్కూల్ ఎగ్గొట్టి క్రికెట్ ఆడుతుంటాడని తెలిపారు. హత్య జరిగిన రోజు నిందితుడి ఇంట్లో తల్లి తప్ప అందరూ ఉన్నారని.. అదే రోజు తల్లి అడిగితే తనకేమీ తెలియదని అబద్ధం చెప్పాడన్నారు. చివరికి తనకేమీ తెలియదని ఒట్టు కూడా వేశాడని ఆమె తెలియజేసినట్లుగా పేర్కొన్నారు. అయితే రెండు నెలల క్రితం చేతిలో మొబైల్ చూసి.. ఇదెక్కడిది అని అడిగితే సమాధానం ఇవ్వలేదని తల్లి చెప్పినట్లుగా పోలీసులు తెలిపారు. ఇక హత్య చేసిన తర్వాత ఇంటి బయట కత్తి కడిగి.. లోపలికి వెళ్లి ప్యాంట్, టీ షర్ట్‌తోనే స్నానం చేసి అనంతరం ఆ బట్టలను వాషింగ్ మిషన్‌లో వేసేశాడని వివరించారు. అయితే తమకు అనుమానం ఇచ్చి నిందితుడి ఇల్లు తనిఖీ చేయగా ఒక లెటర్ దొరికిందని.. అది ఈ హత్య కోసం కాదని చెప్పారు. ఇక అదే రోజు కుందేల్ కూడా చనిపోయిందని.. దాని స్టోరీ కూడా తమకు చెప్పాడని పేర్కొన్నారు. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లినా కుందేల్ బతకలేదని చెప్పినట్లుగా తెలిపారు. కేవలం సహస్ర తమ్ముడి బ్యాట్ నచ్చడంతో.. దాన్ని దొంగిలించాలని స్కెచ్ వేశాడని.. చోరీ చేస్తుండగా సహస్ర చూడడంతో చంపేశాడని పోలీసులు వివరించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ధర్మస్థల వ్యవహారం అంతా ఉత్తిదే

- అబద్ధాలతో బురిడీ కొట్టించిన ముసుగు వ్యక్తి
- తవ్వకాలతో పోలీసులను పరుగెత్తించిన భీమా
- అబద్ధమనిచెప్పడంతో అరెస్ట్ చేసిన సిట్




**బెంగళూరు, ఆగస్ట్ 23:** ధర్మస్థల వ్యవహారం అంతా తూచ్.. అన్నట్లుగా తయరయ్యింది. కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థల ఆలయ పరిసరాల్లో సుమారు 100కు పైగా మృతదేహాలను ఖననం చేశానంటూ భీమా 15 రోజులుగా ఆడుతున్న నాటకానికి సిట్ బృందం తెరదించింది. మాయమాటలతో వ్యవస్థను నమ్మించి విచారణలో పదేపదే తన వాదనలు మార్చిన భీమా చివరకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడు. దీంతో ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందం పారిశుధ్య కార్మికుడు భీమాను అదుపులోకి తీసుకుంది. ఇంత డ్రామా ఆడటానికి కారణాలేంటని రాబట్టేందుకు సిట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. విచారణ అనంతరం భీమాను కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన బెంగళూరుకు చెందిన సుజాత భట్‌పైనా విచారణ కొనసాగుతోంది. ఆమె, తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థలలో అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. కానీ, తాజాగా ఆమె ఆ ఆరోపణలను తిరస్కరించింది. దీంతో సుజాతను కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధర్మస్థల శైవ క్షేత్రంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన భీమా అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం సంచలన ఆరోపణలు చేశాడు. 1995 నుండి 2014 మధ్య లైంగిక వేధింపులకు గురై హత్య చేయబడ్డ 100కు పైగా మహిళలు, పిల్లల మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని.. 2014లో తమ కుటుంబంలోని ఓ యువతిని లైంగికంగా వేధించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశ వ్యాప్తంగా కలకలం చెలరేగింది. పశ్చాతాపం వెంటాడుతుండటంతోనే ఈ ఫిర్యాదు చేసినట్లు- భీమా వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందాన్ని రంగంలోకి దింపింది. భీమా చెప్పిన ప్రకారం పలు చోట్ల సిట్ అధికారులు తవ్వకాలు జరిపారు. కేవలం రెండు ప్రదేశాల్లోనే కొన్ని ఎముకలు కనిపించాయి. స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో సిట్ అధికారులకు ఫిర్యాదుదారుడైన భీమా ఆరోపణలపై అనుమానం రేకెత్తింది. దీంతో లోతుగా దర్యాప్తు నిర్వహించగా ఆశ్చర్యకరమైన నిజాలు వెల్లడయ్యాయి. విచారణలో భీమా కూడా మాట మార్చాడు. వేరెవరో ఒక పుర్రె ఇచ్చి పోలీసులకు ఇమ్మన్నారని.. కోర్టులో పిటిషన్ కూడా వారే వేయించారని.. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉన్నానని అతడు పేర్కొనడంతో సిట్ అధికారులకు దిమ్మతిరిగి పోయింది. దీంతో ఇదంతా డ్రామాగా గుర్తించి భీమాను అరెస్టు చేశారు. అతడు అబద్ధాలు చెప్పి, ప్రజలను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఇప్పటికే అతడు మాట మార్చిన సంగతి తెలిసిందే. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించాడన్న అభియోగాలపై భీమాను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిన్న రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సిట్ ప్రధాన అధికారి ప్రణబ్ మొహంతీ అతడిని విచారించారు. మాయమాటలతో మొత్తం వ్యవస్థను నమ్మించి చివరికి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడని ఈ దర్యాప్తులో విచారణ బృందం గుర్తించింది. దీంతో అతడిని అరెస్టు చేసింది. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు- పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేయడంతో దేశమంతా ఉలిక్కిపడింది. ఇకపోతే ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోఫలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు- చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు.



## నిస్వార్థ రాజకీయ నేత

# సురవరం!

సంపాదకీయం

రాజకీయాల్లో స్వార్థపరులే తప్ప నిస్వార్థపరులు ఉండరు... అన్న కాలంలో నేనున్నానని చెప్పుకునే ఉదాత్త లక్షణాలు కలిగిన నేత సురవరం సుధాకర్ రెడ్డి. ఆజన్మాంతం సామాన్యుడిగా ఉంటూ..అసామాన్య రాజకీయ ప్రతిభను ప్రదర్శించిన వ్యక్తి సురవరం. ఆయన తెలుగువాడు కావడం మనమంతా గర్వించాలి. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఉంటూనే దేశ రాజకీయాల్లో ప్రభావశీలమైన పాత్రపోషించారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్న ఆయన కోరిక మాత్రం తీరకుండానే పోయారు. పుట్టినవారు గిట్టక మానరు...అయితే జీవించినంత కాలం ఏం సాధించామన్నది ముఖ్యం. అదే సురవరంలో మనం చూస్తాం. ఎప్పుడూ ప్రజల గొడవతోనే ఆయన జీవితం ముడిపడి ఉండేది. తెలంగాన కమ్యూనిస్టు దిగ్గజాలలో గతేడాది సీతారాం ఏచూరిని కోల్పోయాం. ఏడాదిలోపే ఇప్పుడు సురవరంను కోల్పోయాం. జాతీయ రాజకీయాల్లో తెలుగువారు కనుమరుగు అవుతున్నారు. గట్టిగా నిలబడే నేతలు లేకుండా పోతున్నారు. ఈ క్రమంలో సురవం వృద్ధాప్య కారణాలతో మనలను వీడిపోయారు. ఆయన రాజకీయాల్లో అజాతశత్రువు... అంతకు మించి నిస్వార్థ రాజకీయ నేత. పీడిత,తాడిత వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ... చెప్పాలంటే అరుదైన మట్టిమనిషి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శిగా సురవరం సుధాకర్ రెడ్డి తనవంతుగా దేశానికి ఋషిలా పనిచేశారు. సమస్యలు ఎక్కడున్నా వాటికోసం పోరాడేందుకు ఎప్పుడూ ముందుండే వారు. సమస్యలపై ఎంత గట్టిగా పోరాడేవారో ఆయన అంతకుమంచి సౌమ్యుడు. ఆయన సౌమ్యత్వానికి, పోరాటానికి పొంతన ఉండేది కాదు. కానీ జన్మతః వచ్చిన మృదు స్వభావం కారణంగా ఆయన అజాత శతృవు అయ్యారేమో అనిపిస్తుంది. ఎందుకంటే సురవరం అంటే నచ్చని నేత ఉండేవాడు కాదు. ఆయన మాట్లాడినంత సేపు ఇంకా మాట్లాడాలనిపిస్తుందని అనేవారు. సాదాసీదాగా ఉంటూ జాతీయ రాజకీయాల్లో చెలామణి కావడం కష్టం. కానీ అది సాధ్యమని రుజువు చేసిన దిగ్గజనేత సురవం. తెలంగాణ వైతాళికుడు, గోల్కొండ పత్రిక వ్యవస్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డి తమ్ముడు వెంకటరామిరెడ్డి కుమారుడు సుధాకర్‌రెడ్డి. అందుకేనేమో అటు తండ్రి, ఇటు పెదనాన్న వారసత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. ఒకవైపు పెదనాన్న సాంస్కృతిక ఉద్యమ ఆదర్శాలను, మరోవైపు తండ్రి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న సుధాకర్‌రెడ్డి... చిన్నవయసులోనే సమస్యలపై పోరుబాట పట్టిన తీరు అమోఘం. చిరు ప్రాయంలోనే ఆయన మెదడులో నాటుకున్న పోరాటస్ఫూర్తికి అది నిదర్శనంగా చూడాలి. కర్నూలులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంపై నిరసన చేపట్టారు. అది ఉద్యమంగా రూపుదిద్దుకొని నగరంలోని మిగతా విద్యాలయా లకు వ్యాపించింది. విద్యార్థి దశలోనే సమస్యలపై శంఖారావం పూరించడ యనకు అక్కడితోఏ అబ్బింది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా సురవరం ఎదిగారు. దివంగత జైపాల్ రెడ్డితో పాటు ఆయన కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో రాటుదేలారు. ఎన్నో వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారు. రెండుసార్లు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడని చెప్పక తప్పదు. ఆచన చేసిన పోరాటలు,ప్రజా ఉద్యమాల పట్ల ఉన్న నిబద్దత కారణంగా ప్రజానేతగా సురవరం గొప్ప పేరు సంపాదించుకున్నారు. పీడిత వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం కృషి చేశారు. తెలంగాణ మట్టి బిడ్డగా, మార్క్సిస్టు ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయనది విడదీయరాని అనుబంధం. ఏఐఎస్ఎఫ్ నుంచి ప్రారంభమైన ఆయన ప్రస్థానం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు సాగింది. 2012 నుంచి 2019వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవిలో కొనసాగారు. మూడు దఫాలుగా ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేసిన పోరాటంలో సురవరం సుధాకర్ రెడ్డి ముఖ్యపాత్ర పోషించారు. చంద్రరాజేశ్వరరావు తరువాత జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా సురవరం నిలిచారు. 1960లో ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆతర్వాత కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం కోసం ఏర్పాటు చేసిన సమ్మెకు కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కమిటీ- 62రోజుల పాటు- చేసిన సమ్మెకు నాయకత్వం వహించారు. అనంతరం కర్నూలులోని కళాశాల విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలను సురవరానికి అప్పగించారు. 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు. దీంతో ఆయన దిల్లీకి మకాం మార్చారు. 1969లో రెండోసారి ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. 1970లో ఏఐఎస్ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్‌నకు జాతీయ అధ్యక్షుడయ్యారు. 1971లో కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన సీపీఐ 9వ నేషనల్ కౌన్సిల్ సమావేశాల్లో జాతీయ కమిటీ- సభ్యుడయ్యారు. 1974లో తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సురవరం ఆనాటి నుంచి 1984 వరకు సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1985, 90లో కొల్లాపూర్ అసెంబ్లీ నుంచి సురవరం సుధాకర్ రెడ్డి పోటీ- చేసి ఓటమి చవిచూశారు. 1994లో కర్నూలులోని డోన్‌లో ముఖ్యమంత్రి విజయభాస్కర్‌రెడ్డిపై పోటీచేసి ఓడిపోయారు. 1998లో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలా ఒక్కో మెట్టు ఎక్కినా, ఒదిగే ఉన్నారు. ఇంతటి ఉన్నత లక్షణాలు, ఉదాత్త ఆశయాలు కలిగిన సురవరం మనవాడు కావడం మన అదృష్టం.

# సల్వాజుడుం తీర్పు సుప్రీం కోర్టుది

## దానిని కేంద్రహోంమంత్రి అమిత్ షా చదివితే బాగుంటుంది

### ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 23:** సల్వా జుడుం తీర్పుపై కేంద్రహోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ అది తాను ఇచ్చినది కాదని, సుప్రీం కోర్టు తీర్పు అని స్పష్టం చేశారు.కేంద్ర హోంమంత్రితో ఈ విషయంపై నేరుగా చర్చకు దిగాలని అనుకోవడం లేదు. గతంలో ఆ తీర్పు నేనే రాశాను. కానీ, అది నా తీర్పు కాదు.. సుప్రీం కోర్టు ఇచ్చినది. 40 పేజీల ఆ తీర్పును అమిత్ షా చదవాలని ఆశిస్తున్నా. ఒకవేళ అది చదివి ఉంటే ఆ వ్యాఖ్యలు చేసి ఉండేవారు కాదు. ఇదే నేను చెప్పదలచుకున్నా. ఇంతటితో ఈ చర్చను ఆపేద్దాం అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో లోటు కనిపిస్తోందని, రాజ్యాంగం కూడా సవాళ్లు ఎదుర్కొంటోందని ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఎంపిక చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కులగణన అవసరమని ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయ పడ్డారు. తెలంగాణలో కులగణనకు సంబంధించి ఆయన చొరవ తీసుకున్నారు. కుల గణనపై మాట్లాడుతూ.. సామాజిక ఆర్థిక విధానాల రూపకల్పన కోసం దీనిని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా విపక్షాలు ఏకగ్రీవంగా ఎంపికచేయడం గౌరవంగా భావిస్తున్నా. ఇది 64శాతం ప్రజల ప్రాతినిధ్యాన్ని సూచిస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక అనేది ఇద్దరి అభ్యర్థుల మధ్య పోటీ కాదు, రెండు భావజాలాల మధ్య పోటీ-. ప్రజాస్వామ్యం అంటే పరస్పర చర్చ మాత్రమే. వ్యక్తులు, వారి ఆలోచనల మధ్య సంఘర్షణ కాదు. జాతీయ అంశాలపై గతంలో అధికార, విపక్ష పార్టీలు సమన్వయం చేసుకునేవి. దురదృష్టవశాత్తు ఇప్పుడది కనిపించడం లేదు. పార్లమెంటు కార్యకలాపాలకు సభ్యులు అప్పుడప్పుడు 'అంతరాయం' కలిగించడం కూడా ఒక విధమైన నిరసన మాత్రమే. అయితే, ప్రజాస్వామ్య ప్రక్రియలో అది అంతర్భాగంగా మారకూడదు. ఒకప్పుడు లోటు- ఆర్థిక వ్యవస్థ గురించి చర్చ జరిగేది. కానీ, ఇప్పుడు మాత్రం ప్రజాస్వామ్యంలో లోటు- గురించి మాట్లాడుకుంటున్నాం. భారత్ ప్రజాస్వామ్య దేశం కాదని అనడం లేదు. ఇప్పటికీ మనది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యమే. అయితే, ప్రస్తుతం అది ఒత్తిడికి గురవుతోందని భావిస్తున్నా అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రధాని మోడీపై తేజస్వీ అభ్యంతరకర పోస్ట్

## మహారాష్ట్ర, యూపీల్లో కేసులు నమోదు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 23 :** బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌పై మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాలో కేసు నమోదైంది. ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ స్థానిక ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. గడ్చిరోలీ ఎమ్మెల్యే మిలింద్ నరోటే ఫిర్యాదు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రధాని బిహార్ పర్యటన నేపథ్యంలో తేజస్వి యాదవ్ అభ్యంతరకర పోస్టు పెట్టారని నరోటే ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే నరోటే ఫిర్యాదు మేరకు పోలీసులు తేజస్వి యాదవ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల మేరకు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం, పరువుకు భంగం కలిగించడం,శాంతికి విఘాతం కలిగించే ఉద్దేశంతో అవమానించడం కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే యూపీలో కూడా తేజస్విపై కేసు నమోదైంది. షాజహాన్‌పూర్ బీజేపీ మెట్రోపాలిటన్ అధ్యక్షురాలు శిల్పి గుప్తా ఫిర్యాదు మేరకు ఆయనపై బజార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇక బిహార్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనపై మండిపడ్డారు. వారి పాలనను చీకటి యుగంగా అభివర్ణించారు. ప్రధాని ఆరోపణలపై తేజస్వి ప్రతి విమర్శలు చేశారు. గయాలో ప్రధాని అసత్యాలు పలికారని అన్నారు. ప్రజలు మాత్రం వీటిని నమ్మరని తేల్చి చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలన వివరాలను కూడా చెప్పాలని సవాలు విసిరారు.

# మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

## ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినహాయింపు




**ముంబై, ఆగస్ట్ 23:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్‌ప్లాజాలలో టోల్ మినహాయింపు కల్పిస్తున్నట్లు ప్రకటన చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కాలుష్యం తగ్గించడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కొనగోలును ప్రోత్స హించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతన్న కాలుష్యం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభు త్వం కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు మొదలు పెట్టింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ మినాహాయింపు ప్రకటించింది. ఎలక్ట్రిక్ కార్లు, బైకులకు టోల్ ఫ్రీ చేస్తూ.. నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడానికి మొగ్గుచూపుతారని ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. దీనితో పాటు రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఏర్పాడుతాయని భావిస్తుంది. గతంలో ఢిల్లీలో వాహన కాలుష్యంతో ఏర్పడిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోనూ వాహన కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం టోల్ ట్యాక్స్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## ఐదుగురు యాత్రికుల దుర్మరణం

**న్యూయార్క్, ఆగస్ట్ 23 :** అమెరికాలోని న్యూయార్క్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెంబ్రోక్ శివారులో యాత్రికుల బస్సు బోల్తాపడడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. పలువురు గాయపడడంతో హెలికాప్టర్లలో వారిని ఆస్పత్రికి తరలించారు. 50 మంది బస్సులో నయాగారా నుంచి న్యూయార్క్‌కు వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించకపోవడంతో త్వరగా బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారత్, చైనా, ఫిలిఫ్ఫీన్స్‌కు చెందిన యాత్రికులు నయాగారా జలపాతం అందాలను వీక్షించి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు. ఈ ఘటన న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం 24 ఆగస్టు 2025
కరీంనగర్




# 9 టు 5 జాబా?..

## ఇలా చేస్తే మీ ఆరోగ్యం మీచేతుల్లో..

ఆరోగ్యానికి నడక ఎంత మేలు చేస్తుందో ప్రత్యకంగా చెప్పక్కర్లేదు. నిజం చెప్పాలంటే సకల రోగాలు సరిగా నడవకపోవటం వల్లే వస్తాయి. ఎందుకంటే.. మన శరీరం మొత్తం ఇంటర్ లింక్ అయి ఉంటుంది. మానసిక ఆరోగ్యం.. శారీరక ఆరోగ్యంపైన.. శారీరక ఆరోగ్యం మానసిక ఆరోగ్యంపైన డిపెండ్ అయి ఉంటాయి. రెండిటిలో ఏది చక్కగా లేకపోయినా.. రెండో దానిపై ఎఫెక్ట్ పడుతుంది. ప్రతీ రోజూ వ్యాయామం చేస్తే చాలా వరకు ఆరోగ్య సమస్యల్ని దూరం పెట్టొచ్చు. అయితే, కొంతమందికి వ్యాయామం చేయాలన్న ఆసక్తి ఉండదు.

అలాంటి వారు నడకను ఆశ్రయించటం ఉత్తమం. ప్రతీ రోజూ 10 వేల అడుగులు వేస్తే ఆరోగ్యంగా ఉంటాము. కానీ, 9 టు 5 జాబ్ చేసే వారికి ఇది కష్టతరమైన పని. రోజులో 8 గంటలు ఆఫీస్‌లోనే గడిచిపోతాయి. అన్ని అడుగులు వేయటం ఓ కలలాగా మిగిలిపోతుంది. అలాంటప్పుడు ఈ ట్రిక్స్ ఫాలో అయితే ఆ కలను సాకారం చేసుకోవచ్చు. 10 వేల అడుగుల్ని సులభంగా వేసేయవచ్చు. ఇందుకోసం మీరు పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. పనిని మధ్యలో ఆపాల్సిన అవసరం అంతకంటే లేదు.

**10 వేల అడుగులు వేసే ట్రిక్స్..**

**చిన్న చిన్న బ్రేక్స్ తీసుకోండి**

గంటలు గంటలు ఒకే చోట కూర్చుని పని చేస్తే.. మీకొచ్చే జీతాన్ని ఆస్పత్రి ఖర్చులకు పెట్టేయాల్సి వస్తుంది. మరీ ముఖ్యంగా డిస్క్ సమస్యలు వస్తే జీవితాంతం ఇబ్బంది పడాలి. అందుకే పనికి ఆటంకం కలగకుండా మధ్యమధ్యలో చిన్న చిన్న బ్రేక్స్ తీసుకోవాలి. నీళ్లు తెచ్చుకోవడానికి, వాష్ రూముకు వెళ్లడానికి, ప్రతీ గంటలో కనీసం 3 నుంచి ఐదు నిమిషాలు అటు, ఇటు తిరగండి.

**కాల్స్, మీటింగ్స్ సమయంలో..**

మీరు ఫోన్ మాట్లాడుతున్నపుడు.. ఆన్‌లైన్ మీటింగ్స్‌లో ఉన్నపుడు నడవడానికి ప్రయత్నించండి. అప్పుడు పనికి ఆటంకం కలగకుండా మీ నడక గోల్ రీచ్ అవ్వొచ్చు.

**మెట్లు వాడండి**

రెండో అంతస్తులోనో, నాలుగో అంతస్తులోనో ఉన్న ఆఫీస్‌కు వెళ్లడానికి మీరు లిఫ్ట్ వాడుతున్నట్లయితే వెంటనే ఆపేయండి. లిఫ్ట్‌కు బదులు మెట్ల మీదనుంచి నడుచుకుంటూ వెళ్లండి.

**లంచ్ బ్రేక్, ఈవినింగ్ వాక్**

లంచ్ బ్రేక్ సమయంలో.. తిన్న తర్వాత నడవటానికి ప్రయత్నించండి. ఇలా చేయటం వల్ల ఫోకస్ కూడా పెరుగుతుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత ఫ్రెష్ అప్ అయి, ఏదైనా స్నాక్ తీసుకుని మళ్లీ నడక మొదలెట్టండి. అప్పుడు ఈజీగా 10వేల అడుగుల గోల్ రీచ్ అవుతారు.



# వర్షాకాలంలో వచ్చే రోగాలకు చెక్ పెట్టాలంటే

## మీ ఇమ్యూనిటీ పవర్‌ను పెంచే ఈ ఆహారాలను తినాలి..!



వర్షాకాలంలో సాధారణంగా చాలా మంది అనారోగ్యాల బారిన పడుతుంటారు. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలతోపాటు దోమలు కుట్టడం వల్ల విష జ్వరాలు కూడా వస్తుంటాయి. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే ఈ వ్యాధుల బారి నుంచి సురక్షితంగా ఉండవచ్చు. పెద్దలు లేదా చిన్నారులు ఎవరైనా సరే రోగ నిరోధక శక్తిని అధికంగా కలిగి ఉండాలి. దీని వల్ల ఎలాంటి రోగాలను అయినా ఎదుర్కోనే శక్తి శరీరానికి లభిస్తుంది. అయితే చాలా మందికి ప్రస్తుతం ఇమ్యూనిటీ పవర్ ఉండడం లేదు. ఇందుకు గాను ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా మన ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవచ్చు. పలు ఆహారాలను ఈ సీజన్‌లో రోజూ తింటే చాలు, దాంతో రోగ నిరోధక శక్తి అమాంతం పెరుగుతుంది. సీజనల్ వ్యాధులు, జ్వరాలకు చెక్ పెట్టవచ్చు. ఇక ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**విటమిన్ సి..**

విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను త్వరగా తగ్గేలా చేస్తుంది. సిట్రస్ జాతికి చెందిన నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లను తినడం వల్ల విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్, కివి పండ్లు, క్యాప్సికం, బ్రోకలీ, బొప్పాయి వంటి వాటిని కూడా తీసుకోవచ్చు. రోజూ ఉదయాన్నే పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తాగుతున్నా కూడా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మన ఇంట్లో ఉండే అనేక మసాలా దినుసులు మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచేందుకు సహాయం చేస్తాయి. ఈ మసాలా దినుసుల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో మసాలా దినుసులను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**మసాలాలు..**


అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. దీన్ని మీరు రోజూ తాగే టీ లేదా సూప్స్‌లో వేసి తీసుకోవచ్చు. లేదా అల్లం రసం తాగవచ్చు. చిన్న అల్లం ముక్కను నేరుగా నమిలి తినవచ్చు. పసుపులో కర్‌క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. పసుపును పాలలో కలిపి తాగుతుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఉల్లి, వెల్లుల్లి కూడా రోగ నిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని పచ్చిగా తింటే ఎంతో మేలు జరుగుతుంది. వెల్లుల్లి రెబ్బలను ఉదయం పరగడుపునే తినవచ్చు. రోజులో ఇతర సమయాల్లో పచ్చి ఉల్లిపాయలను తినవచ్చు. ఇవి ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో వర్షాకాలంలో రోగాలకు అడ్డుకట్ట వేయవచ్చు. అలాగే మిరియాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే పైపరైన్ అనే సమ్మేళనం రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధుల నుంచి రక్షిస్తుంది.

**ప్రో బయోటిక్ ఆహారాలు..**

యాలకులు, లవంగాల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిని కూడా మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలో వేసి తాగవచ్చు. లేదా నేరుగా కూడా తినవచ్చు. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను అమాంతం పెంచి రోగాల నుంచి రక్షిస్తాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే చాలా వరకు రోగాలు రాకుండా చూసుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే అందులో ఉండే మంచి బ్యాక్టీరియా ఎల్లప్పుడూ ఎక్కువగా ఉండాలి. ఇందుకు గాను ప్రో బయోటిక్ ఆహారాలు పనిచేస్తాయి. ఇవి మంచి బ్యాక్టీరియాను పెంచి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. దీంతో రోగాలకు చెక్ పెట్టవచ్చు. పెరుగు, మజ్జిగ వంటి ఆహారాలు ప్రో బయోటిక్ ఆహారాలుగా పేరుగాంచాయి. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. అలాగే క్యారెట్లు, చిలగడదుంపలు, బీట్‌రూట్ వంటి ఆహారాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ అధికంగా ఉంటాయి. వీటిని రోజూ తింటున్నా కూడా ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

# బాగా పండిన అరటి పండ్లను తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?

అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. చాలా తక్కువ ధరను కలిగి ఉంటాయి. కనుక వీటిని అధిక శాతం మంది కొనుగోలు చేసి తింటుంటారు. అయితే అరటి పండ్లను చాలా మంది పూర్తిగా పండ్లుగా మారకుండా కాస్త దోరగా ఉన్నప్పుడే తింటారు. కానీ దోరగా ఉన్న పండ్ల కన్నా బాగా పండిన అరటి పండ్లను తింటేనే ఎక్కువ లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బాగా పండిన అరటి పండ్లను తినడం వల్ల సాధారణ పండ్లలో కన్నా రెట్టింపు మొత్తంలో పోషకాలు లభిస్తాయి. ఇలాంటి పండ్లను తింటే అనేక వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అనేక ఆరోగ్య ప్రయోజనాలను సైతం ఇవి అందిస్తాయి. ఈ క్రమంలోనే బాగా పండిన అరటి పండ్లను తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.



**పోషకాలు అధికం..**

సాధారణ అరటికాయల కన్నా బాగా పండిన అరటి పండ్లను తింటే తేలిగ్గా జీర్ణమవుతాయి. చిన్నారులు, వృద్ధులు సైతం ఇలాంటి పండ్లను సులభంగా జీర్ణం చేసుకోగలుగుతారు. దీంతో పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. బాగా పండిన అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. బాగా పండిన అరటి పండ్లపై నల్లని లేదా గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. ఇలాంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని అర్థం చేసుకోవాలి. వీటిల్లో విటమిన్ సి, డోపమైన్ వంటివి కూడా అధికంగా ఉంటాయి. అందువల్ల బాగా పండిన పండ్లను తింటే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో దోహదం చేస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అనేక తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

**గుండె ఆరోగ్యానికి..**

బాగా పండిన అరటి పండ్లలో పొటాషియం సైతం అధికంగా ఉంటుంది. అలాగే మెగ్నిషియం స్థాయిలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె పోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బాగా పండిన అరటి పండు సహజసిద్ధమైన అంటాసిడ్ మాదిరిగా పనిచేస్తుంది. అందువల్ల ఈ పండ్లను తింటే అసిడిటీ తగ్గిపోతుంది. జీర్ణాశయ గోడలపై ఉండే మ్యూకస్ పొర రక్షించబడుతుంది. దీంతో కడుపులో మంట, గుండెల్లో మంట, అజీర్తి నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. బాగా పండిన అరటి పండ్లలో ట్రిప్టోఫాన్ అనే సమ్మేళనం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది ఒక అమైనో యాసిడ్. ఇది మన శరీరంలో సెరొటోనిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. సెరొటోనిన్ ఒక న్యూరోట్రాన్స్‌మిటర్. ఇది మూడ్‌ను నియంత్రిస్తుంది. ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడేస్తుంది. మైండ్ రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. దీంతో మానసికంగా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారు.

**శక్తికి, ఉత్తేజానికి..**

బాగా పండిన అరటి పండ్లను తినడం వల్ల శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. ఈ పండ్లలో ఉండే చక్కెరలను శరీరం సులభంగా గ్రహిస్తుంది. దీంతో తక్షణమే శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. ఉత్తేజంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట నుంచి వెంటనే బయట పడవచ్చు. ఇక బాగా పండిన అరటి పండ్లను తినేటప్పుడు లోపలి గుజ్జులో ఎలాంటి మచ్చలు లేకుండా చూసుకోవాలి. మరీ అతిగా పండిన అరటి పండు నుంచి మురిగిన వాసన వస్తుంది. అలాంటి పండ్లను తినకూడదు. అరటి పండుపై ఒక మాదిరిగా మచ్చలు ఉన్నవి ఎంపిక చేసుకోవాలి. మరీ అతిగా మచ్చలు ఉండకూడదు. అవి లోపల కుళ్లిపోయి ఉండే అవకాశం ఉంటుంది. ఇలా బాగా పండిన అరటి పండ్లను తెచ్చుకుని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# జామ ఆకులు కూడా మనకు ఉపయోగకరమే..

## ఎలా తీసుకోవాలంటే..?

జామకాయలు లేదా పండ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. ఇవి మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. జామకాయలు కాస్త పచ్చిగా లేదా దోరగా ఉంటాయి. కొందరు వీటిని ఇష్టపడతారు. ఇంకొందరు కేవలం జామ పండ్లను మాత్రమే తింటారు. అయితే వేటిని తిన్నా మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయి. కానీ మీకు తెలుసా..? జామ ఆకులు కూడా మనకు అనేక లాభాలను అందిస్తాయి. అయితే ఈ ఆకులను నేరుగా తినలేము. కానీ వీటిని నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. కొన్ని జామ ఆకులను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని నీటిలో వేసి మరిగించాలి. అనంతరం ఆ నీళ్లను వడకట్టి వాటిలో కాస్త నిమ్మరసం, తేనె కలిపి ఉదయం పరగడుపున తాగాలి. కుదరకపోతే రోజులో ఏ సమయంలో అయినా తాగవచ్చు. ఇలా జామ ఆకులతో నీళ్లను తయారు చేసి తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.



**షుగర్ లెవల్స్‌కు చెక్..**

జామ ఆకుల నీళ్లను తాగడం వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ నీళ్లను సేవిస్తే మనం తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు చాలా నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ చాలా నెమ్మదిగా పెరుగుతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది. ఈ ఆకుల్లో ఉండే పలు సమ్మేళనాలు షుగర్ లెవల్స్ పెరిగేందుకు కారణం అయ్యే ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకుంటాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు. జామ ఆకుల నీళ్లను తాగుతుంటే అనేక రకాల జీర్ణ సమస్యలు సైతం తగ్గిపోతాయి. ఈ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే హానికర బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. దీని వల్ల విరేచనాలు తగ్గిపోతాయి. జీర్ణాశయంలో ఉండే ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**అధిక బరువు తగ్గేందుకు..**

జామ ఆకుల నీళ్లను ఉదయం పరగడుపును తాగుతుంటే బరువు నియంత్రణలో ఉంటుంది. అధికంగా బరువు ఉన్నవారు ఈ నీళ్లను తాగుతుంటే బరువు తగ్గుతారు. శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. ఈ నీళ్లను తాగడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకోవచ్చు. దీని వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు రోజూ జామ ఆకుల నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. జామ ఆకుల్లో పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి హృదయ సంబంధిత వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ఆకుల నీళ్లను తాగితే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ట్రై గ్లిజరైడ్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఈ ఆకుల్లో ఉండే పొటాషియం బీపీని నియంత్రణలో ఉంచుతుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

జామ ఆకుల్లో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీని వల్ల శరీరం అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. అలాగే ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. జామ ఆకులను బాగా కడిగి నోట్లో వేసుకుని బాగా నమిలి కాసేపు ఉంచి ఉమ్మేయాలి. లేదా జామ ఆకుల నీళ్లను నోట్లో పోసుకుని పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా చేయడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. ఈ ఆకుల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోట్లో ఉండే బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గడంతోపాటు దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా జామ ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
6 కరీంనగర్ ఆదివారం 24 ఆగస్టు 2025



# గాజుల గలగల! మెహందీ మిలమిల!!



కలుసుకునే తల్లులు.. ఆసుపత్రుల్లో.. మార్కెట్లో.. షాపింగ్ లలో పరిచయమైన ఆడవారంతా ఇప్పుడు 'తమ స్నేహ బంధాని'కి ఒక కొత్త రూపం తీసుకొచ్చారు .ఆ బంధం మరింతగా బలోపేతం చేసేందుకు మహిళలంతా 'వీకెండ్ కలయికకు' పునాది వేశారు. ఆడవారికి ఇష్టమైన 'గోరింటాకు' పెట్టుకోవడం..'గాజులు' వేసుకోవడం.. వచ్చిన వారంతా ఆనందంగా గడిపేందుకు 'సేమ్యాలు.. స్వీట్లు' పంచుకోవడం.. 'బిర్యానీ' దావతులు చేసుకోవడం వరకు మరలుతోంది. ఇలాంటి వేడుకలను మగాళ్లు 'తాగడం-తినడం-ఊగడం-ఊరేగడం' దావతుల పేరిట 'నిత్యం ఎంజాయ్' చేస్తోంటే..స్నేహాల ముసుగులో మీరేనా సెలబ్రేట్ చేసుకునేది.? ఏం మాకు లేరా స్నేహితులు..? మేం చేసుకోలేమా 'సెలబ్రేట్'.! మేం మీలా తాగితందనాలాడం..అనురాగం.. ఆప్యాయత.. పరస్పర సహకార బంధం.. బాధలు.. గాధలు.. ఓదార్పు.. పండగలు.. పబ్బాలు.. చుట్టాలు.. బంధాలు.. సంబంధాలు.. అన్నీ చర్చించుకోవడానికి 'సంథింగ్ స్పెషల్' ఉండేలా ఇలా ప్లాన్ చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఇప్పుడీ ట్రెండ్ 'వనభోజన ప్రవంతి'గా మారి.. రాష్ట్ర మంతా వ్యాపించినా ఆశ్చర్యపోనక్కరలేదంటున్నారు.. మన 'ఆడ-లేడీస్'.!!

- గోరింటాకు.. గాజులు వేయడం 'ట్రెండ్'
- కిటకిటలాడుతున్న 'లేడిస్ ఎంపోరియాలు'
- స్వీట్ షాపుల వద్ద ఊహించని గిరాకీ..
- ఎవ్రీ వీకెండ్ 'వనభోజన ప్రవంతి'గా మారుతున్న మార్పు
- 'స్నేహితురాళ్ల'కు ఉత్తేజపరుస్తున్న 'ట్రెండ్'
- 'నేటి సాక్షి' కొత్త రకం సండే స్పెషల్

## స్నేహ బంధాల కొత్త వేడుక

జగిత్యాల జిల్లా లోని కోరుట్ల-మెట్‌పల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల 'గాజుల సందడి' కొత్త సంబరాలకు నాంది పలికింది. ఇప్పటి వరకూ మగవాళ్లు మాత్రమే 'స్నేహితుల రోజు' జరుపుకున్నా%ా% మహిళలందరూ ఒకే చోట చేరి గాజులు తొడుక్కోవడం, ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకోవడం మాత్రం అరుదైన దృశ్యం. ఆ సన్నివేశం చూడగానే%ా% 'ఇదే నిజమైన బంధాల గలగలా'ని అనిపించకమానదు.!

## భావోద్వేగాల మేళవింపు

'ఫ్రెండ్స్-డే' అంటే ఇప్పటివరకు మగాళ్లే పార్టీ చేసుకునేవారు. ఈసారి అమ్మాయిలు కూడా తమకంటూ పండుగ చేసుకున్నారు. 'మా స్నేహం మాకు ముద్దు, మా పండుగ మాకు ఆనందం' అన్నట్టుగా గాజుల వేడుకను సరికొత్తగా మార్చేశారు. గాజుల శబ్దం కేవలం గలగలమని మోగుడు మాత్రమే కాదు..అదొక స్నేహాల రాగం. ఆడబిడ్డల మనసులోని స్నేహం, మమకారం, ఆప్యాయత అంతా ఆ గాజుల గలగలలో నిక్షిప్తమైందనిపించింది. నవ్వులు పంచుకుంటూ, ఆటలతో అలరించుకుంటూ, ముచ్చట్లు విరజిమ్ముతూ గడిపిన ఆ సమయం%ా% ఒక్కొరికీ మరువలేని జ్ఞాపకంగా నిలిచిపోతుంది.



## సమాజానికి కొత్త సంకేతం

ఇన్ని రోజులు మహిళల స్నేహం కేవలం చాటు మాటల వరకే పరిమితం అయింది. కానీ ఇప్పుడు వారు ఒకే వేదికపై కలసి ఆనందం పంచుకోవడం%ా% సమాజంలో మహిళల ఆత్మవిశ్వాసానికి, స్వేచ్ఛకు సంకేతంగా కనిపిస్తోంది.'మేమూ వెనకబడి లేము, మాకు స్నేహాల స్వేచ్ఛ కావాల'ని చెప్పినట్లే ఈ వేడుక నిలిచింది.

## ఆహ్వానం ఏం అవసరమండి.?

పెద్ద ఏర్పాట్లు, ఆహ్వాన పత్రిక ఏమీ అవసరం లేదు. ఒక వాట్సాప్ మెసేజ్ చాలు.'ఈ సాయంత్రం గాజుల గ్యాదరింగ్'అన్న మాటకే అందరూ చేరిపోతారు. పింక్ గాజులు, మల్టీకలర్ గాజులు, పూల దండలు, సింపుల్ బైండీలు ఎవరికివారు తాము తెచ్చుకున్నది వేసుకుని పండుగ చేసుకుంటున్నారు.

## భవిష్యత్తులో బంధాల బలోపేతానికి బాట

ఈ గాజుల సందడి ఇంతకుముందు కొన్ని పట్టణాల్లోనూ జరిగింది. అయితే ఇప్పుడు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల-మెట్‌పల్లి ప్రాంతంలో కూడా జరిగి కొత్త ట్రెండ్‌కు తెరలేపింది. రేపు ఇది జిల్లాల దాటి రాష్ట్రవ్యాప్తం అయ్యే అవకాశాలూ ఉన్నాయంటున్నారు. స్నేహం, బంధం, ఆనందం, సంప్రదాయం అన్నీ కలిసిన ఈ వేడుక రాబోయే రోజుల్లో మహిళల సామాజిక చైతన్యానికి వేదికగా మారే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు.

## ఆటలూ-పాటలూ- మజాగా గడిపిన సమయం

చిన్న చిన్న ఆటలు ఆడుకుంటూ, పాటలు పాడుకుంటూ, ఫొటోలు దిగుతూ, రీల్స్ చేస్తూ 'ఈ ఒక్కరోజు సరదాగా గడిపేస్తే వారం పొడవునా టెన్షన్ మరిచిపోతామ'ని జీవితం నిస్సారంగా గడుపుతూ..నిస్తేజంగా ఉండిపోయిన మహిళలు ముచ్చటపడ్డారు.

## సోషల్ మీడియాలో హల్ చల్

ఫొటోలు, రీల్స్ పెట్టగానే 'నీ దగ్గర ఎప్పుడు.? మా దగ్గర ఎప్పుడు.? అన్న ప్రశ్నలు మొదలయ్యాయి. షేర్%-%లైక్‌లతో







ఈ గాజుల సందడి పల్లెలో నుంచి పట్టణాల దాకా చక్కర్లు కొడుతోంది.

**స్నేహం కేవలం మగవాళ్ల సొత్తు కాదు. ఆడబిడ్డల స్నేహబంధం కూడా అంతే మధురం, అంతే ఆప్యాయతతో నిండి ఉంటుంది. ఆ స్నేహాన్ని గాజు శబ్దంతో, గోరింటాకు వాసనతో ఉత్సవంగా మలచిన ఈ వేడుక సంస్కృతి, సంప్రదాయం, ఆధునికత మేళవింపుగా నిలిచిపోయింది.**

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం 24 ఆగస్టు 2025 కరీంనగర్


# శుభ్‌మన్ గిల్‌కు వైరల్ ఫీవర్

## దులీప్ ట్రోఫీకి దూరం... ఆసియా కప్‌కు కూడా డౌటే..?



2025 ఆసియా కప్ ముంగిట టీమ్ఇండియా అభిమానులకు ఆందోళన కలిగించే వార్త. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో దుమ్ముదులిపిన యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తోంది. దీంతో గిల్ ఐదు రోజుల్లో ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీకి దూరం కానున్నాడని వార్తలు వస్తున్నాయి. దీంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.తాజాగా గిల్ వైరల్ ఫీవర్ బారిన పడ్డాడట. ప్రస్తుతం అతడు ఛండీగఢ్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అతడి బ్లడ్ శాంపిల్స్ టెస్టు కోసం పంపారట. రిపోర్ట్ కూడా ఇప్పటికే బీసీసీఐ వద్దకు చేరినట్లు సమాచారం. దీంతో అతడికి దులీప్ ట్రోఫీ నుంచి మినహాయింపు ఇచ్చినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ టోర్నీలో గిల్ నార్త్ జోన్ జట్టుకు కెప్టెన్?గా వ్యవహరించాల్సి ఉంది. అయితే గిల్ గైర్హాజరీ వల్ల ఇప్పుడు జట్టును వైస్ కెప్టెన్?గా ఉన్న అంకిత్ కుమార్ సారథిగా వ్యవహరించే ఛాన్స్ ఉంది. అలాగే గిల్ స్థానంలో శుభమ్ రోహిల్లా జట్టులో ఆడనున్నాడు.మరోవైపు, ఆసియా కప్ కోసం బీసీసీఐ ఇప్పటికే టీమ్ఇండి యా జట్టును ప్రకటించింది. యూఏఈ వేదికగా సెప్టెం బర్ 09న టోర్నీ ప్రారంభం కానుంది. ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ కాగా, గిల్‌ను సెలక్షన్ టీమ్ వైస్ కెప్టెన్‌గా నియమించింది. ఈ టోర్నీ కోసం టీమ్ఇండియా వచ్చే నెల తొలి వారంలోనే దుబాయ్?కు వెళ్లనుంది. అక్కడ 5న తేదీన తొలి ట్రైనింగ్ సెషన్ జరగ నుంది. అప్పటిలోగా గిల్ పూర్తిగా కోలుకుంటే ఎలాంటి సమస్య లేకుండా ట్రైనింగ్?లో పాల్గొంటాడు. అయితే ప్రస్తుతం దులీప్ ట్రోఫీ ఆడడం లేదు. ఆసియా కప్?కు ఇంకో రెండు వారాల సమయం ఉంది. గిల్ ప్రస్తుతం వైరల్ ఫీవరే కాబట్టి, ఈ గ్యాప్‌లో కోలుకునే ఛాన్స్ ఉంది. అందుకే ఆసియా కప్‌కు గిల్ దూరం అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఏం జరుగుతుందో చూడాలి మరి!గిల్‌తోపాటు మరో ఇద్దరు స్టార్ ప్లేయర్లు కూడా దులిప్ ట్రోఫీ నుంచి తప్పుకునే ఛాన్స్ ఉంది. పేస్ బౌలర్లు అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా ఈ ఇద్దరు కూడా ఆసియా కప్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. దీంతో ఈ ఇద్దరూ దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్?లకు మాత్రమే అందుబాటులో ఉంటారు. ఆసియా కప్ కోసం దుబాయ్ వెళ్లిపోతారు.

**ఆసియా కప్‌కు భారత్ జట్టు**

సూర్య కుమార్ యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి , కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్, హర్షిత్ రానా, రింకూ సింగ్

# ఫ్యాన్ పేజ్‌లో ప్రియా సరోజ్ ఫొటో చూసి ఇష్టపడ్డా

## భారత క్రికెటర్ రింకు సింగ్



భారత క్రికెటర్ రింకు సింగ్ ఇటీవల లోక్‌సభ ఎంపీ ప్రియా సరోజ్‌తో ఎంగేజ్మెంట్ చేసుకున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీళ్ల పెళ్లి ఉండనుంది. అయితే రింకునేమో మైదానంలో సిక్స్‌లు బాదుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తాడు. మరోవైపు అతడి కాబోయే భార్య ప్రియా ప్రజల కోసం రాజకీయల్లోకి వచ్చి ఎంపీ అయ్యింది. 2022 ఐపీఎల్‌లో మ్యాచ్ సందర్భంగా ప్రియను తొలిసారి చూసినట్లు రింకూ తెలిపారు. మ్యాచ్ కోసం ప్రియ ముంబయికి వచ్చినప్పుడు ఓ ఫ్యాన్ పేజ్‌లో ప్రియా సరోజ్ ఫొటో చూసి ఆమెను ఇష్టపడినట్లు తెలిపాడు. అలా తనకు ఆమెపై ప్రేమ మొదలైందని వెల్లడించాడు. చూడగానే ఆమెనే తనకు సరైన భాగస్వామి అనిపించిందని, కానీ ఆ విషయం చెప్పడానికి ధైర్యం సరిపోలేదని అన్నాడు. కొన్ని రోజుల తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను ప్రియ లైక్ చేసినట్లు గుర్తించాడట. అప్పుడు ప్రియకు మెసేజ్ చేసినట్లు చెప్పాడు.ఇక అప్పటి నుంచి ఆమెతో రోజూ మాట్లాడేవాడని అన్నాడు. ఇరువురు ఫోన్లో ప్రతిరోజు మాట్లాడుకునేవాళ్లట. అలా కొంత కాలం తర్వాత పెళ్లి చేసుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు పేర్కొన్నాడు. అనంతరం ప్రియ ఎంపీ అయ్యారు. ఆమె ఎంపీ అయ్యాక కూడా తమ మధ్య ఉన్న ప్రేమలో మాత్రం మార్పు రాలేదని రింకూ తెలిపాడు.అయితే ఎంపీగా ఆమె ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేయడం, పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడం, మరోవైపు తాను కూడా వరుస క్రికెట్ మ్యాచ్?లతో బిజీగా ఉండడం వల్ల ఇద్దరికీ సరదాగా మాట్లాడుకోడానికి సమయం దొరికేది కాదని అన్నాడు. అందుకే రాత్రి వేళల్లోనే కాసేపు మాట్లాడుకుంటామని పేర్కొన్నాడు. అలాగే కెరీర్ పరంగా అవసరమైన సమయంలో సలహాలు, సూచనలు ఇచ్చిపుచ్చుకుంటామని రింకూ అన్నాడు.జూన్ 08న లఖ్‌నవూ సెంట్రమ్ హోటల్‌లో రింకూ- ప్రియా సరోజ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ క్రికెటర్లు ప్రవీణ్ కుమార్, పీయూష్ చావ్లా, ఉత్తరప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్ ఆర్యన్ జుయల్ హాజరయ్యారు. అలాగే పలువురు రాజకీయ నేతలు కూడా వచ్చారు. అయితే ఈ వేడుకకు బాలీవుడ్ స్టార్ హీరో, కోల్?కతా నైట్ రైడర్స్ జట్టు ఓనర్ షారుక్ ఖాన్?ను కూడా రింకూ ఆహ్వానించాడు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా షారుక్ ఎంగేజ్?మెంట్ ఈవెంట్?కు రాలేకపోయారని రింకూ వెల్లడించాడు. ప్రియా సరోజ్ ఉత్తర్?ప్రదేశ్? మచ్లీషహర్ నియోజకవర్గం ఎంపీగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. ఆమె తండ్రికి సుదీర్ఘమైన రాజకీయ నేపథ్యం ఉంది. పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు అందించారు. 2022లో ఆమె తండ్రి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రియా ప్రచారంలో చురుగ్గా పాల్గొని అందరి దృష్టిలోకి వచ్చారు.

# ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత దురదృష్టవంతుడిగా రికార్డ్

ప్రపంచంలో 24 గంటల్లో 3 సార్లు ఔట్ అయిన దురదృష్టవంతుడైన బ్యాటర్ ఒకరున్నారు. ఇది ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆశ్చర్యకరమైన రికార్డు. క్రికెట్‌లో ఒక బ్యాట్స్‌మన్ అదృష్టం చాలా దారుణంగా ఉండటం వల్ల 24 గంటల్లో 3 సార్లు ఔట్ కావడం జరిగిపోయింది. పాకిస్తాన్ బ్యాటర్ ఉమర్ అక్మల్ 30 నవంబర్ 2015, 1 డిసెంబర్ 2015 మధ్య 24 గంటల్లోనే ఈ ఆశ్చర్యకరమైన రికార్డును సృష్టించాడు. ఉమర్ అక్మల్ 24 గంటల్లో 3 సార్లు ఔట్ అయ్యాడు. ఉమర్ అక్మల్ ఈ రికార్డు గురించి చాలా తక్కువ మందికి తెలుసు. 2015 నవంబర్ 30న ఇంగ్లాండ్‌తో జరిగిన షార్జా టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో ఉమర్ అక్మల్ 4 పరుగులు చేసిన తర్వాత ఔట్ అయ్యాడు. ఈ సమయంలో ఉమర్ అక్మల్ 9 బంతులు ఎదుర్కొని 4 పరుగులు చేశాడు. క్రిస్ జోర్డాన్ చేతిలో ఇంగ్లాండ్ ఆఫ్ స్పిన్నర్ మోయిన్ అలీ చేతిలో ఉమర్ అక్మల్ క్యాచ్ అవుట్ అయ్యాడు. పాకిస్తాన్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఈ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ టై అయింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఉమర్ అక్మల్ అదృష్టం చాలా దారుణంగా ఉండటంతో ఈ మ్యాచ్‌లో కూడా అతను సూపర్ ఓవర్‌లో ఔట్ అయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో ఉమర్ అక్మల్ 1 పరుగు తర్వాత ఔట్ అయ్యాడు. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ క్రిస్ జోర్డాన్ సూపర్ ఓవర్‌లో ఉమర్ అక్మల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. పాకిస్తాన్‌తో జరిగిన ఈ ఉత్కంఠభరితమైన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరిగిన 24 గంటల్లోనే, బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ 2025లో చిట్టగాంగ్ వైకింగ్స్ జట్టు తరపున ఉమర్ అక్మల్ బ్యాటింగ్‌కు దిగాడు.బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ 2025లో చిట్టగాంగ్ వైకింగ్స్ వర్సెస్ రంగ్‌పూర్ రైడర్స్ మధ్య జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ఉమర్ అక్మల్ చరిత్రలో చెత్త రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో కూడా ఉమర్ అక్మల్ 1 పరుగు చేసి ఔటయ్యాడు. బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్ ఉమర్ అక్మల్‌ను ఔట్ చేశాడు. షకీబ్ అల్ హసన్ ఉమర్ అక్మల్‌ను వికెట్ కీపర్ మహ్మద్ మిథున్ క్యాచ్ అవుట్ చేశాడు. ఈ విధంగా, ఉమర్ అక్మల్ 24 గంటల్లో 24 సార్లు అవుట్ అయిన ప్రపంచంలోనే మొదటి బ్యాట్స్‌మన్ అయ్యాడు.

# ప్రాక్టీస్ ప్రారంభించిన విరాట్ కోహ్లీ



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రాక్టీస్ ప్రారంభించాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన కోహ్లీ.. కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే భారత జట్టు తరఫున వన్డేల్లో పునరాగమనం చేసేందుకు కోహ్లీ కసరత్తు చేస్తున్నాడు. ఆస్ట్రేలియాతో మూడువన్డేల సిరీస్‌తో కోహ్లీ రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అక్టోబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా ఈ సిరీస్ జరగనుంది. ఐపీఎల్ 2025 సీజన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్న విరాట్ కోహ్లీ.. మళ్లీ ఆటపై పట్టు పెంచుకునేందుకు ముందుగానే సన్నాహకాలు ప్రారంభించాడు. లార్డ్స్ వేదికగా ఇండోర్ నెట్స్‌లో రెండు గంటలపాటు బ్యాటింగ్ సాధన చేశాడు. స్పిన్, ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. కోహ్లీతో పాటు రోహిత్ శర్మ కూడా వన్డేల్లోనే కొనసాగుతున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు వీరిద్దరూ టీమ్‌లో కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే దీనిపై ప్రస్తుతానికి అనిశ్చితి నెలకొంది. వారి వయసు రీత్యా వన్డే ప్రపంచకప్ ఆడటం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ప్రచారం కూడా మొదలైంది. అయితే ఈ వాదనను తాజాగా బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా ఖండించాడు. ఓ ఇంటర్వ్యూలో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఇంకా వన్డే క్రికెట్ ఆడుతున్నారని, కాబట్టి వారి వీడ్కోలు గురించి ఇప్పుడే ఆలోచించాల్సిన అవసరం లేదని తెలిపారు. "వారు ఇంకా రిటైర్మెంట్ తీసుకోలేదు కదా? రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ వన్డేలు ఆడుతున్నారు. వారు రిటైర్ కానప్పుడు మీరు వారి వీడ్కోలు గురించి ఎందుకు చింతిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు చాలా ఫిట్‌గా ఉన్నారని, మంచిగా రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# భారత సపోర్ట్ స్టాఫ్‌పై వేటు

## మసాజ్ థెరపిస్ట్ రాజీవ్ కుమార్ తొలగింపు

ఆసియా కప్ 2025 టోర్నీకి ముందు భారత సపోర్ట్ స్టాఫ్‌పై వేటు పడింది. గత 15 ఏళ్లుగా జట్టుకు సేవలు అందిస్తున్న మసాజ్ థెరపిస్ట్ రాజీవ్ కుమార్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) తప్పించింది. ఈ నిర్ణయం వెనుక గౌతం గంభీర్ ఉన్నాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోనూ రాజీవ్ కుమార్ తన సేవలను జట్టుకు అందించాడు. అయితే ఈ నిర్ణయంపై బీసీసీఐ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. 'రాజీవ్‌కుమార్ కాంట్రాక్ట్‌ను పొడగించకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే టీమ్‌మేనేజ్‌మెంట్ రికమెండ్ చేసిన ఓ మసాజర్‌ను బోర్డు నియమించింది.'అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. జట్టుతో పాటు ఎక్కువ కాలం పాటు కొనసాగిన సహాయక సిబ్బందితో ఆశించిన ఫలితాలు రావని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు గంభీర్ తనకు నచ్చిన మసాజర్‌ను జట్టులోకి తీసుకురావడానికి రాజీవ్‌ను తప్పించాడనే వాదన వినిపిస్తోంది. రాజీవ్‌కుమార్‌కు జట్టుతో మంచి అనుబంధం ఉంది. పేసర్లకు చాలా మద్దతుగా నిలిచాడని చెబుతారు. ఆటగాళ్లతో స్నేహపూర్వకంగా ఉంటాడని.. గతంలో షమీ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.గతంలో అరున్ కనడే అనే మసాజ్ థెరపిస్ట్‌ను కూడా బీసీసీఐ పక్కన పెట్టింది. ఇక ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌ను కూడా వెళ్లిపోవాలని సూచించినా మళ్లీ యూటర్న్ తీసుకొని అతనికి మరోసారి అవకాశం కల్పించారు.

**ప్రస్తుత భారత కోచింగ్, సపోర్ట్ స్టాఫ్**

గౌతం గంభీర్(హెడ్ కోచ్), రియాన్ టెన్ డస్కటే(అసిస్టెంట్ కోచ్), సితాన్షు కోటక్(బ్యాటింగ్ కోచ్), మోర్నీ మోర్కెల్(బౌలింగ్ కోచ్), ఆడ్రియన్ లె రౌక్స్(స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్), దిలీప్(ఫీల్డింగ్ కోచ్), రాఘవేంద్ర ద్వివేది(త్రో డౌన్ స్పెషలిస్ట్), ఉపాధ్యాయ(లాజిస్టిక్స్ మేనేజర్), హరి(వీడియో ఎనలిస్ట్)

# బాల్యం నుండే భావి ఛాంపియన్లను గుర్తించాలి

**జాతీయ క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరిలి**

**నేటి నుంచి తొమ్మిది రోజులపాటు జాతీయ క్రీడా దినోత్సవాలు**



**హైదరాబాద్, ఆగస్టు 23 :** పసిప్రాయం నుండే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖమంత్రి వాటికి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే జాతీయ క్రీడ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగించడం వారిని మైదానాల వైపు ప్రోత్సహించడం కుటుంబాలకు మాత్రమే కాకుండా దేశానికి సమాజానికి ఎంతో శ్రేయస్కరమని ఆయన అన్నారు. మొక్కై వంగనిది మానై వంగదు అనే సామెత మాదిరిగా పసిప్రాయం నుండే క్రీడల్లో పట్ల శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడల్లో విజయాలు సాధించడమే కాకుండా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దబడతారని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గారి సహకారంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దేశంలో ఏ రాష్ట్రము నిర్వహించనంత ఘనంగా జాతీయ క్రీడ ఉత్సవాలను నిర్వహించబోతున్నామని, జాతీయ క్రీడా దినోత్సవం అని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా తొమ్మిది రోజుల పాటు వివిధ వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేసే విధంగా అన్ని వయసుల వారికి వర్గాల వారికి వినూత్న కార్యక్రమాలు రూపొందించామని ఆయన అన్నారు. కేవలం హైదరాబాద్ నగరానికే కాకుండా జిల్లా కేంద్రాల్లో వివిధ విద్యాసంస్థల్లో ఈ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ అనిత పి ఆర్ ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు ఫ్యూచర్ ఒలంపియన్ నిర్వాహకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
8 కరీంనగర్ ఆదివారం 24 ఆగస్టు 2025



# ఎన్టీఆర్ స్ఫూర్తితో శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించా

## తల్లి డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర కామెంట్స్

ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై నటి శ్రీలీల తల్లి, డాక్టర్ స్వర్ణలత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించేందుకు ఎన్టీఆర్ స్ఫూర్తి అని తెలిపారు. జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్‌షోలో శ్రీలీల, స్వర్ణలత పాల్గొన్నారు. బాల్యంలో ఎన్టీఆర్ కూచిపూడి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఫొటోని డిస్‌ప్లే చేయగా.. స్వర్ణలత నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. నాకు అమ్మాయి పుడితే డ్యాన్స్ నేర్పించాలని నిర్ణయించుకున్న క్షణాల్ని గుర్తుచేసే ఫొటో ఇది అని తెలిపారు. అప్పుడు ఎన్టీఆర్‌తో మీరు మాట్లాడారా? అని అడగ్గా.. 1997లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 'తానా' సభల్లో మాట్లాడా. అనుకున్నట్టే శ్రీలీలకు డ్యాన్స్ నేర్పించానని స్వర్ణలత తెలిపారు. తాను తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగలనని, కొత్త భాష నేర్చుకోవడం ఎప్పుడూ ఆసక్తే అని శ్రీలీల ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'కెరీర్‌లో దూసుకెళుతున్నావ్. వేరే హీరోయిన్ల అవకాశాలు కూడా తీసుకుంటు-న్నావ్' అని జగపతి బాబు సరదాగా అన్నారు. ఈ ఎపిసోడ్ ఓటీటీ- 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. తొలి ఎపిసోడ్‌లో ప్రముఖ నటు-డు నాగార్జున సందడి చేసిన సంగతి తెలిసిందే. ఇటీ-వల 'జూనియర్' మూవీతో ప్రేక్షకులను పలకరించిన శ్రీలీల.. 'మాస్ జాతర', 'పరాశక్తి' 'ఉస్తాద్ భగత్‌సింగ్' తదితర చిత్రాల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే. 12 ఏళ్ల సాధనలో వందకిపైగా ప్రదర్శనలిచ్చారు.





# కొత్త తరం కథలంటే నాన్నకు ఇష్టం

## తండ్రి కమల్ గురించి శృతిహాసన్

సెలబ్రిటీలు అంటే అందరికీ ఒకే అభిప్రాయం ఉంటుంది. కోట్ల రూపాయలు సంపాదిస్తారు, లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తారు, ఖరీదైన కార్లు, బంగ్లాలు కొంటారు. నిజానికి చాలా స్టార్‌లు కూడా అలానే ఉంటారు. మార్కెట్లోకి వచ్చిన కొత్త లగ్జరీ కార్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తారు. కోట్ల రూపాయల విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్, బ్రాండెడ్ వస్తువులు ఇవన్నీ వారి లైఫ్‌లో భాగమే. కానీ అందరికీ ఒకే ఫార్ములా ఉండదు! విశ్వనటుడు కమల్ హాసన్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటారని అసలు విషయం కూతు శృతి హాసన్ బయటపెట్టింది. ఆయన ఖరీదైన కార్లు కొనరు. విల్లాలు, ఫారిన్ ప్రాపర్టీస్ జోలికే వెళ్లరట. ఈ విషయాన్ని ఆయన కుమార్తె శ్రుతి హాసన్ తాజాగా రివీల్ చేసింది. ఆమె చెప్పిన దానీ ప్రకారం.. 'నాన్నకి తెలిసినది ఒకటే – కొత్త కాన్సెప్ట్‌తో వచ్చే సినిమాల్లో పెట్టు-బడి పెట్టడం. టెక్నికల్ క్వాలిటీ ఉన్న కథలు అంటే ఆయనకు చాలా ఇష్టం. వాటికి అవసరమైన డబ్బు ఖర్చు చేయడంలో ఆయన ఎప్పుడూ వెనుకడుగు వేయరు. ఎందుకంటే నాన్నకు డబ్బు శాశ్వతం కాదన్న నమ్మకం ఉంది. సినిమాల ద్వారా సంపాదించిన దానికంటే పోగొట్టు-కున్నదే ఎక్కువ. కానీ ఇంట్లో చాలా సింపుల్ లైఫ్÷-టసైల్ ఇష్టపడతారు. ఖరీదైన వస్తువుల పై ఆయనకు అసలు ఆసక్తి ఉండదు. విల్లాలు, భూములు, ఫారిన్ ప్రాపర్టీస్ ఏవీ ఆకర్షణీయంగా అనిపించవు. బదులుగా, -టె-క్నాలజీకి సంబంధించిన కొత్త విషయాలు తెలుసుకోవడంలో ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే కొత్త ఐడియాస్, సబ్జెక్ట్స్ ఉన్న డైరెక్టర్స్‌ను ప్రోత్సహించడం ఆయనకు ప్యాషన్' అని శ్రుతి హాసన్ తెలిపింది. అంటే ఇండస్ట్రీలో చాలా మంది స్టార్‌లు సంపాదనతో పాటు- స్థిరాస్తులు కూడబెట్టుకుంటుంటే, కమల్ మాత్రం సినిమాల మీద ప్యాషన్ కోసం సంపాదన అంతా ఖర్చు చేసే వ్యక్తి అని చెప్పవచ్చు.

# కింగ్డమ్ నుంచి అన్నా అంటేనే.. పాట విడుదల




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కింగ్డమ్. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటించగా.. సత్యదేవ్ కీలక పాత్రలో నటించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్-టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఎమోషనల్ సాంగ్ అన్నా అంటేనే పాట ఫుల్ వీడియోను విడుదల చేశారు. అన్నా అంటేనే.. ఉన్నానంటూనే అంటూ తన సోదరుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్‌గా సాగింది ఈ పాట. ఈ పాటను కృష్ణకాంత్ రచించగా, అనిరుధ్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అన్నదమ్ములుగా నటించారు. ఆ ఇద్దరి నేపథ్యంలో సాగే పాటే ఇది.

# కాంతారా ప్రీక్వెల్ ద్వారా వందకోట్లపై దృష్టి



కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన 'కాంతార' సినిమా పాన్-ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. నటుడు రిషబ్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రం కేవలం కన్నడలోనే కాకుండా, తెలుగు స్టేట్స్‌లో కూడా భారీ విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, మేకర్స్ ప్రీక్వెల్‌ని తో రాబోతున్నారు. ఈ ప్రీక్వెల్ అక్టోబర్ మొదటి వారంలో విడుదల కానుంది. అయితే అసలు హాట్ టాపిక్ ఏమిటంటే.. ఈ సినిమా కోసం మేకర్స్ తెలుగు రాష్ట్రాల్లో భారీ బిజినెస్‌ని ఆశిస్తున్నారట. ఏకంగా 100 కోట్ల మేర డీల్ గా మేకర్స్ క్విట్ చేస్తున్నారట. ఇది మాత్రం ఒక షాకింగ్ మొత్తం అని చెప్పాలి. పార్ట్ 1 ఎంత పెద్ద హిట్ అయినప్పటికీ దానికి ప్రీక్వెల్ కూడా అదే రేంజ్ లో హిట్ అవుతుంది అని చెప్పడానికి లేదు. ఇప్పుడు వరకు పాన్ ఇండియా ఆడియెన్స్‌ని ఎ÷-జగైట్ చేసే సాలిడ్ కంటెంట్, -ట్రైలర్, ప్రోమోస్ కూడా రాలేదు. అయినప్పటికీ, మేకర్స్ భారీ బిజినెస్ ఆశిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా సినిమాలు బిజినెస్ విషయంలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'కాంతార ప్రీక్వెల్' కోసం ఇంత భారీ మొత్తం పెట్టడానికి డిస్ట్రిబ్యూటర్లు ముందుకు వస్తారా అన్నదే పెద్ద ప్రశ్న. మరి ఈ రూ.100 కోట్ల డీల్ నిజంగా జరుగుతుందా? లేక ఇది కేవలం మార్కెటింగ్ హైప్ మాత్రమేనా? అన్నది చూడాలి.



# రామాయణ అందరికీ నచ్చి తీరుతుంది

- నచ్చలేదంటే నిర్మాణ లోపంగా భావిస్తాం
- నిర్మాత నమిత్ మల్హోత్రా ఆసక్తికర కామెంట్



బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ' (దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్నది. ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటుడు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కైకేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమా విషయంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా. రామాయణ చిత్రం కేవలం భారతీయ ప్రేక్షకులనే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా నిర్మిస్తున్నామని నిర్మాత నమిత్ మల్హోత్రా అన్నారు. హాలీవుడ్ నుంచి వచ్చిన గ్లాడియేటర్, అవతార్ సినిమాల మాదిరిగానే ఈ చిత్రం కూడా భారీ స్థాయిలో ఉండబోతుందని తెలిపాడు. అయితే ఈ సినిమా ఎంత భారీగా తెరకెక్కించిన కూడా హాలీవుడ్ ప్రేక్షకులకు నచ్చకుంటే ముమ్మాటికి అది మేకర్స్ తప్పేనని నమిత్ మల్హోత్ర తెలిపాడు. అప్పుడు ఈ సినిమా ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనుకుంటానని నమిత్ తెలిపాడు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A0100** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221

# రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ కు కోరుట్లలో ఘన సన్మానం**

- బీజేపీనే ప్రత్యామ్నాయం
- పార్టీ బలోపేతానికి
- కార్యకర్తల ఐకమత్యమే మార్గం
- కేంద్ర పథకాలే బీజేపీ బలం



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వడ్డేపల్లి శ్రీనివాస్‌కు కోరుట్ల పట్టణ శాఖ శనివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%'% 'రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం. రాష్ట్ర ప్రజలకు ప్రత్యామ్నాయం బీజేపీ తప్ప మరెవరూ కారని నిరూపించాల'ని పిలుపునిచ్చారు.

### విభేదాలు మాని ఒక్క తాటిపైకి రావాలి

పార్టీ లోపల ఎవరి మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నా వాటిని పక్కన పెట్టి గెలుపు కోసం కష్టపడాలని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఒక్కో కార్యకర్త ఓ సైనికుడిలా కదిలితే ప్రత్యర్థి పార్టీలకు గట్టి సవాల్ విసరగలమన్నారు.

### ప్రజల్లోకి కేంద్ర పథకాలే ఆయుధం

మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యకర్తల ప్రధాన బాధ్యత అని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం బీజేపీ చిహ్నమని%'% అవే రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సాగర్, మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్, మాజీ అధ్యక్షులు చిరుమళ్ళ ధనుంజయ్, ఇతర నాయకులు చెట్పెల్లి ఓం ప్రకాష్, ఉరుమళ్ళ బ్రహ్మం, కంతం ఉదయ్, గుగ్గిల అశోక్, బీజేవైఎం నాయకులు దమ్మ సంతోష్, తోట నరేష్, మండల నాయకులు పంచర్ విజయ్, తోట లింగారెడ్డి, సీనియర్ నాయకులు తునికి భాస్కర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ లేని కేబుల్ వైర్లు ప్రజల ప్రాణాలకు ముప్పు

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- విద్యుత్ అధికారుల బద్ధకం
- చర్యలు చేపట్టకపోవడం వెనుక 'లో-పాయి'కార ఒప్పందాలు.?

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** ప్రభావిత ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితి కోరుట్ల-మెట్‌పల్లి పట్టణంలో కొన్ని కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలపై అనుమతిలేకుండా వైర్లను కట్టడం వల్ల ప్రజల ప్రాణాలకు పెద్ద ముప్పు ఏర్పడింది. ఇటీవల హైదరాబాద్ రామంతాపూర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా, విద్యుత్ వైర్లపై వేలాడుతూ ఉన్న కేబుల్ వైర్లు తాకి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానిక ప్రజలలో తీవ్ర భయాన్ని కలిగించింది.

### హైకోర్టు స్పందన ఏంటంటే.!

తెలంగాణ హైకోర్టు ఈ ఘటనపై చర్యలు తీసుకుంటూ, లైసెన్స్ లేని కేబుల్ ఆపరేటర్ల వైర్లను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. 1995లో వచ్చిన కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం, ప్రతి కేబుల్ ఆపరేటర్ తప్పనిసరిగా స్థానిక మునిసిపల్ ఆఫీసులో రిజిస్ట్రేషన్, ట్రేడ్ లైసెన్స్ పొందాలి. చట్టవిరుద్ధంగా స్తంభాలపై వైర్లు కట్టడం నేరంగా పరిగణిస్తుంది.

### చట్ట ఉల్లంఘనలు మరియు వ్యాపార కోణం

కొన్ని కేబుల్ ఆపరేటర్లు కేవలం టీవీ కనెక్షన్లకే పరిమితం కాకుండా, తమ పేరుతో లోకల్ ఛానళ్లను




నడుపుతూ, అనుమతుల్లేని పాత కొత్త సినిమాలు, వినోద కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నారు. మధ్యలో లోకల్ వ్యాపార యాడ్స్ ప్రచారం చేసి రెండు చేతులా డబ్బులు సంపాదిస్తున్నారు.

### అధికారులపై ఆపరేటర్ల ఒత్తిడి

కొంతమంది ఆపరేటర్లు తమను 'రిపోర్టర్లు'గా పరిచయం చేసుకుని మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలపై ఒత్తిడి, బ్లాక్‌మెయిల్ చేస్తూ చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. దీంతో వారు చెల్లించవలసిన పోల్టాక్స్‌ను కూడా ఎగవేస్తున్నారు. ఫలితంగా కొందరు రిపోర్టర్ ల రూపంలో ఉన్న ఆపరేటర్లు కవరేజ్ చేస్తూ కొత్త పద్ధతులకు అలవాటుపడ్డారు. ఎంతిస్తవని డిమాండ్ చేస్తున్నారు. కొన్నిచోట్లా కుదరకపోతే 'బీరు-బిర్యానీ' ఇచ్చినా చాలంటున్నారు. అదీ కుదరకపోతే ప్రోగ్రాం కవరేజీకి రూ.500 లైనా ఇవ్వండని అడుక్కుంటున్నారు.

### మున్సిపల్ చర్యలు అవసరం

మున్సిపల్ అధికారులు వెంటనే లైసెన్స్ లేని కేబుల్ వైర్లను గుర్తించి, కనెక్షన్లను తొలగించాలి. చట్టవిరుద్ధంగా నడుస్తున్న లోకల్ ఛానళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. పట్టణంలో ఎవరెవరు లైసెన్స్ పొందారో, ఎంత టాక్స్ చెల్లించారో ప్రజలకు వెల్లడించాలి. ఒక్క నెల రుసుము చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

### ఇది..ప్రజల బాధ్యత కూడా

ప్రజలు కూడా ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. చట్టవిరుద్ధంగా సినిమాలు, యాడ్స్ ప్రసారం చేసే లోకల్ ఛానళ్లను బహిర్గతం చేయాలి. ప్రజల ప్రాణాలు వ్యాపారానికి పక్కన పెట్టడం ముఖ్యం.

### ఫైనల్ గా చెప్పాలంటే..

'కేబుల్ నెట్‌వర్క్ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, ప్రజలకు సమాచారం అందించే వనరులు కూడా. కాబట్టి చట్టాన్ని కఠినంగా అమలు చేయకపోతే పరిస్థితి మరింత విషమిస్తుందని.. 'తెలంగాణా పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కేసుల సురేందర్ అభిప్రాయపడ్డారు.

# సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే "ఉల్లాస్" లక్ష్యం



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు " ఉల్లాస్( నవ భారత అక్షరాస్యత కార్యక్రమం) పై కోరుట్ల మండలంలోని 15 గ్రామాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు మరియు గ్రామైక్య సంఘం సహాయకులకు శనివారం శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేంద్ర,రాష్ట్ర విద్యశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుందని, సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసాన్ని అందించడం మరియు 15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలను అందించడంపై దృష్టి పెడుతుందని, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత మరియు ఆరోగ్య అవగాహన వంటి కీలకమైన జీవిత నైపుణ్యాలను అందిస్తుందని, పాఠశాల విద్యను కోల్పోయిన లేదా నిరక్షరాస్యులైన పెద్దలను (15 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గలవారు)2027 సంవత్సరం నాటికి 100% అక్షరాస్యత లక్ష్యంగా పని చేస్తుందని, ULLAS మొబైల్ యాప్ లో అభ్యాసకుల పురోగతిని అంచనా వేయడానికి FLNAT (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్) వంటి మూ ల్యాంకనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆధికారి కె.మహేష్, మండల విద్యాధికారి గంగుల నరేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్,రిసోర్స్ పర్సన్స్ అందె శివప్రసాద్,అంకం దామోదర్,అన్నం మహేష్,వి.ఓ.ఏ లు,సి.ఆర్.పిలు పి.గంగాధర్,దేవేందర్, సత్యనారాయణ, జ్యోతి,మాన్విత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు

- నిమజ్జనం రోజున తుడా తరపున అవసరమైన ఏర్పాట్లు..
- తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** వినాయక చవితి మండపాల నిర్వహకులు,యువకులు పోలీస్ వారు జారిచేసిన నిబంధనలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని తుడా చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి కోరారు. వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, వరప్రసాద్ ఇతర సభ్యులు తుడా చైర్మన్ గారి ని మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. సామూహిక నిమజ్జనం రోజున నిమజ్జనం జరిగే చెరువుల వద్ద తుడా తరపున చేపట్టవలసిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ



నిమజ్జనం రోజున నిమజ్జనం జరిగే అన్ని చెరువులు వద్ద తుడా ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లును చేస్తామని హామీ ఇచ్చారు.. ప్రశాంతతకు నిలయమైన తిరుపతి నగరంలో యువకులు క్రమశిక్షణతో నియమ నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి ఉత్సవాలను, నిమజ్జనం ఊరేగింపును జరుపుకోవాలని సూచించారు...

# 108 సార్ల హనుమాన్ చాలీసా పారాయణం

**శంకర్‌పల్లి శ్రీ వీర ఆంజనేయ ఆలయంలో మహిళలు**



**నేటి సాక్షి ప్రతినిధి ( సుధాకర్ గౌడ్ ముదేలి ) శంకర్పల్లి న్యూస్ :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో గల శ్రీ వీర ఆంజనేయ ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా కిరాణా అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 200 మంది మహిళలు 108 సార్ల హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జై హనుమాన్, జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయం దద్దరిల్లింది.

# శ్రీ రాజరాజేశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి ప్రతినిధి ( సుధాకర్ గౌడ్ ముదేలి ) శంకర్పల్లి న్యూస్ :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఆరవ వార్డు చిన్న శంకర్‌పల్లిలో గల పురాతన మహిమగల శ్రీ రాజరాజేశ్వరాలయంలో అమావాస్యను పురస్కరించుకుని శనివారం భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భజన మండలి సభ్యులచే భజనలు జరిగాయి. ఓం నమ:శ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తుడు దండు మోహన్ దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన దాతను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, అరుణోదయ క్లబ్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) వెదురు కుప్పం :** కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరపడమైనది. ఈ నెలను రుతుకాల స్వచ్ఛత మరియు ఆరోగ్య భద్రత దిశగా నడపడం అయినది. ఇందులో భాగంగా చేతులు శుభ్రత, పొడి బట్టలు వినియోగం, పరిసరాల పరిశుభ్రత మరియు ఋతుకాల ఆహారపు అలవాట్లను తీసుకోవాల్సిన జాగ్రత్తలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద విపులంగా వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి. మంగళ గౌరీ,ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్ మరియు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసన్నలత పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామికి పాలాభిషేకం



**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 23** శ్రీ ఆంజనేయ స్వామి పూజ, హారతి,పాలాభిషేకం , వివిధ రకాల పూజ కార్యక్రమం ఉంటుంది కావున పాతతండాల్లో ఉన్న రెండు శ్రీ ఆంజనేయ స్వామి, మరియు పిల్లిగుండ్ల తాండ తాండ భక్తులు భరి సంఖ్యల్లో విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో పెద్దలు చిన్న యువకులు వెంకటేష్ అన్నదానం చేసిండు మరియు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
10
ఆదివారం
24 ఆగస్టు 2025

# నూతన పెస్జీఎఫ్ సెక్రటరీ లావుడియ జైపాల్



**నేటి సాక్షి, భూపాలపల్లి జిల్లా 23 న్యూస్ :**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ జి ఎఫ్ నూతన సెక్రటరీగా లావుడియా జయపాల్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన సెక్రటరీగా జెడ్పిహెచ్ఎస్ రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ఎల్ జయపాల్ ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్నటువంటి ఫిజికల్ డైరెక్టర్లు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు అందరూ కలిసి సమిష్టిగా ఎల్ జైపాల్ ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఈ ఎంపిక ప్రశాంత వాతావరణంలో జరిగిందని తెలిపారు నూతనంగా ఎంపికైన ఎస్జీఎఫ్ సెక్రటరీ లావుడియ జైపాల్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్జీఎఫ్ క్రీడల క్యాలెండర్ను సోమవారం విడుదల చేస్తామని రాష్ట్ర ఎస్జీఎఫ్ ఆదేశాల మేరకు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణ జరిపిస్తామని దీనికి జిల్లాలో పనిచేస్తున్నటువంటి వ్యాయామ విద్య ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు ఈ ఎన్నికకు సహకరించిన జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు నూతనంగా ఎన్నికైన ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ లావుడియా జైపాల్ కు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు

# మండల విద్యాధికారి గంగుల నరేశం ఆధ్వర్యంలో సమావేశం



**నేటి సాక్షి,కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం ఆధ్వర్యంలో SGF గేమ్స్ ని కోరుట్ల మండలంలో నిర్వహణ గురించి PD మరియు PET లతో శనివారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశం లో మండలంలో నిర్వహించే పోటీల గురించి తేదీలను ప్రకటించారు. తేదీ 09-10-2025 రోజున U/14 మరియు U/17 బాలికలకు కబడ్డీ, ఖోఖో , వాలీబాల్ పోటీలను, తేదీ 10-10-2025 రోజున U14 మరియు U-17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను,తేదీ 11-11-2025 రోజున బాలికలకు మరియు బాలురకు అథ్లెటిక్స్ అన్ని విభాగాల వారికి నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పోటీలను స్థానిక జూనియర్ కాలేజ్ గ్రౌండ్లో నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు మండల SGF కన్వీనర్ అశోక్, బాయ్స్ హైస్కూల్ (9948765002)ని మరియు ఐలాపూర్ విజయ్ కుమార్ (9951518737) లను సంప్రదించగలరు.

# దేశభక్తిని చాటేలా విద్యార్థుల "హర్ ఘర్ తిరంగా"..

**కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి గౌరవ ప్రశంసా పత్రం అందుకున్న మేడికాల అంజయ్య..**



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి (సతీష్):** స్వాతంత్ర్యయం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆజాదీ కా మహోత్సవ్ - 2022 లో భాగంగా కేంద్రం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో మరోసారి పాల్గొనే అవకాశం కల్పించినందున చందుర్తి మండలం జోగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ , సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రైనింగ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా వాలంటీర్ గా వ్యవహరిస్తు జాతీయ పతాక ఆవిష్కరణ విధానం , నియమాలను విధ్యార్థులకు అవగాహాన కల్పిస్తు దాదాపు 60 మంది విద్యార్థుల జాతీయ పతాక సెల్ఫిలను అప్ లోడ్ చేయించగా, 60 మంది విద్యార్థులు ప్రశంస పత్రాలు అందుకున్నారు. వాలంటీర్ గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు అంజయ్య కు మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ మరొక గౌరవ ప్రశంసా పత్రం అందించి గౌరవించింది. విద్యార్థి దశలోనే దేశభక్తిని పెంపోందించేలా కృషి చేస్తే , భావితరాల వారు దేశం కోసం పనిచేస్తారని, విద్యార్థులు చక్కటి క్రమశిక్షణను పాటిస్తారని అంజయ్య అన్నారు.

# స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధిద్దాం



- స్వచ్ఛాంధ్ర - స్వర్ణ ఆంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి.
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర లో ప్రజలందరూ భాగస్వాములు కావాలనీ, స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధనకు ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర %-% స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాబు జగజ్జీవన్ రామ్ పార్కు నందు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రామ్ పార్కు లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహ ఆచారి అధికారులు పాల్గొని మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రామానాయుడు స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. వర్షపు నీరు నిల్వతో దోమలు పెరిగి చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. కాబట్టి వర్షపు నీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూడాలని ఆయన కోరారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డ్రైయిన్ లలో సిల్ట్ తీసే కార్యక్రమం క్రమం తప్పకుండా మున్సిపల్ సిబ్బంది చూస్తుందని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం ఒక నినాదంతో స్వచాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ నెల మాన్సూన్ హైజెనీ నినాదంతో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వర్షాలు రాక ముందే నగరంలోని కాలువల్లో చెత్త తొలగించడం, ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, జబ్బులు రాకుండా చేతులు కడుక్కోవడం, చెత్త కుప్పల తొలగింపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత తమ బాధ్యతగా ముందుకు సాగితే నగరం శుభ్రంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు ప్రతి చేతులు శుభ్రం చేసుకోవడం వలన అంటువ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చునని అన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశు భ్రత అనేది ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం పట్ల మనం చూపించే బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరుపతి అభివృద్ధిలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందనీ జాతీయస్థాయిలో తిరుపతి స్వచ్ఛత కార్యక్రమంలో అవార్డు పొందిందని గుర్తు చేశారు, తుడా పరిధిలో మున్ముందు మరిన్ని పారిశుధ్య ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి కోసం వెళ్తే...ఊపిరి పోయింది.!!

- 'అక్రమ ఇసుక' ట్రాక్టర్ పైనుండి పడి యువకుడి మృతి
- న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన మృతుని బంధువులు





**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :**ఉపాధి దొరక్క.. కుటుంబాన్ని పోషించుకునేందుకు..'అక్రమ ఇసుక రవాణా' పనిలో చేరిన పాపానికి.. కుటుంబానికి ఊపరవుతాడనుకుంటే..'విధి నిర్వహణ'లో భాగంగా తన ఊపిరినే పోగొట్టుకున్నాడో యువకుడు నర్ర.శేఖర్.!

## ఇంతకీ ఈ సంఘటన ఎక్కడ జరిగింది.?

మెట్ పల్లి మండలం వెల్లుల్ల శివారులో 'ఎక్స్ రోడ్డు' వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది.పూర్తి వివరాల్లోకి వెళ్తే... మెట్ పల్లి మండలం ఆత్మకూరు గ్రామం నుండి బండలింగపూర్ గ్రామానికి 'అక్రమ'ఇసుక తరలిస్తుండగా దానిపై ప్రయాణిస్తున్న నర్ర శేఖర్ (27) ప్రమాదవశత్తు ట్రాక్టర్ పై నుండి కింద పడటంతో..తాను ప్రయాణిస్తున్న ట్రాక్టర్ వెనుక టైర్ కిందనే పడిపోయాడు.అతని పై నుండి వెళ్లగా పక్కటెముకలన్ని విరిగిపోయి శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు.శేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్ పల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.సంఘటన స్థలానికి చేరుకున్న మెట్ పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ విచారణ చేపట్టారు.

## ఎలా జరిగింది.? తర్వాత ఏమైంది.?

తన తోటి డ్రైవర్ తన గ్రామానికే చెందిన దండ్ల.రవి (27) ట్రాక్టర్ ను వేగంగా నడుపుతూండగా.. శేఖర్ కు ఫోన్ రింగైతే.. మాట్లాడేందుకు.. డ్రైవర్ పక్కనుండి లేచి వెనుక ఇసుక పైకి వెళ్లే క్రమంలో.. ట్రాక్టర్ ఎగరడంతో పట్టుతప్పిన శేఖర్ ట్రాక్టర్ మధ్యలో పడిపోయాడు.తేరుకునే లోపలే శేఖర్ పైనుంచి వెనుక టైర్ ఎక్కేసింది.దీంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.విషయం తెలుసుకున్న మెట్ పల్లి పోలీసులు మృతదేహాన్ని తరలించారు.కాగా.. మృతుని బంధువులు ఆగ్రహించి.. దాదాపు వందమందితో కలిసి న్యాయం కావాలని మెట్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలివచ్చారు. మృతునికి ఒక కుమార్తె ఉండగా భార్య గర్భవతిగా ఉంది.ఇప్పుడు మాకు దిక్కెవరని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నట్టాయి.

## రూ.20 లక్షలు కావాలి..రూ.5 లక్షలు ఇస్తా.!

మృతుడు శేఖర్ కు ఇదివరకే కూతురుండగా..భార్య రెండోసారి గర్భవతిగా ఉన్నారు.వారి భవిష్యత్తు కోసం కుటుంబ సభ్యులు.. ఇతరులు కలిసి ట్రాక్టర్ యజమాని బండ్ల.శ్రీనివాస్ ను నిలదీశారు.కేసు నమోదు కాకుండా శ్రీనివాస్ ఎంతోకొంత ఇచ్చి కుటుంబానికి ఆసరాగా ఉంటానని పేర్కొన్నట్టు సమాచారం.దానికి మృతుడు శేఖర్ వైపు ఉన్నవారు.రూ.20 లక్షలు ఇస్తే కేసు పెట్టకుండా వెనక్కి వెళ్లిపోతామని డిమాండ్ చేసినట్టు తెలిసింది.ఇవన్నీ కాదు..ఒక్క రూ.5 లక్షలు మాత్రమే ఇస్తానని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేయడంతో చర్చలు అర్థాంతరంగా పక్కదారిపట్టినట్టు తెలిసింది.

## ఇద్దరిపై కేసు నమోదు

నర్ర శేఖర్ మృతికి కారణమైన డ్రైవర్ రవిపై..ట్రాక్టర్ యజమాని బండ్ల.శ్రీనివాస్ పై అక్రమ ఇసుక తరలింపు కేసుల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.కాగా..గత కొన్ని రోజుల నుండి మెట్ పల్లి మండలం ఆత్మకూరు లో 'అక్రమ ఇసుక' రవాణా వ్యవహారం తీవ్ర వివాదాస్పదమవుతోంది.ఇటీవల కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూడా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు.పెద్దమనుషులతో ఒక బహిరంగ లేఖలో 'ఆత్మకూర్ ఇసుక రీచ్'ను వెంటనే రద్దు చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లతకు విజ్ఞప్తి కూడా చేశారు.వారు ఏం నిర్ణయం తీసుకోక ముందే..ఇంతలో ఈ దుర్ఘటన జరిగింది.ఇక ఇప్పుడు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.!

# గిరిజన సంక్షేమ శాఖలో సమస్యలు పరిష్కరించండి

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారికి వినతి పత్రం అందించిన విద్యార్థి సంఘాల నేతలు అజ్మీరా వెంకట్ నాయక్, భానోత్ భాస్కర్ నాయక్

**నేటి సాక్షి హనుమకొండ ఆగస్టు 23 న్యూస్ :** హన్మకొండ :గిరిజన తండాలు గుడాలకు ప్రత్యేక నిధులు కేటాయించి లని గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆశ్రమ పాఠశాలలో హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించి వారి యొక్క విద్యాభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు వర్షాకాలం సీజన్లో దోమతెరలు దుప్పట్లు అందించాలని అదేవిధంగా ఐ టి డి ఏ ఇంజనీరింగ్ శాఖలో జరుగుతున్నటువంటి అవినీతి అక్రమాలపై దృష్టి సారించాలని గ్రీన్ ఆ సంక్షేమ




శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది

# ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం తగ్గింది

- కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్
- కల్యాణ లక్ష్మీ, షాధి ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే విమర్శలు

**నేటి సాక్షి - కోరుట్ల (మెట్ పల్లి) ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి విధిత్ రెడ్డి గార్డెన్స్‌లో మెట్‌పల్లి పట్టణం.. మండలం పరిధికి చెందిన రూ.13,015,080 విలువ గల 130 కల్యాణ లక్ష్మీ మరియు షాధి ముబారక్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో ప్రగతి కంటే కుంటుపాట్లే ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. కరోనా కష్టకాలంలోనూ పింఛన్లు అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించి, కల్లబొల్లి మాటలతో ప్రజలను తప్పుదారి చూపిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ఏ



ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని హెచ్చరించారు. దీంతో ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం తగ్గిందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని మద్దతు ఇవ్వాలని సూచించారు.

# అపోలో యూనివర్సిటీ విద్యార్థులకు స్వర్ణావకాశం



- చదువుతో పాటు సంపాదన
- చదువు, అనుభవం, సంపాదనకు వేదిక
- వీసీ డా. హెచ్. వినోద్ భట్

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చిత్తూరు, ఆగస్టు 23: ది అపోలో యూనివర్సిటీలో "చదువుకుంటూనే సంపాదించు" ప్రత్యేక పథకం కింద ఎంపికైన విద్యార్థులకు శనివారం నియామక పత్రాలను ఘనంగా పంపిణీ చేశారు. చదువుతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన పెంపొందించాలన్న లక్ష్యంతో అపోలో యూనివర్సిటీ ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ – "విద్యార్థులు చదువుతో పాటు పనిలో అనుభవాన్ని పొందడం నేటి తరానికి అత్యవసరం. ఇది భవిష్యత్తు వృత్తి జీవితానికి దోహదం చేయడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ప్రొఫెషనల్‌గా వ్యవహరించడం నేర్పుతుంది" అని అన్నారు. యూనివర్సిటీలోని ఐటి, మార్కెటింగ్, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్, కెరీర్ కౌన్సిలింగ్, ఫిజియోథెరపీ, ప్రెస్ & పబ్లికేషన్స్ వంటి విభాగాల్లో విద్యార్థులకు చదువుతో పాటు ఆచరణాత్మక పనిఅవకాశాలు కల్పిస్తున్నట్లు వీసీ డాక్టర్ వినోద్ భట్ తెలిపారు. ఎంపికైన వారు క్రమశిక్షణ, అంకితభావంతో పనిని పూర్తి చేస్తారన్న నమ్మకం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ జగదీషన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్.ఎస్. షానీ, విభాగాధిపతులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక చవితి భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- మరికల్ మండల తాసిల్దార్ రామకోటి నాయక్

**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 23 :** శ్రీ శ్రీ శ్రీ వినాయక చవితి మరికల్ మండలంలోని ప్రతి గ్రామంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని మరికల్ మండల తాసిల్దార్ రామకోటి నాయక్ అన్నారు. శనివారం వినాయక చవితి ఉత్సవాలపై శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రామకోటి నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందూ ముస్లింలు కలిసికట్టుగా అన్నదమ్ముల వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన కోరారు. అనంతరం మరికల్ ఎస్సై రాములు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ముగించాలన్నారు. ఈ ఉత్సవాలలో డిజె సౌండ్ లకు అనుమతులు లేవని ఆయన వివరించారు. వినాయక చవితి ఉత్సవాలలో ఎవరన్నా డిజె సౌండ్ నిర్వహించిన అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వినాయక చవితి ఉత్సవాలలో రోజు ఒకరు వినాయకుని విగ్రహం దగ్గర ఉండాలన్నారు. అట్టి వారితో ప్రతిరోజు రాత్రి సంతకం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ



వెంకట్ రాములు, ఇరిగేషన్ అధికారులు, మరికల్ మండల ఎంపీడీవో కొండన్న, మరికల్ మండల ఆర్ ఐ సుధాకర్ రెడ్డి, మరికల్ మండలం అఖిలపక్ష నాయకులు, మైనార్టీ సోదరులు యువకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణ బాధ్యత వారసులదే

- న్యాయ సహాయం కోసం లాయర్ల ఏర్పాటు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

**నేటిసాక్షి, రాయికల్ :** వయోవృద్ధుల సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన స్వచ్ఛంద సంస్థ ..స్వచ్ఛందంగా పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని సందర్శించి ప్రభుత్వ చట్టాలపై, వయోవృద్ధుల సంరక్షణ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ అందరూ ఉండి కూడా తమ వారిని అనాధాశ్రమంలో ఉ ంచడం సరైన పద్ధతి కాదని వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు ప్రేమతో చూసుకోవాలన్నారు. అనాధాశ్రమంలో ఉన్న వృద్ధులకు తమ వారసుల ద్వారా ఇబ్బందులు ఎదుర్కొనే వారికి న్యాయ సహాయం కోసం వారానికి ఒక్కసారి ఆశ్రమానికి లాయర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామని న్యాయసేవాధికార సంస్థ నిరంతరం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వయోవృద్ధుల సంరక్షణ చట్టాలున్నాయని తల్లిదండ్రుల పేరట ఉన్న ఆస్తిని వారసులు తీసుకొని సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తే స్థానిక తహసిల్దార్,ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తే సంరక్షణ ఖర్చులతో




పాటు వారసుల వద్ద నుండి ఆస్తిని తిరిగి తీసుకునే హక్కు ఉందన్నారు. స్థానికంగా సమస్య పరిష్కారం కాకుంటే న్యాయ సేవ అధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అందరికీ న్యాయం చేస్తామని అన్నారు. లీగల "సర్వీసెస్‌హెల్ప్‌లైన్‌నెంబర్15100, తదితర అంశాలను వివరించారు. ఆశ్రమంలో మెరుగైన వసతులు, పరిసరాల పరిశుభ్ర వంటి వాటిపైన దృష్టి సారించి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు సుగాలి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ వెంకట మల్లిక్, సుబ్రహ్మణ్య శర్మ, ప్రిన్సిపల్ జూనియర్స్ సివిల్ జడ్జ్ ఆర్.లావణ్య, రెండో వ తరగతి న్యాయమూర్తులు గంప కరుణాకర్,ఏజిపి ఓం ప్రకాష్,లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్ర మోహన్, సతీష్, విజయ్ కృష్ణ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్, తహసిల్దార్ ఉదయ్ కుమార్, సిడిపిఓ వరలక్ష్మి, ఏఎస్ఐ దేవేందర్, అడ్వకేట్ లు చిట్యాల నిఖిల్, రాజేందర్, మచ్చ శేఖర్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ముల రాధ ఆదిరెడ్డి, నాయకులు నీరటి శ్రీనివాస్, ఆశ్రమ నిర్వాహకులు భరత్ రెడ్డి, మహిపాల్,వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# మహా ధర్నాకు బయలుదేరిన టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయులు



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 23 :** హైదరాబాద్ లో టీచర్ల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఇందిరా పార్క్ దగ్గర నిర్వహించే మహాధర్నాకు టీఎస్ యుటిఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు మరియు వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన ధర్నా లో వారంతా పాల్గొన్నట్లు ఆ ఉపాధ్యాయ సంఘం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల అధ్యక్షుడు కే.శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్ష కార్యదర్శులు, కే రవికుమార్, వెంకటేశ్,జిల్లా కోశాధికారి భాస్కర్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, జయంతి,హేమంత్ కుమార్, శర్మ, జగదీశ్వర్, శివరాజ్, ఖాదరయ్య, వెంకటయ్య, పవన్ కుమార్ ,ఖాతలయ్య,చంద్రయ్యా, నవీన్, బోరు కృష్ణయ్య , డి అజయ్, రవీంద్రప్ప నాతోపాటు వివిధ మండలాల సభ్యులు తదితరులు పాల్గొన్నట్లు శంకర్ తెలిపారు.

# 62 మంది పిల్లలను బడిలో చేర్పించిన హెచ్ ఎంకు సన్మానం



**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ పట్టణానికి చెందిన గట్టు రమేష్నర్సయ్య అనే హెచ్‌ఎంను శనివారం రాయికల్ ఎంపిడిఓ బింగి చిరంజీవి, ఎంఇఓ రాఘవులు, ఎంపిఓ సుష్మలు ఘనంగా సన్మానం చేసారు. రాయికల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న రమేష్ నర్సయ్య పాఠశాల ప్రవేశాల సమయంలో 65 మంది పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను చైతన్యపరిచి ఈ ఘనత సాధించగా శనివారం సెక్టోరియల్ స్థాయి సమావేశంలో రమేష్ నర్సయ్య చేసిన సేవలను ప్రశంసించి సన్మానం చేసారు. పాఠశాల అభివృద్ధికి రూ.10వేల నగదు పారితోషకం అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి మహేష్, ఎపిఎం నరహరి, ఆర్పిలుకడకుంట్ల అభ్రయాజ్, దొంతి సతీష్, రాజేశ్ శ్రీనివాస్, సిఆర్పిలు రవింధర్, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా సంజీవచారీ



**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ పట్టణంలో శనివార స్వర్ణకార సంఘం భవనములో మండల స్వర్ణకార సంఘ కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షుడు మూగల మారుతి ఆధ్వర్యంలో మండల స్థాయి స్వర్ణకార కార్యవర్గ ఎన్నికను నిర్వహకులుగా తొగిటి లక్ష్మీనారాయణ, కొమురవెల్లి రాజేందర్ లు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల స్థాయి స్వర్ణకార అధ్యక్షునిగా మూగల సంజీవ చారి, ప్రధాన కార్యదర్శిగా తొగిటి గోపి, ఉపాధ్యక్షులుగా సాగర్, చారి, కోశాధికారిగా పొలాస సింహాచారి, సంఘ ముఖ్య సలహాదారులుగా గన్నవరం గంగాధర్, బెజ్జారపు ప్రసాద్, దురిశెట్టి వెంకటరాజం, తోగిటి సత్తయ్య, సహాయ కార్యదర్శులుగా సత్యం, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ లుగా కార్యవర్గ సభ్యులుగా తిరుపతి, విక్రమ్, రమణయ్య, రవీందర్, శ్రీనివాస్, సుకుమార్ సుధాకర్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, జిల్లా స్థాయి స్వర్ణకార సంఘ బాధ్యులు, పట్టణ స్వర్ణకారులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ఎస్టీ బాలికల మినీ గురుకులం లో ఆరోగ్య పరీక్షలు



**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ బాలికల ఎస్టీ మినీ గురుకుల పాఠశాలలో ని 110 మంది విద్యార్థులకు శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ కస్తూరి సతీష్ కుమార్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 14 మంది విద్యార్థులకు మందులను అందించి, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకొనే ముందస్తు జాగ్రత్తలు చేతులు శుభ్రం చేసుకొనే విధానం పట్ల అవగహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, సిహెచ్ఓసాగర్ రావు, సూపర్ వైజర్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ దీపిక, ఎఎన్ఎం అఖిల పాల్గొన్నారు

# వ్యాపారస్తులు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

మరికల్ ఎస్సై రాములు



**నేటి సాక్షి నారాయణపేట ఆగస్టు 23 :**మరికల్ మండల కేంద్రంలో ఉన్న పలు వ్యాపారస్తులు తమ తమ దుకాణాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మరికల్ ఎస్సై రాములు కోరారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాములు మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల పలు జరిగే సంఘటనలను గుర్తించవచ్చని ఆయన వివరించారు. వ్యాపారస్తులు స్పందించి తమ తమ దుకాణాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మరికల్ మండలం అఖిలపక్ష నాయకులు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సి.పి.యస్.రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలి

ఉపాధ్యాయుల నిరసన



**నేటిసాక్షి, రాయికల్ :** సి.పి.యస్.రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలం లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల రిబ్బనులు ధరించి నిరసన తెలియజేశారు . మధ్యాహ్న భోజన విరామ సమయంలో సిపిఎస్ రద్దు కోరుతూ రాయికల్ తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు చెరుకు మహేశ్వర శర్మ, వేముల మధు, రాయికల్ మండల శాఖ అధ్యక్షులు కొండూరి రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు పి.రమేష్ ,ఆర్ జయదేవ్ వర్మ, సతీష్, రాము,మోహన్, హరికృష్ణ సరిత, స్నేహలత, సుధారాణి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# అసంపూర్తి వంతెనలతో ఇబ్బందులు



## ఎంపిఓకు బిజెపి శ్రేణుల వినతి

**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ మండల కేంద్రం నుండి మైతాపూర్, రామాజీపేటకు వెళ్లే ప్రధాన రహదారుల్లో నిర్మిస్తున్న వంతెనల పనులు మధ్యలో నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని రాయికల్ మండల బిజెపి శ్రేణులు శనివారం ఎంపిఓ సుష్మకు వినతిపత్రం అందించారు. వంతెనల పనులు పూర్తిస్థాయిలో జరుగకుపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తక్షణం పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఆయ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పటికీ ఇంకా అసంపూర్తిగానే ఉండటంవల్ల వర్షాకాలం కావడంతో రహదారి బురద మయమై ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అధికారులు ఇప్పటికైనా నాణ్యమైన రోడ్డు వేసి రాకపోకలు సజావుగా జరిగేలా చూడాలని బిజెపి నాయకులు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలశాఖ అధ్యక్షులు ఆకుల మహేష్, పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారి సాయిరాజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజనాల మధు, జిల్లా కార్యవర్గసభ్యులు తొగిటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు రవీందర్, సంకోజీ మహేష్,వట్టిమల్ల శ్రీను, కార్యదర్శులు సత్తన్న, వేణు, కోశాధికారి చింత రాజేష్, సీనియర్ నాయకులు రవీందర్, అంగడి పరమేశ్వర్,సత్యనారాయణ, రవీందర్, జలపతి, బూత్ అధ్యక్షులు రాజారెడ్డి, నరేందర్, రవికిరణ్, సంజీవ్ రాజేష్, శ్రీరామ్ గౌడ్, రాజేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుడి పేరుతో కాలనీ రోడ్డునే మింగేస్తున్న సెక్రెటరీ

- ఇంజనీర్స్ కాలనీ సెక్రెటరీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమి ఖాబ్జా కు యత్నం
- చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- కాలనీ మొత్తం సెక్రటరీ ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది



**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 23 :** నగరంలో భూముల రేట్లు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ స్థలాలు,ప్రభుత్వ రోడ్డు, వాటిపై కన్ను పడుతుంది. స్థానికులను భయభ్రాంతులకు గురి చేయడం, అధికారులను మభ్య పెట్టడం ద్వారా తమ ఆక్రమణలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.గుడి పేరుతో అయితే ఎవరూ పట్టించుకోరన్న ఉద్దేశమో లేదా ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయరన్న భావనతోనో ఏకంగా పెద్ద స్థలాన్నే కబ్జా చేశాడు. నేను కాలనీ సెక్రెటరీ ఐతే ఎవ్వరు ఏమనరు అనే ఉద్దేశం ఏమో తెలియదు కానీ కబ్జా మాత్రం ఇచ్చాక్కగా చేస్తున్నాడు. తొలుత షెడ్లు నిర్మించి ఇప్పుడు వాటిని తొలగించి శాశ్వత కట్టడాలు నిర్మించి పిల్లర్లు కూడా వేశాడు. ఈ అక్రమ నిర్మాణాల వైపు ఎవరూ కన్నెత్తి చూడకుండా అధికారంలో ఉన్న ప్రభుత్వ ప్రజాప్రతినిధుల పక్క ప్లాన్ ఏర్పాటు చేస్తుంటాడు.భక్తి తో వెళ్తే ఎవ్వరు ప్రశ్నంచే వారే ఉన్నారు, గుడి తో మొదలు పెట్టి కాలనీ రోడ్డునే మింగాలనే ప్రయత్నం చేస్తున్నాడు.ఇటు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు.ఈ నేపథ్యంలో తమ కండ్ల ముందే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు అని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ బన్నాల



- చిల్కానగర్ డివిజన్ ప్రశాంత్ నగర్ లోని సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 23 :** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి అధికారులు మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రశాంత్ నగర్ కాలనీలో సుమారు 18 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని, కాలనీలో ఉండే ప్రజలకు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలలో ఎటువంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కోకొండ జగన్, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బీరప్ప గడ్డ బాలు, బంటి గౌడ్, ప్రశాంత్ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ మోహన్, జి ఎస్ కృష్ణ స్వామి, ముత్యం రెడ్డి సుబ్బారెడ్డి, శాస్త్రి, లక్ష్మీ భూమేష్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# కడప అటవీ డివిజన్ పరిధిలో ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు

- 26 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం
- బాడుగకు కార్లు ఇచ్చే వారికి టాస్క్ ఫోర్స్ ఎస్పీ హెచ్చరిక




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** కడప డివిజన్ సీకే దిన్నె మండలం పరిధిలోని అటవీప్రాంతంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 26 ఎర్రచందనం దుంగలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం బాడుగకు తీసుకుని అందులో ఎర్రచందనం అక్రమ రవాణా చేయడం విశేషం. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు గారి ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ ఎం. మురళీధర్ రెడ్డి టీమ్ శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలం లోని మద్దిమడుగు ఫారెస్ట్ సెక్షన్ లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డి తో కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది వ్యక్తులు ఒక కారు వద్ద కనిపించారు. వారిని చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా వారు పారిపోసాగారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి ముగ్గురిని పట్టుకో గలిగారు. ఆ పరిసర ప్రాంతాల్లో వెతకగా 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలు, కారుతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డిఎస్పీ వీ. శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ వారిని విచారించగా ఆ కారును సెల్ఫ్ డ్రైవింగ్ కోసం బాడుగకు తీసుకుని వచ్చి అందులో ఎర్రచందనం స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ కేసును ఎస్ ఐ రఫీ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.కార్లు బాడుగకు ఇచ్చేముందు వారి పూర్తి వివరాలు తెలుసుకుని ఇవ్వాలని టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అన్నారు. ఆ కార్లను ఎర్రచందనం అక్రమ రవాణాకు ఉపయోగించే పక్షంలో కారు యజమాని కూడా భాధ్యుడు అవుతారని, వారిపై కూడా కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు.

# అక్షర వికాసం తోనే సాక్షర భారత్

**రాయికల్ ఎంపీడీవో చిరంజీవి**




**నేటిసాక్షి, రాయికల్:** అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా శనివారం బాలుర ఉన్నత పాఠశాల రాయికల్ లో ఉపాధ్యాయులకు, మహిళా సంఘాల సభ్యులకు, మెప్మా ఆర్పీలకు "ఉల్లాస్" శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఓ బింగి చిరంజీవి మాట్లాడుతూ అక్షరాస్యత ద్వారానే ఆధునిక సమాజంలో మనిషి సుఖంగా జీవించగలరని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం సామాజిక సేవలో భాగమని అక్షర వికాసం తోనే సాక్షర భారత్ సాధ్యమని అన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి మహేష్ మాట్లాడుతూ గ్రామంలోని సామాజిక చైతన్య కేంద్రాలను సమర్ధవంతంగా వినియోగించుకొని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ దేశాభివృద్ధి ఆ దేశ అక్షరాస్యత పై ఆధారపడి ఉంటుందని అక్షర వికాసంలో భాగంగా మండలంలోని 2152 మంది, పట్టణంలోని 382 మంది నిరక్షరాస్యులను 100శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఎంపిఓ సుష్మా మాట్లాడుతూ నిత్య జీవితంలో విద్య యొక్క ఆవశ్యకత చాలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరహరి, రిసోర్స్ పర్సన్ లు కడకుంట్ల అభయ్ రాజ్, దొంతి సతీష్, సీఆర్పీలు రవీందర్, సత్యనారాయణ, రాజేష్, శ్రీనివాస్, సీసీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- **గణేష్ ఉత్సవాలలో డీజే లకు అనుమతి లేదు...**
- **పేట జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్**



**నేటి సాక్షి,నారాయణపేట ఆగస్టు 23 :** ఈ నెల 27న బుధవారం నాడు వినాయక చవితి పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసుశాఖ నుండి అనుమతి పొందాలని, ఆన్లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటు కు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్లైన్ ద్వారా అందించాలని లిజిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఈ ఆన్లైన్ లింక్ ను క్లిక్ చేసి అందులో దరఖాస్తు దారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు, కమిటీ సభ్యులు పేర్లు వారి ఫోన్ నెంబర్లు, విగ్రహం ప్రతిష్టించే రోజు, నిమజ్జనం చేసే తేదీ సమయం, ప్రదేశం, ఆ ప్రదేశానికి ఏ వాహనంలో చేరుకుంటారు, అదేవిధంగా మండప నిర్వహకులు, గణపతి కమిటీ సభ్యులు, వాలంటీర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. నారాయణపేట జిల్లాలోని పట్టణాలలో మరియు గ్రామాలలో నిర్వహించే గణపతి మండప నిర్వహకులు ఈ వెబ్సైట్ నందు వివరాలను పొందుపరచాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వివరాలు కాని సందర్భంలో దగ్గర్లో ఉన్న పోలీస్టేషన్ ను సంప్రదించాలని సూచించారు.

**గణేష్ మండపాల నిర్వహకులకు పోలీసు వారి సూచనలు**

పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక ప్రతిష్టాపనకు ప్రాధాన్యత కేటాయించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో వినాయక మండపాలను ఏర్పాటు చేసే మండప యజమానులు రహదారులపై, ప్రజలు తిరిగే రోడ్లపై ప్రతిష్టించరాదు. మరియు ఎట్టి పరిస్థితులలోను జనజీవనానికి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించరాదు. గణేష్ మండపాల వద్ద పూజా కార్యక్రమాలలో పాల్గొనే భక్తుల వాహనాల పార్కింగ్ కొరకు తగినంత దూరంలో, నిర్దేశించిన ప్రదేశాలలో పార్కింగ్ చేసుకొనె విధంగా పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలి.గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి.గణేష్ మండప నిర్వాహకులు విద్యుత్ సరఫరాకై విద్యుత్ శాఖ నుండి ఖచ్చితంగా అనుమతి తీసుకోవాలి మరియు భారీ వర్షాల నేపథ్యంలో మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకొని, నాణ్యతతో కూడిన మండప నిర్మాణం చేపట్టాలన్నారు. మండపాల వద్ద మైకులు, స్పీకర్లను తక్కువ సౌండ్ తో, రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలి. ముఖ్యంగా భారీ శబ్దంతో ఉండే లౌడ్ స్పీకర్లు, డి.జె. సౌండ్ సిస్టమ్స్ ఏర్పాట్లకు అనుమతి లేదు. ఎవరైనా లౌడ్ స్పీకర్లు, డి.జె. సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తే %ణజీ% ఓనర్లపై మరియు మండల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గణేష్ మండపాలను జాగ్రత్తగా చూసుకొనుటకు రాత్రి సమయంలో కనీసం ఒక్కరు లేదా ఇద్దరు వాలంటీర్లు ఉండే విధంగా చూసుకోవాలి. గణేష్ మండపాల వద్ద టపాకాయలను, మందుగుండు సామాగ్రిని ఉంచరాదు, మండపాల వద్ద కరెంట్ పోయినా, ఇబ్బంది లేకుండా ఎమర్జెన్సీ ల్యాంప్ అందుబాటులో ఉంచుకోవాలి.మండపాల వద్ద వీడియో రికార్డింగ్ కోసం సి.సి.టివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపాల వద్ద లక్కీ లాటరీ లేదా బలవంతపు చందాలు చేయకూడదు. గణేష్ మండపం దగ్గర మత్తు పదార్థములు సేవించడం, జూదం ఆడటం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేయకూడదు. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గణేష్ మంటపం వద్ద ఇసుక బస్తాలను, నీటి డ్రమ్ములు వంటి అగ్ని నిరోధకాలను అందుబాటులో ఉంచుకోవాలి.గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు,ఇసుక ఏర్పాటు చేసుకోవాలి.రాత్రి సమయంలో తనిఖీ చేయడానికి వచ్చే పోలీస్ అధికారికి మంటప వలంటీర్లు సహకరించాలి, పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసుకోవాలి. అత్యవసర సమయంలో, ఏదైనా సమాచారం ఉన్నా డయల్ 100 కు గాని, సంబంధిత పోలీ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలి.ఎట్టి పరిస్థితులలోనూ పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్ స్పీకర్స్, డి.జె. లకు అనుమతి లేదని అన్నారు. ఎవరైన డి.జె. ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులపై, డి.జె యాజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు.

# ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగాన్ని చదవాలి

**డా.ముప్వా రామారావు**




**నేటిసాక్షి, మిర్యాలగూడ :** భారత రాజ్యాంగ మౌలిక అంశాలను చదివినప్పుడే, స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం అంటే ఏమిటో అర్థమవుతుందని, ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగాన్ని చదవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్, డాక్టర్. ముప్వా రామారావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగం-శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై జన విజ్ఞాన వేదిక నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. ముప్వారామారావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని 51ఏ హెచ్ ఆర్టికల్ ప్రకారం దేశంలోని ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని రాజ్యాంగంలో రాయబడిందని శాస్త్రీయ దృక్పథం లేని చదువు నిరర్థకమని అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మహోన్నతమైనదని అన్నారు. అనంతరం తెలంగాణ విద్యా వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక పఠనంపై శ్రద్ధ వహించాలని సోషల్ మీడియా రీల్స్ పిచ్చిలో పడి జీవితాలని నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్ కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక నాయకులు జె కొండల్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ బి ఎం జూనియర్ కళాశాల స్వాగతోత్సవ తరంగ్



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల పట్టణంలోని పి. ఆర్. బి.ఎం జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు అంగరంగ వైభవంగా స్వాగతోత్సవ కార్యక్రమం తరంగ్ 2025 పిబి గార్డెన్స్ లో శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, తల్లిదండ్రులందరి కళలను సాకారం చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థిని,విద్యార్థులు మత్తు పదార్థాలకు మరియు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని, ప్రతిరోజు కళాశాలకు వస్తూ ఉన్నతమైన ఫలితాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రెసిడెంట్ ఎంఏ భారీ కేరళ హై స్కూల్ కరస్పాండెంట్, ట్రస్మా సెక్రెటరీ జి వెంకటేష్ కోరుట్ల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్, ట్రస్మా ట్రెజరరీ దీపక్ ప్రగతి స్కూల్ కరస్పాండెంట్, లిటిల్ ఫ్లవర్ కరస్పాండెంట్ టి. సత్యనారాయణ, అరుణోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# శ్రావణమాస పొలాల అమావాస్య ప్రత్యేక పూజలు

**ఉప్పల్ బగాయత్ లోస్వయంభూ వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు,**



**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 23 :** శ్రీ కాళీ సమేత కాలభైరవాయ నమః స్వయంభూ శ్రీ కాలభైరవ ఆలయం స్వయంభుగా వెలసి భక్తుల కోరికలను నెరవేర్చి ప్రతిరోజు ధూప దీప నైవేద్యాలు అందుకుంటున్న కాలభైరవ స్వామి ఆలయం నందు శనివారం శ్రావణమాస పొలాల అమావాస్య సందర్భంగా స్వామి వారికి ఉదయ%శీ% పంచామృత అభిషేకం, మహా హారతి, హెూమము అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి సుమారు 30 జంటలు అమావాస్య హెూమాలలో పాల్గొన్నారు పొలాల అమావాస్య సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తులు కూష్మా%శీ%డ దీపారాధన, కాకర,నారికేల, కంద, దీపారాధన చేసి భైరవ అనుగ్రహం తో పాటు ఆలయ అర్చకులు కన్నయ్య పంతులు రామకృష్ణ పంతులు ఆశీర్వాదాలు తీసుకొని అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు పూజల ప్రభాకర్ షామీర్పేట రాకేష్ రెడ్డి షామీర్పేట వినోద్ రెడ్డి కంచం మీది శివయ్య కమ్మ లక్ష్మణ్ పొట్లూరి ఉపేందర్ గోపాల సుధాకర్ ఏం ప్రభాకర్ రెడ్డి ఈగ సంతోష్ రెడ్డి గారి సంజీవరెడ్డి ఏలూరు నరసింహారెడ్డి శ్రీ స్వయంబు కాలభైరవ స్వామిదేవాలయ సేవా కమిటీ సభ్యులు అత్యధిక సంఖ్యలో కాలభైరవ స్వామి భక్తులు ఉప్పల్ భగాయత్ వాసులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మద్దెలబీడ్ అంజన్న అన్నదానం

**రాజ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించిన నిర్వాహకులు**



**నేటి సాక్షి నారాయణపేట, ఆగస్టు 23 :** అమావాస్య పర్వదినం సందర్భంగా నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మద్దెలబీడ్ గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం జరిగిన అన్నదానానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ప్రతినెలా భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు భీమేష్ నర్సప్ప, ఆనంద్, గోవింద్, బస్వరాజ్, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, హన్మంతు ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, రాజప్ప గౌడ్, రాజు, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఓరుగంటి రమణారావు జన్మదిన వేడుకలు



**నేటిసాక్షి (కె గంగాధర్)పెగడపల్లి :** మలిదశ తెలంగాణ ఉద్యమంలో తనవంతు కృషి చేసి,జగిత్యాల జిల్లాలో గడప గడపకు తెలంగాణ ధూమ్ ధామ్,కళాకారుల ,ప్రదర్శనల ద్వారా తెలంగాణ అంటే ఏంటి తెలంగాణ వస్తే,మనకు జరిగే లాభాలు ఇలా వుంటాయి.అందుకే మనం తెలంగాణ సాధించుకుందాం అని అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు,ప్రస్తుత పెగడపెల్లి సింగిల్ విండో చైర్మన్ గా ఎన్నడూ లేని విధంగా,పెగడపెల్లి సింగిల్ విండోకే,వన్నె తెచ్చిన నాయకుడు,ఆపద వచ్చి అన్నా అంటే,నేనున్నాను అని ముందుండే నాయకుడు,ఎవరికి ఆపద వచ్చినా నా వాళ్ళు,వాళ్ళకు ఆపద వచ్చింది అంటే నాకు వచ్చినట్టే అనే,దయ,జాలిగుణ మున్న నాయకుడు, పెద్దలు, వోరుగంటి వెంకట రమణా రావు పుట్టిన రోజు వేడుకను అభిమానులు ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# కోనేరు సుందరీకరణ పనులకు అంకురార్పణ.

**మక్తల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్**



**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 23** :పేట జిల్లాలోని మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయ కోనేరు సుందరీకరణ పనులకు తెలంగాణ రాష్ట్ర పాడి పశుసంవర్ధక, డెయిరీ, క్రీడా మరియు మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదివారం ఉదయం 9.30 గంటలకు అంకురార్పణ చేయనున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా పడమటి ఆంజనేయ స్వామి ఆలయ కోనేరు శిథిలావస్థకు చేరుకొని, పూర్తిగా వినియోగ రహితంగా మారడంతో... ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే స్థానికుడు, ఆంజనేయ స్వామి పరమ భక్తుడు అయిన డాక్టర్ వాకిటి శ్రీహరి కోనేరును తిరిగి పూర్వ వైభవ స్థితికి తీసుకొస్తానని ఇచ్చిన మాటకు అనుగుణంగా... ఆదివారం రోజు ఆలయ కోనేరు పనులకు రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు వచ్చి ప్రారంభించడంతో... మంత్రి వాకిట శ్రీహరి చేతులమీదుగా పూజా కార్యక్రమాలు చేపట్టి, కోనేరు సుందరీ కరణ పనులను మొదలుపెట్టడం జరుగుతుందని, ఈ సందర్భంగా భక్తులు పుర ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరుతున్నాము..

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపు




**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల పట్టణంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల భాగస్వామ్యంతో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొని పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ సందీప్ కుమార్ మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచడం, మనందరి భాద్యత అన్నారు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. వి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు,ఆధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా ఎల్లగౌని ప్రకాష్ గౌడ్



**నేటి సాక్షి ఉప్పల్ ఆగస్టు 23 :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవా సమితి ఉప్పల్ శాఖ ప్రస్తుత కన్వీనర్ అరటికాయల వంశీకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించడం జరిగింది, ఇట్టి సమావేశంలో ఎల్లగౌని ప్రకాష్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఉప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవా సమితి పెద్దల సమక్షంలో మల్కాజ్గిరి పార్లమెంట్ కో కన్వీనర్ రెవెల్లి రాజు, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ చల్ల ప్రభాకర్ లు ప్రకటించడం జరిగింది. ఈ సమావేశంలో ఉత్సవ సమితి పెద్దలు గౌరిగే కృష్ణ మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్ , రావుల బాలకృష్ణ గౌడ్,బొంగు రమేష్ గౌడ్,యు బి చారి,ఉత్సవ సమితి ప్రతినిధులు,మార్నెని ఫణిందర్, రెడ్డి గారి దేవేందర్ రెడ్డి, బోరంపేట మురళి కృష్ణ, గౌరిగే వెంకటేష్, వర్కల రాజేందర్ గౌడ్, తీగ విట్టల్ రావు, దువ్వాల రమేష్, నామ శ్రావణ్, ఆకుల రాకేష్, ఈదులకంటి నవీన్ గౌడ్, ఆకుల రిషికేష్, గుండె పునేందర్, తలారి విజయ్, దాడి సునీల్, సప్పిడి సందీప్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ త్వరలో పూర్తి కమిటీని ఏర్పాటు చేసుకుని అందర్నీ కలుపుకొని ముందుకెళ్తారని అన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



**నేటి సాక్షి,నారాయణపేట, ఆగస్టు 23** :పేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో మొదటి విడతలో అదనంగా 26 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి గారు గ్రామ పంచాయతీ కార్యదర్శి అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ఆంజనేయస్వామి సప్తాహ మహోత్సవం



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 23 :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోపన్ పల్లి లో శనివారం శ్రీ ఆంజనేయ స్వామి సప్తాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణమాసం సందర్భంగా స్వామివారి సప్తాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే పవిత్ర శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు అఖండ దీపారాధన, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రావణమాసం చివరి రోజున ఆంజనేయ స్వామికి పంచామృతా అభిషేకం, తీర్థావళి, విశేష మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సంకల్పం, కలశ పూజ, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను కూడా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఆంజనేయ స్వామికి బిందె సేవ కార్యక్రమాన్ని కూడా సాంప్రదాయ రీతిలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ చివర ఉన్న బావి దగ్గరకు గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి అక్కడ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఉన్న నీటిని తెచ్చి ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహించారు. అలాగే ఆంజనేయస్వామికి ప్రీతికరమైన సింధూరం , తమలపాకులతో మరియు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆ తర్వాత ఆంజనేయ స్వామిని గ్రామ పురవీధులలో గూండా ప్రత్యేక భజన మరియు భాజా భజంత్రీల మధ్య పల్లకి సేవ నిర్వహించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంజనేయ స్వామికి మహా మంగళహారతి, తీర్థ ప్రసాదములు మరియు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజన కార్యక్రమంలో పుట్టపల్లి, కౌకుంట్ల గ్రామ భక్త భజనపరులు పాల్గొన్నారు. ఈ పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో మఠం సురేష్ స్వామి మరియు తమ్మలి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేయర్ ఎన్నికల హింసపై దర్యాప్తు కొనసాగింపు

- వారల లోపల దర్యాప్తు నివేదిక సమర్పించాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ డీజీపీకి ఆదేశం
- ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లు లేకపోవడం అనుమానాస్పదం
- ఎంపీ గురుమూర్తి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా చోటుచేసుకున్న తీవ్ర గందరగోళం, హింసాత్మక ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన ఫిర్యాదుపై విచారణ కొనసాగుతోంది. ఫిబ్రవరి 3 2025 న జరిగిన సంఘటనలు ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కేలా ఉండటమే కాకుండా మానవ హక్కుల ఉల్లంఘనలకు, ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినడానికి కారణమయ్యాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల రోజున తమ పార్టీ కార్పొరేటర్లతో కలిసి తాను ప్రయాణిస్తున్న బస్సుపై దుండగులు దాడి చేసి, అద్దాలు పగలగొట్టి, డ్రైవర్‌పై దాడి చేసి, టైర్ల గాలి వదిలేసిన ఘటన రికార్డులోనూ ఉందని ఎంపీ వివరించారు. ఈ ఘటన పోలీసుల సమక్షంలోనే జరిగినప్పటికీ, కేసు నమోదు సమయంలో పలువురు నిందితుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో లేకపోవడం అనుమానాస్పదమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల అనంతరం ఎంపీ గురుమూర్తి సమర్పించిన ఆధారాలు, మీడియా రిపోర్టులు, హైకోర్టు ఆదేశాలను కూడా జాతీయ మానవ హక్కుల కమిషన్ పరిశీలనలోకి తీసుకుంది. ఎఫ్ఐఆర్ నం.18/2025 ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో నమోదు అయినప్పటికీ, దర్యాప్తు సక్రమంగా జరగడం లేదని ఎంపీ వాదించారు. ఈ నేపథ్యంలో కమిషన్ వరుసగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుండి నివేదికలు కోరింది. ఫిబ్రవరి 21, జూన్ 20, ఆగస్టు 22 తేదీల్లో మూడు విడతలుగా అదనపు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. డీజీపీ సమర్పించిన నివేదికలో ఎన్నికల భద్రత కోసం 133 మంది పోలీసులు, సీసీ టీవీ ఫుటేజిలు, డ్రోన్లను వినియోగించినప్పటికీ పోలింగ్ కేంద్రానికి 400 మీటర్ల దూరంలో దాడి జరిగిందని, దాని ఫలితంగా ఎన్నిక వాయిదా పడిందని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు 210 మంది అదనపు పోలీసులు, పెట్రోలింగ్ బృందాలను వినియోగించి ఫిబ్రవరి 4న ఎన్నికలు నిర్వహించామని నివేదికలో వెల్లడించారు. ఇదిలా ఉండగా 6 వారాల లోపల ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు నివేదికను తమకి సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ని మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. అయితే ఎఫ్ఐఆర్‌లో 17 మందికి పైగా నిందితుల పేర్లు లేకపోవడం, దాడికి పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలపై కమిషన్ ఇంకా దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ సంఘటనలు రాజకీయ ప్రతీకారం, అధికార దుర్వినియోగం, ప్రజాస్వామ్య వాదాన్ని అణచివేయాలనే ప్రయత్నానికి నిదర్శనమని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు.

# ఈ అవార్డుతో నా బాధ్యత ఇంకా పెరిగింది



- డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న "డా.మూసా అలీ ఖాన్"

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణానికి చెందిన నటుడు, నిర్మాత, సామాజికవేత్త డాక్టర్. మూసా అలీ ఖాన్ కు, తెలంగాణ డిప్యూటీ స్పీకర్ జాటోత్ రామ్ చందర్ నాయక్ చేతుల మీదుగా "నేషనల్ ప్రోమినెన్స్ అవార్డ్స్-2025" అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ పట్టణంలోని బంజారాహిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్ లో శుక్రవారం ఘనంగా అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ డిప్యూటీ స్పీకర్ రామ్ చందర్ నాయక్, ఫౌండర్ అండ్ చైర్మన్ అక్షర డైమండ్స్ అండ్ జువెలర్స్ కోటా కుమార్, అతిథులు టిఎఫ్ఐ డైరెక్టర్ మరియు సినీ దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్, కార్యక్రమ నిర్వాహకులు అభినవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్. మూసా అలీ ఖాన్ ను శాలువలు, పులమాలాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా అవార్డు డాక్టర్ మూసా అలీ ఖాన్ ను అందజేశారు. ఈ సందర్భంగా డా. మూసా అలీ ఖాన్ మాట్లాడుతూ, నేషనల్ అవార్డు అందుకోవటం గర్వంగా, సంతోషంగా ఉందని, డిప్యూటీ స్పీకర్ చేత అవార్డు తీసుకోవడం వల్ల నాకు బాధ్యత ఇంకా పెరిగిందని, సేవా కార్యక్రమాలలో, సినిమా, టీవీ, అవార్డుల కార్యక్రమాలలో పాల్గొంటూ, ఎప్పటికప్పుడు నూతన కళాకారులను పరిచయం చేస్తూ, కళా సంస్థలకు నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని, నన్ను వెన్నంటి ప్రోత్సహిస్తున్న బంధుమిత్రులు, స్నేహితులు, ప్రతిఒక్కరికి, సోషల్ మీడియా ద్వారా ఆశీర్వదిస్తున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినిమా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన జర్నలిజానికే ప్రజాదరణ

**నేటి సాక్షి, కరీంనగర్:** శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల (స్వ) కరీంనగర్ లో శనివారం జర్నలిజం సర్టిఫికెట్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి, సీనియర్ పాత్రికేయులు అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ... జర్నలిజం సాహసంతో కూడుకున్న వృత్తి అని దానికి పరిశీలన, పరిశోధన, వాస్తవికత, నిష్పాక్షికత ఆభరణాలని అన్నారు. పాత్రికేయ విలువలను పెంచే విధంగా వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని తద్వారా ప్రజాదరణ పొందవచ్చునని పిలుపునిచ్చారు. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిజం చక్కటి ప్రణాళికతో కూడుకున్నదన్నారు. శీర్షిక నుండి మొదలుకొని ప్రతి అక్షరం, పదం, వాక్యం సమాజపు మేలునుకోరే విధంగా ఉండాలన్నారు. వార్తలు సంచలనాలకన్నా ప్రధానంగా సందర్భ శుద్ధితో కూడి ఉండాలని సూచించారు. తెలుగు విభాగ అధ్యక్షులు డా.బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పాత్రికేయ వృత్తి పరమపవిత్రమయిందని దాన్ని ప్రజల క్షేమం కోసం వాడుకోవాలని అన్నారు. అనంతరం ముఖ్య అతిథులు ఉత్తమ ప్రతిభతో కోర్స్ పూర్తిచేసిన 42 మంది విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, డా. డి.ప్రకాష్, డా. ఆర్.శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా.పాత అశోక్, డా. పి.చైతన్య, డా. టి.భోజన్న, డా. పి.అనిల్, పి.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
ఆదివారం
24 ఆగస్టు 2025



# జిల్లాలో నేరాల నియంత్రణపై సమీక్షా

- జిల్లా అధికారులు సమీక్షా సమావేశం.
- వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి.

**నేటి సాక్షి, వికారాబాద్ :** జిలా లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలలో ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, పోక్సో, రేప్ కేసుల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, పాఠశాలలకు వెళ్లి బాలికలకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్' గురించి వివరించాలని సూచించారు. ఇది పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అధికారులు తమ సిబ్బందితో నిరంతరం సమావేశాలు నిర్వహించుకొని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. కేసుల ఇన్వెస్టిగేషన్ నాణ్యతను పెంచి, నిందితులకు త్వరగా శిక్ష పడేలా 'కన్విక్షన్ రేట్' (నేరస్తులకు శిక్ష పడే శాతం) పెంచాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి ఫిర్యాదుదారునికి న్యాయం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఏహెచ్‌టియు (ఏహెచ్‌టీయూ), షీ టీమ్స్, భరోసా సెంటర్ల సిబ్బంది ప్రజలు, పాఠశాలల విద్యార్థులలో అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. బాల్య వివాహాలు పోక్సో కేసుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారులు తమ పరిధిలో ప్రతి నెల 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్' నిర్వహించి, ప్రజలకు మరింత దగ్గర కావాలని సూచించారు. జిల్లాలో గ్యాంగ్ నేరాల పైన దృష్టి పెంచాలని ఎస్పీ అన్నారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అక్రమంగా మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, నంబర్ ప్లేట్ లేని వాహనాలను తనిఖీ చేసి, వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో శాంతియుతంగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవ మండపాలు, నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా పెంచాలని కోరారు. ఉత్సవ కమిటీలతో సమావేశాలు నిర్వహించి, నిబంధనలను పాటించాలని సూచించారు. ఉత్సవాల్లో డీజేలను నిషేధించామని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, డీఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఐ హెచ్ సి టీబీ క్యాంప్ విజయవంతం

- ధన్వాడ పీహెచ్ లో ఐ హెచ్ సి టీబీ క్యాంప్ విజయవంతం

**నేటి సాక్షి, నారాయణపేట, ఆగస్టు 23 :** శనివారం ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అవగాహన 100 రోజుల వైద్య పరీక్షల క్యాంప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నుండి మొబైల్ హై-క్వాలిటీ ఎక్సరే యంత్రంను ప్రత్యేకంగా తీసుకురావడం జరిగింది. ధన్వాడలోని వివిధ వార్డుల నుండి టీబీ లక్షణాలు మరియు జ్వరంతో బాధపడుతున్న రోగులు ఈ క్యాంప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్. అనూష గ క్యాంప్‌కు హాజరైన వారందరికీ మెడికల్ చెకప్ చేసి, అవసరం ఉన్నవారికి చెస్ట్ ఎక్సరే రక్తపరీక్షలు నిర్వహించారు. డాక్టర్. అనూష మాట్లాడుతూ:" "టీబీ ను త్వరగా గుర్తించడం చాలా ముఖ్యం. రెండు వారాలకు పైగా దగ్గు, రాత్రి వేళ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా చెస్ట్ చేయించుకోవాలి. జిల్లా నుండి తీసుకువచ్చిన హై-క్వాలిటీ ఎక్స్-రే మిషన్ ద్వారా ముందుగానే గుర్తించవచ్చు. తొందరగా గుర్తిస్తే, సులభంగా చికిత్స అందుబాటులో ఉంటుంది, ప్రమాదం ఉండదు." క్యాంప్‌లో డాక్టర్ మునీర్, అనురాధ, కే. ప్రసాద్, శ్రీధర్, సూపర్వైజర్ కథలప్ప , ఎల్ టి నరేష్, బాలరాజ్ , ఆశ తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలి




అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేల వేతనం అమలు చేయాలని, వేతనాలు నెల మొదటి వారంలో చెల్లించాలని, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ బకాయిలు చెల్లించాలని, కేంద్రం అద్దెలు, ఆరోగ్య లక్ష్మి బిల్లులు, అద్దాన్నులు ఇవ్వాలని, లేదా నెల నెల చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్యాలయాలు అర్హులైన అంగన్వాడీ టీచర్ల తో భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బేకుమల్ల సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, ఉపాధ్యక్షులు మునుగోరి హనుమంతు, ప్రధాన కార్యదర్శి ఎండి ముక్రం, కార్యదర్శులు వెన్న మహేష్, లతోపాటు సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి వెన్న సురేష్, నేతలు కిరణ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ఏవో కు డిమాండ్ల పత్రం అందజేశారు.

- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేల వేతనం ఇవ్వాలి
- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి డిమాండ్
- కలెక్టరేట్ ముందు అంగన్వాడీల ధర్నా

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాల సాంకేతిక స్థానిక సమస్యలతో పాటు ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్, ఏఐటీయుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో ఏవో కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

**అంగన్వాడీ సమస్యలు పరిష్కారించండి**

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు న్యాయమైన ఫోన్లు ఇవ్వకపోవడం వలన అంగన్వాడి లబ్ధిదారులకు ఎఫ్ ఆర్ ఎస్ లో ఫేస్ క్యాప్చర్ కావటం లేదని, తల్లులకు ఫీడింగ్ ఇచ్చినా యాప్ లో ఆఫ్ సెంట్ పడుతుందని వాపోయారు. ఎఫ్ ఆర్ ఎస్ అవ్వకపోవడం వలన టార్గెట్ పూర్తి కావడం లేదని అధికారులు మాపై ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలను నాలుగు సంవత్సరాల నుండి ప్రాథమిక పాఠశాలలలో చేర్పించాలని ఆదేశాలు ఇచ్చారని అయితే అంగన్వాడి కేంద్రంలో జీరో నుండి మూడు సంవత్సరాల వరకు అంగన్వాడీ నుండి పియస్కార్ 3 నుండి 6 సంవత్సరాల వరకు అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ ఉండాలన్నారు.

**అంగన్వాడీల భవితవ్యం ప్రశ్నార్థకం**



నాలుగో సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తే అంగన్వాడి కేంద్రాల పరిస్థితి ప్రశ్నార్థకమవుతుందని చెబుతూ అంగన్వాడి కేంద్రా మనుగడ కొనసాగించడానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా అంగన్వాడి లబ్ధిదారులకి వెవైసీ చేయాలని అంటున్నారని, చాలామంది ఆధార్ ఫోన్ లింక్ లేనందున ఈ కేవైసీ కావడంలేదని ముఖ్యంగా ఓటిపితో ఇటీవల అనేక ఆన్లైన్ మోసాలు జరుగుతున్నాయని, అందువల్ల ఓటిపి చెప్పడానికి లబ్ధిదారులు సుముఖత వ్యక్తం చేయడం లేదన్నారు.

**మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చండి**

**'సురవరం'మృతికి నివాళులు**

సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ లోకసభ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల చింతిస్తూ ఏఐటీయూసీ అధ్వర్యంలో.. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన కార్మిక వర్గానికి ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి, కార్మిక వర్గానికి వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ

**గుడిబండ లో కూడా విద్యలతో పనులు**



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 23 :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గుడిబండ లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశానుసారం సీసీ రోడ్డు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అమరేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు కింద ఈ పనులకు గాను 8 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద హార్టికల్చర్ మామిడి మొక్కలను కూడా నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి, ప్రోగ్రామ్ ఇంచార్జీ శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సింధు, కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, చంద్రా రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, నరసింహ రెడ్డి,యం నర్సిములు, శివరాజు, బలరాం, మన్నెంలతో ఆటో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


# పెద్ద గోప్లాపూర్ లో శ్రావణమాసం పూజలు



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 23 :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం పెద్ద గోపులాపూర్ లో శనివారం శ్రావణమాసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల రోజులుగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ భజనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామస్తులు గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని భజన మండలి సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి కొత్త కాపు నారాయ-ణరెడ్డి, గ్రామస్తులు శ్రీనివాసులు, బాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, సత్య రెడ్డి, రాంరెడ్డి, వెంకట్ రాములు, శివరాములు, వీరన్న, రాములు, భద్రయ్య, ప్రతాపరెడ్డి, దశరథ, మాధవులు లతోపాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**బొమ్మయ్యపల్లి సర్పంచ్ గోవిందయ్య**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) వెదురు కుప్పం :** మండలంలోని బొమ్మయ్యపల్లి వినాయక చవితి పర్వదినం తెలుసుకుని వీధి దీపాలు అమర్చుతున్న సర్పంచ్ చొక్కా గోవిందయ్య, అదేవిధంగా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని బొమ్మయ్యపల్లి సర్పంచ్ గోవిందయ్య స్పష్టం చేశారు. ఆదివారం బొమ్మయ్య పల్లి పంచాయతీ బొమ్మయ్యపల్లి గ్రామంలో కొత్త వీధిదీపాలు సర్పంచ్ ఏర్పాటు చేసి నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రాత్రి వేళలో ఇబ్బంది లేకుండా వీధి దీపాలు ఏర్పా టు చేయడం జరిగినదని తెలిపారు. పంచాయతీలో ప్రజ లకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ సేవలు గుర్తించి పలు గ్రామాల ప్రజలు సర్పంచ్ కు ధన్య వాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ వెంట సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏసీబీ ట్రాప్ డోర్నకల్ సీఐ పట్టివేత

**నేటి సాక్షి మహబూబాబాద్ నరసింహులు పేట (జి. రే. నాయక్) ఆగస్టు23 :** మహబూబాబాద్ కు చెందిన భూక్యా హెరాంజి కుమారుడి వద్ద లంచం తీసుకుంటు పట్టుబడిన సీఐ.డోర్నకల్ పోలీస్ స్టేషన్ లో అవినీతిపై ఎన్నో సార్లు ఆ పోలీస్ అధికారిపై ఫిర్యాదు చేసిన పట్టుంచుకోలేదని బాధితుడి ఆవేదన డోర్నకల్ నియోజకవర్గంలో పోలీస్ స్టేషన్ లు అవినీతికి అడ్డాగా మారాయి. అక్రమ కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 50 వేల రూపాయలు డిమాండ్ చేసిన సీఐ అడ్వాన్సుగా 30 వేల రూపాయలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



# మౌళిక సదుపాయాలు కల్పించాలని వినతి



**నేటిసాక్షి, మిర్యాలగూడ** : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సమస్యలను తీర్చి, మౌళిక సదుపాయాలు కల్పించాలని పట్టణ బిజెపి టూ టౌన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ, పట్టణంలో హనుమాన్ పేట ఫ్లైఓవర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు రాత్రిపూట వీధి దీపాలు వెలగడం లేదని, రవీంద్ర నగర్ ప్రాంతంలో వీధి దీపాలు మరియు రోడ్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని, పలుచోట్ల పట్టణంలో అనేక సమస్యలు, మరి ముఖ్యంగా నందిపాడు రోడ్డుటాకా రోడ్డు నుండి నందిపాడు బైపాస్ ఎక్స్ రోడ్ వరకు అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేస్తూ, రోడ్డు డైవర్షన్ బోర్డు ఏర్పాటు చేయడం లేదని, ప్రధాన రోడ్డు కావడం అధికారుల పర్యవేక్షణ లోపించడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. ఫాగింగ్ మరియు బ్లీచింగ్, చాలా చోట్ల నల్లాలకు ఆన్ ఆఫర్ లేకపోవడం ద్వారా మీరు వృధాగా పోవడం, తద్వారా దోమలు వ్యాప్తి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించి, పట్టణ ప్రజలకు అన్ని రకాల మంచి మౌళిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ టూ టౌన్ బీజేపీ అధ్యక్షులు పెద్ద బోయిన వీటి యాదవ్, పట్టణ నాయకులు, నందికొండ హరిప్రసాద్, నిరంజన్ రెడ్డి, కనపర్తి రాంప్రసాద్, కంచుకొమ్ముల వేణు, చిలుకూరు శ్యాము, కొండేటి శేఖర్, భాష, సృజన , సోమలింగ యాదవ్, మేడి నవీన్ , సైదులు, జిల్లా నాయకులు రేపాలపురుషోత్త రెడ్డి, తుమ్మలపల్లి హనుమంత రెడ్డి, బంటు సైదులు, ఎడ్ల రమేష్, సజ్జల నాగిరెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్ రావు, కనపర్తి సత్య ప్రసాద్ మరియు ఇతర సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందెం స్థావరాలపై దాడి.



**నేటి సాక్షి, కోటపల్లి:** మంచిర్యాల జిల్లా కోట పల్లి మండలం కొల్లూరు గ్రామంలో గోదావరి పరివాహక ప్రాంతంలో కోడి పందాలు స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. కొల్లూరు చెన్నూరు మహారాష్ట్ర ప్రాంతాలవారు కోడిపందాలు ఆడుతున్నారని ముందస్తు సమాచారం మేరకు కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తన సిబ్బందితో దాడి చేశారు. చమత్కారి శంకర్, పాలరపు సమ్మయ్య, గగ్గూరు తిరుపతి, రమేష్ మదనయ్య, గంట రవి, తుంగ పిండి శ్రీకాంత్, ఆలం చిరంజీవి, పోలోజు సుధాకర్, సదయ్య లను అదుపులోకి తీసుకుని రాజేందర్ అరెస్టు చేశారు. మరియు మరికొంతమంది పారిపోయారు. వారి నుంచి నాలుగు సెల్ ఫోన్లు, రెండు కోళ్లు, 5400 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేందర్ హెచ్చరించారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**నేటి సాక్షి,వేమనపల్లి :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని నీల్వాయి పోలీసులు తెలిపారు.చెన్నూరు రూరల్ సీఐ బన్సిలాల్ ఆదేశాల మేరకు నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం హెడ్ కానిస్టేబుల్ ఎబినైజర్ కల్మలపేట,క్యాతనపల్లి యువకులకు వాలీబాల్ కిట్ అందించారు.అనంతరం మాట్లాడుతూ మాదకద్రవ్యాలు,పోలీస్ నూతన చట్టాలు,రవాణా చట్టాలపై అవగాహన కల్పించారు.గేమింగ్ యాప్స్ తో జాగ్రత్తగా ఉండాలని,అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఇతర వివరాలను తెలుపవద్దన్నారు.వీరితో కానిస్టేబుల్ రాజు,మధుకర్ స్థానిక యువకులు ఉన్నారు.

## యువతరానికి స్ఫూర్తి ఆంధ్రకేసరి

**నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి ,ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి (షేక్ నయిముల్లా :** టంగుటూరి ప్రకాశం పంతులు యువతరానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో శనివారం జరిగాయి.ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి , బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కలిసి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో స్వాతంత్ర ఫలాలు అట్టడుగునున్న ప్రజలందరికీ అందేలా ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రకాశం పంతులు ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నెట్ వాలీబాల్ క్రీడా దుస్తుల పంపిణీ



**నేటి సాక్షి,వేమనపల్లి:** వేమనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రేస్ పార్టీ నాయకులు మేస్త్రి సంఘం ఉప అధ్యక్షులు తోకల శ్రీనివాస్ గ్రామంలో ఉన్న యువకులు క్రీడల్లో రాణించాలని యువకులను ప్రోత్సాహించడానికి మాజీ సర్పంచ్ తోకలు రాంచందర్ తో కలిసి క్రీడా సామాగ్రి పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాగేష్,రాజేష్, శేఖర్, బాపు, సంతోష్, రమేష్,శేఖర్, మధునయ్య, గంగయ్య, రమేష్,తిరుపతి క్రీడాకారులు ప్రదీప్, నరేష్, సంజీవ్, ప్రవీణ్, రఘు, దేవేందర్, సమ్మయ్య,వినోద్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# నారీ ఆరోగ్యంకై మహిళా కాంగ్రెస్ కృషి

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి.
- కళాశాలలో 'సానిటరీ న్యాప్ కిన్స్' పంపిణి.



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** నారీ ఆరోగ్యాని కోసం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో తమ వంతు కృషి చేస్తున్నామని జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు.జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కలంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావుల ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ ( సానిటరీ న్యాప్ కిన్ ) కార్యక్రమం లో భాగంగా శనివారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లతో కలిసి న్యాప్ కిన్స్ పంపిణి చేశారు.

### మహిళల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తాం

ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం, బాలికల రక్షణ దృష్ట్యా జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా శానిటరీ న్యాప్కిన్ పంపిణి చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మహిళలు మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండడంతో పాటు, క్యాన్సర్, రి ప్రోడక్టివ్ సమస్యలను నివారించడం, రుతుక్రమ సమయంలో శుభ్రత పాటించడం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని, ఇది ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుందని విజయలక్ష్మి చెప్పారు. ప్రతి మహిళా ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.

### ఋతుక్రమమనేది..

ఋతుక్రమనేది మహిళా శరీరంలో జరిగే ఒక సహజమైన మార్పు మాత్రమేనని,ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి , పట్టణ అద్యక్షురాలు పిప్పరి అనిత, జిల్లా వైస్ ప్రాసిడెంట్ అల్లాల సరిత, చిట్ల లత, రేణుక, పద్మ , జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అలియా గ, కాలేజ్ లెక్చరర్స్ పాల్గొన్నారు.

# గ్రామాల పరిశుభ్రత ప్రజలకు ఉపయోగకరం

- స్వచ్ఛ ఆంధ్ర...స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గ్రామాలు శుభ్రం
- ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు




**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి (కర్లపాలెం) :** స్వచ్ఛ ఆంధ్ర...స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గ్రామాలు పరిశుభ్రం చేయడం ప్రజలకు ఉపయోగకరం అని ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు అన్నారు.బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం లోని కొత్త నందాయ పాలెం గ్రామంలో జరిగిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి ఆట్ల వెంకటేశ్వరమ్మ అయ్యప్ప రెడ్డి తో కలిసి పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాంద్ర మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా, ఈ నెలలో మాన్సూన్ హైజీన్ పేరుతో మలేరియా, డెంగ్యూ లాంటి ప్రమాదకర వ్యాధులకు కారణమైన దోమల నివారణ కు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి గ్రామస్తులకు వివరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. గ్రామంలో గుంటలు ఏర్పడటం వలన నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సచివాలయం ఏ ఎన్ ఎం మరియు ఆశా వర్కర్ల ద్వారా దోమల నియంత్రణకు మందులు పిచికారి చేయించారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి అని ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి రెడ్డి, సచివాయం సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి



- ఆరోగ్యంగా ఉండండి
- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (బాపట్ల టౌన్) :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి ఆరోగ్యంగా ఉండండి అని బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు.పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులనందు కమిషనర్ పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శీలం వారి పాలెం సచివాలయ పరిధి నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని డ్రైనేజీ పూడికతీత పనులను , రోడ్ల వెంబడి గల పిచ్చి మొక్కల తొలగింపును, గృహ సముదాయాలలో ఉపయోగంలో లేని నీటి తొట్టెల నందు నిలిచిన నీటిని తొలగించారు. కమీషనర్ గృహ యజమానులతో మాట్లాడుతూ ప్రమాదకర వ్యాధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గృహ పరిసరాలను ఎప్పుడూ కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, ఉపయోగంలో లేని వస్తువులను తొలగించాలని అనవసరమైన నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు.ప్రమాదకరమైన వ్యాధులైన డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులకు కారణమయ్యేయ్యే దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి ప్రజలకు వివరించారు. గృహ సముదాయాల మధ్య నీటి నిల్వలను గుర్తించి యాంటీ లార్వాల్ పిచికారి నిర్వహించి ఆయిల్ బాల్స్ ను ఉంచాలని ఆదేశించారు. అనంతరం వివేకానంద కాలనీ మునిసిపల్ పార్క్ ఆధునీకరణ మరియు సుందరీకరణ పనులను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఎస్.అర్. కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. సుందరీకరణ పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరలో పనులను పూర్తి చేస్తామని వివేకానంద కాలనీ సొసైటీ సభ్యులకు తెలియజేశారు. సూర్యలంక రోడ్డులోని అన్న క్యాంటీన్ ను పరిశీలించిన ఆయన అక్కడికి వచ్చిన వారిని అడిగి ఆహార పదార్థాల నాణ్యత గురించి వివరాలు తెలుసుకున్నారు. స్వచ్ఛమైన త్రాగునీటిని ప్రజలకు అందుబాటులో ఉంచి క్యాంటీన్ పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని అక్కడ సిబ్బందికి సూచించారు. వారి వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు సయ్యద్ నజీర్ , సి.హెచ్ కరుణా పురపాలక సంఘ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రగతిబాట

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- పీఎం ఎజీవై నిధులు రూ.80 లక్షల మంజూరు
- సిసి రోడ్ల,డ్రైన్లు , మౌలిక వసతులకల్పన

**నేటి సాక్షి,బాపట్ల జిల్లా ప్రతినిధి (పర్చూరు) :** గ్రామాలను ప్రగతి బాటలో నిలపడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆదర్స్ గ్రామ యోజన PMAGYలో భాగంగా పర్చూరు నియోజకవర్గం. లోని గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ప్రధానమంత్రి ఆదర్స్ గ్రామ యోజన కింద 19 పనులకు మొత్తం రూ.80 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల ప్రగతి, సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతుల బలోపేతం లక్ష్యంగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేలా సిసి రోడ్లు ,డ్రైన్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లు మండలంలో, భీమవరం గ్రామానికి 04 వర్క్ లకు, రూ.20 లక్షలు, యద్దనపూడి మండలంలో, యనమదల గ్రామానికి 06 వర్క్ లకు, రూ.20 లక్షలు,చిన్నగంజాం మండలంలో, సంతరావూరు గ్రామానికి 04 వర్క్ లకు, రూ.20 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ నిధులతో సురక్షిత మంచినీరు, అంగన్వాడీ బిల్డింగ్ నిర్మాణం,పర్చూరు మండలంలో, దేవరపల్లి గ్రామానికి 05 వర్క్ లకు, రూ.20 లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.



# డ్రగ్స్ మహమ్మారికి అలవాటుపడి మీ లక్ష్యాన్ని మరువద్దు




- కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల పట్టణ సీఐ రాంబాబు

**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి (బాపట్ల టౌన్) :** డ్రగ్స్ మహమ్మారికి అలవాటుపడి మీ లక్ష్యాన్ని మరువద్దు అని బాపట్ల టౌన్ సిఐ రాంబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈగల్ చీఫ్ అకే రవికృష్ణ ఆదేశాలమేరకు బాపట్ల జిల్లా ఎస్పీ సూచనలమేరకు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం(డ్రగ్స్), మత్తు పదార్థాల వనం వల్ల కలిగే అనర్థాలపై గురువారం బాపట్ల ఈగల్ టీమ్ (ఏలైట్ యాంటి - నారకోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్సెమెంట్) ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల నందు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యకమానికి బాపట్ల పట్టణ సీఐ రాంబాబు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు. యువత దేశానికి పట్టుకొమ్మలని వారు మంచి ఆలోచనలు కలిగి ఉండాలని సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. నేటి తరంలో అనేకమంది య-ువత డ్రగ్స్ కు మద్యానికి బానిసల వుతున్నారు. మాదకద్రవ్యాలకు, మద్యానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఒక వ్యక్తి డ్రగ్స్ కి అలవాటు అయితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగం వల్ల ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందివాలని అప్పుడు మాత్రమే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పదంలో పయనిస్తుందని తెలియజేశారు. గుడుంబా, బెల్లం, గంజాయి, డ్రగ్స్ వినియోగించడం వల్ల విద్యార్థుల జీవితాలు,కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు తెలిపారు. ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చే విధంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని కూడా నివారించాలని అన్నారు. డ్రగ్స్ నివారణ సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సంప్రదించాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ పి ప్రసూన రాణి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ అబ్దుల్ సలాం, బాపట్ల ఈగల్ టీమ్ దుర్గ ప్రసాద్, సతీష్, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

- విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు
- జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత




**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత కోరారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, పండుగ నేపథ్యంలో కమిటీ సభ్యులతో, ఏర్పాట్లపై అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ మున్సిపల్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో జిల్లాలో పట్టణాలలో లో-లెవెల్ లో ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్లలో విద్యుత్ తీగల విషయంలో ఆ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రూట్ క్లియరెన్స్ సమర్పించాలని అన్నారు. వేడుకల కోసం లైటింగ్, శానిటేషన్, బ్లీచింగ్ వంటి పనులను మున్సిపల్ ఆధ్వర్యంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో షిఫ్ట్ ల వారీగా ఈతగాళ్లను, బోట్ లను ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక, మైనింగ్, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

### పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వినాయక నిమజ్జనం రోజున సాధ్యమైనంత త్వరగా విగ్రహాలను నిమజ్జన ఉత్సవానికి తరలించాలని కోరారు. విగ్రహాలను నిమజ్జనానికి తరలించే రూట్లలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చూడాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మునిసిపల్, ఎలక్ట్రిసిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆ శాఖల సిబ్బందిని షిఫ్టుల వారీగా విధుల్లో ఉంచాలని అన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా గణేష్ మండపాల ప్రాంతాల దగ్గర అన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ మాట్లాడుతూ ఈసారి జగిత్యాల జిల్లా లోని గణేష్ ఉత్సవాలు పకడ్బందీగా జరిగేలా చూస్తామని ఎలాంటి ఆ వాంఛనాలు జరగకుండా ఏర్పాట్లు చేసుకుంటాం పోలీస్ శాఖకు సహకరించాలని తగిన సేవలు అందుతాయని తెలిపారు. నిమజ్జన ప్రాంతాలైన జగిత్యాల పట్టణ కేంద్రంలోని చింతకుంట చెరువుల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు. పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల కోరుట్ల మెట్ పల్లి ఆర్డీవోలు మధుసూదన్ జీవాకర్ రెడ్డి,శ్రీనివాస్, డీఎస్పీ రఘు చందర్ , జిల్లా అధికారులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# యూరియా లేక మూగబోయిన సొసైటీలు

### రేపు, మాపు వస్తుందని చెప్తున్నా అధికారులు.

**మెదక్ జిల్లా. నేటి సాక్షి. కొల్చారం, (భూమయ్య):** మెదక్ జిల్లాలో.. కొల్చారం మండలం అంటే.. వరి పంటలు పండించడంలో కొల్చారం మండలానికి పెట్టిన పేరు... కానీ పంటలు వేసి నెల రోజులు గడుస్తున్నప్పటికీ... కలుపు కలిసి యూరియా చల్లుదామంటే... ఆఖరికి అప్పు పుడుతుంది కానీ.. యూరియా బస్తా దొరకడం లేదు.. ఇది అధికారుల నిర్లక్ష్యమా..? ప్రభుత్వ నిర్లక్ష్యమా..? అని రైతులు ఆరోపిస్తున్నారు. వరి పంటలు కోస్తే ఒక సొసైటీ సెంటర్ నుండి సుమారు 100 నుంచి 150 లారీల వరకు వరి ధాన్యాన్ని పండించే రైతులు కొల్చారం మండలంలోని.. ఎవరి దగ్గరికి వెళ్లిన పదివేల రూపాయల అప్పు దొరుకుతుంది కానీ వరి పంటకు మందు చల్లుదామంటే యూరియా సంచి దొరకడం లేదని కొల్చారం మండలం చెందిన వివిధ గ్రామాల రైతులు బోరున విలిపిస్తున్నారు. మా మండలానికి యూరియా వచ్చే విధంగా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు. యూరియా లేక మూగబోయిన సొసైటీలు..కొల్చారం మండలంలో యూరియా మందు లేక పోతంశెట్టిపల్లి, చిన్న ఘనాపూర్, రంగంపేట్, కొంగోడు, వరిగుంతం సొసైటీలు మూగబోయాయి. యూరియా మందు ఏ క్షణాన వస్తుందో అని రైతులు పొలాల వద్దకు వెళ్లకుండా సొసైటీల వద్ద మందు సంచుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అధికారులు స్పందించి మండలంలో యూరియా కొరత తీర్చాలని వివిధ గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా మందు కోసం రైతులు అధికారుల దగ్గరికి వెళ్లి అడుగుతే రేపు, మాపు వస్తుందని అధికారులు చెప్తున్నారని వివిధ గ్రామాల రైతులు తెలిపారు. ఒకవైపు జిల్లా అధికారులు యూరియా మందు వల్ల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా అధికారులు చెబుతున్నారు. మండల అధికారులు మాత్రం రేపు మాపు వస్తుందని రైతులకు చెప్పడం ఎంతవరకు సమంజసమని రైతులు అగ్రహ వ్యక్తం చేస్తున్నారు. రైతుల బాధలను పట్టించుకునే నాధుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.




# పేకాట స్థావరంపై మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

### ఐదుగురు అరెస్ట్, 78,927/- రూపాయలు నగదు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం



**నేటి సాక్షి(భూమయ్య):మెదక్ జిల్లా మెదక్ :** మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామ పరిధిలోని కమ్మరి దాతత్రి పొలంలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను శేరి సంగమేస్ తండ్రి బాగయ్య, ఆకుల నరేష్ తండ్రి నర్సింలు, అజ్జిగల గోపాల్ తండ్రి గంగయ్య, కటికే మహేందర్ తండ్రి లక్ష్మణ్ , అల్లే రమేష్ తండ్రి బాలరాజ్ లను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారిని కొల్చారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి వారి వద్ద నుండి రూపాయలు 78,927/- నగదు, 05 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు.

# ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి:( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** తెలంగాణ సాంస్కృతిక సారథి జగిత్యాల కళాబృందంచే పారిశుద్ధ్య నిర్వహణ మరియు మత్తు పదార్థాల డ్రగ్స్ వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమం గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ భీమరాజు పల్లి రంగదాముని పల్లి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతికసారథి జగిత్యాల కళాబృందంచే తమ అట పాటల ద్వారా అవగాహన కలిపించారు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని చూచించారు గ్రామలల్లో యువత గంజాయి మరియు డ్రగ్స్ కు బానిసై తమ విలువైన భావిషత్తును నాశనం చేసుకుంటున్నారని. యువత మత్తుకు బానిస కాకుండా సమాజంలో గౌరవంగా బతకాలని. నలుగురికి ఆదర్శంగా నిలవాలని కోరారు ఇట్టి కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, తెలంగాణ సాంస్కృతికసారథి కళాకారులు ,నాయకులు ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, గ్రామస్తులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు

# సెప్టెంబరు 9న ఛలో హైదరాబాద్.

### నక్క సతీష్ మాదిగ.ఎమ్మార్పీఎస్ రాయికల్ మండల ఇంచార్జి



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి: ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** జగిత్యాల జిల్లా రాయికల్ ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బేక్కం వెంకటేష్ ఆధ్వర్యంలో రామాజీపేట గ్రామం లో వృద్ధులు వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంనికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు. రాయికల్ మండల ఇంచార్జి నక్క సతీష్, కో ఇంచార్జి పొడేటి సునీల్ హాజరై మాట్లాడుతూ వికలాంగులకు 4000 నుండి 6000 వరకు,వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు బీడీ కార్మికులు చేనేత కార్మికులు మరియు ఇతర ఆసరా చేయూత పెన్షన్లను 2000 నుండి 4000 వరకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి నమ్మించి అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలల తర్వాత కూడా ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచకుండా వారి బకాయిలను చెల్లించకుండా పెన్షన్ దారులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ సెప్టెంబర్ 9న హైదరాబాదులో జరగబోయే మహాగర్జనకు మండల వ్యాప్తంగా ఉన్న పెన్షన్ దారులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్ల నరేందర్, బేక్కం శేఖర్,మనోజ్, దీపక్, సుమన్, నరసయ్య, దిలీప్, దివ్యాంగులు పెన్షన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# ఎంతకాలం.. ఎదురుచూపులు

## బస్టాండ్ ఆవరణలో వృద్ధురాలు నిరసన



**నేటి సాక్షి, నల్లబెల్లి ప్రతినిధి ఆగస్టు 23:** ఎంతకాలం ఎదురుచూపులు అంటూ ఓ వృద్ధురాలు బస్టాండ్ ఆవరణలో నిరసన తెలియజేస్తుంది. వివరాల్లోకి వెళితే, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లద్దునూరు యుగంధర్, భార్య పరిపూర్ణ పేన్షన్ పేరుతో అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తన తల్లి దళిత వృద్ధురాలు లద్దు నూరి సూరమ్మ 70 సంవత్సరాలు, బస్టాండు ఆవరణలో నిరసన చేపట్టారు. సూరమ్మ కు ముగ్గురు కొడుకులు రెండో కొడుకు అయినా లద్దునూరు యుగంధర్, పెన్షన్ పేరుతో మండల రిజిస్టర్ ఆఫీస్కు తీసుకొచ్చి మాయమాటలు చెప్పి ఏమీ తెలియని నాతో వేలిముద్రలు వేయించుకొని మోసం చేశాడంటూ, బస్టాండ్ ఆవరణలో ఫ్లెక్సీ తో నిరసన తెలుపుతు. తనకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్ ను, మండల అధికారులను వేడుకుంటుంది.

# మండలంలో ఘనంగా పొలాల పండుగ వేడుకలు

**నేటి సాక్షి,వేమనపల్లి :** మండలంలోని అన్ని గ్రామాల్లో పొలాల అమావాస్య వేడుకలను గ్రామస్తులు,రైతులు ఘనంగా నిర్వహించారు.రైతులు తమ వద్దనున్న ఎడ్లు,ఆవులు,దూడలకు శుభ్రంగా కడిగి వాటికి రంగురంగుల కలర్ లను పూసి వాటికి పోలేలు చేసి తినిపించడం ఆనవాయితీగా మారింది.దీంతో పాటు రైతులు పాడిపంటలు,తమ గ్రామాలు చల్లగా ఉండాలని కోరుతూ వారు పొలాల పండుగ జరుపుకుంటారు.ముల్కలపేట గ్రామంలో రైతులు డప్పు వాయిద్యాలతో ఎడ్ల బండి కట్టుకొని గ్రామ చావిడి వద్ద నుంచి బయలుదేరి ముసలమ్మ,పోసమ్మ మందిరం చుట్టూ తిప్పుతూ పొలాల పండుగ ఘనంగా జరుపుకున్నారు

# చెన్నకేశవ స్వామి వారికి ఎమ్మెల్యే దంపతుల పూజలు



**నేటి సాక్షి, దేవరకద్ర ఆగస్టు 23 :** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశ్వర స్వామి వారిని శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన దేవాలయానికి వచ్చి ఈ పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతం పలికి, స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కుక్కల నియంత్రణ వీలైనంత తొందరగా చేపట్టాలి



**నేటిసాక్షి(కె గంగాధర్ )పెగడపల్లి :** పెగడపల్లి మండలం లోని ప్రతి గ్రామంలో కుక్కలు ప్రజలను బేంబేలెత్తిస్తున్నాయి పిల్లల్ని బైటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు స్కూల్ వపంపించాలన్న బైట ఆడుకోవాలన్నా కుక్కలు విచక్షణారాహితంగా ఎగబడుతున్నాయని గ్రామాలలో ప్రజలు వాపోతున్నారు. ఒకేసారి మందలు మందలుగా తిరుగుతూ చిన్న పెద్ద అనే తేడాలేకుండా గాయపరుస్తూన్నాయి. అక్కడితో ఆగకుండా ఒకరు ఇద్దరు చిన్న పిల్లలు కనిపిస్తే చంపే వరకు వదిలిపెట్టడం లేదుకుక్కల నియంత్రణ వీలైనంత తొందరగా ప్రభుత్వం అధికారులు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# క్రీడలతోనే ఆరోగ్యకర సమాజనిర్మాణం

- స్ఫూర్తినిచ్చిన జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత స్పీచ్
- జగిత్యాలలో అట్టహాసంగా 'ఈశా గ్రామోత్సవం'
- వాలీబాల్-త్రోబాల్ పోటీల్లో జట్ల రద్దీ..
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా వేడుక



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల టౌన్ మినీ స్టేడియంలో శనివారం 'ఈశా ఫౌండేషన్' ఆధ్వర్యంలో 17వ ఈశా గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది. పురుషుల వాలీబాల్‌లో 40 జట్లు, మహిళల త్రోబాల్‌లో 18 జట్లు పాల్గొనడంతో పోటీలు ఉత్సాహంగా సాగాయి.



## క్రీడలు స్ఫూర్తిని రగిలిస్తాయి

ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ..'గ్రామీణ క్రీడా ఉత్సవాలు యువతకు మత్తు పదార్థాలనుంచి దూరం చేస్తాయి. క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుంది. యోగా మనిషి వ్యక్తిత్వాన్నీ, సమాజాన్నీ మారుస్తుంది. ప్రతి గ్రామం నుంచి యువత ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాల'ని పిలుపునిచ్చారు.జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదు-రవుతాయని..వాటిని పరిష్కరించుకునే సమయంలో ప్రతీ వారూ ఒత్తిడికిగురై డీలాపడిపోవడం సహజమన్నారు. సరిగ్గా అలాంటి సమయంలో ఇదిగో ఇలాంటి క్రీడలు మనలోని స్తబ్దతను దూరం చేసి శరీరాన్ని..మనసును ఉత్తేజపరుస్తాయన్నారు.ఈ కోణంలో 'ఈశా ఫౌండేషన్' చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

## ఆటల సందడి %-% సాంస్కృతిక రంగు

గ్రామాల నుంచి వచ్చిన ఆటగాళ్ల పోటీ తీరుకు ప్రేక్షకులు చప్పట్ల వర్షం కురిపించారు. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలతో కలెక్టర్‌ను ఆహ్వానించగా వేదిక సందడిగా మారింది. ఆటలు, సాంస్కృతిక అంశాలతో మేళవించి ఉత్సవం ఘనంగా సాగింది.సద్గురు స్ఫూర్తితో..2004లో సద్గురు ప్రారంభించిన ఈశా గ్రామోత్సవం గ్రామీణ భారతీయ స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడమే లక్ష్యంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

## మూడు దశల్లో పోటీలు- భారీ బహుమతులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 22 జిల్లాలలో ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 21 వరకు క్లస్టర్ (జిల్లా స్థాయి), డివిజనల్ (రాష్ట్ర స్థాయి), ఫైనల్ (దక్షిణ భారత స్థాయి) %-% మూడు దశల్లో పోటీలు జరుగుతున్నాయి. ప్రతి దశలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు ఉంటాయి.

## ఆదియోగి వద్ద ఫైనల్..

సెప్టెంబర్ 21న కోయంబత్తూరులోని ఆదియోగి వద్ద ఫైనల్ పోటీలు జరగనున్నాయి. సద్గురు సమక్షంలో అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమంలో విజేత జట్లకు 'ఈశా రిజువినేషన్ ట్రోఫీ'తో పాటు పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ విభాగాల్లో చెరో రూ.5 లక్షల నగదు బహుమతి అందజేయనున్నారు. మొత్తంగా కోటి రూపాయలకు పైగా నగదు బహుమతులు ఉండనున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ 'ఈశా గ్రామోత్సవం' జగిత్యాలలో సందడివాతావరణాన్ని తెచ్చిపెట్టింది.!

# శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం




వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి,

**నేటి సాక్షి వికారాబాద్ :** గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు వికారాబాద్ పట్టణంలోని గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి వివిధ మతాల ప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ, "సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడానికి పోలీసులతో పాటు ప్రజల సహకారం అత్యంత అవసరం. పండుగల సమయంలో అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ, శాంతి పరిరక్షణలో భాగస్వాములు కావాలి. శాంతియుత వాతావరణం, సురక్షితమైన సమాజం మనందరి సామూహిక బాధ్యత" అని తెలిపినారు. శాంతి కమిటీ సభ్యులు సమాజంలో శాంతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తారని, ఈ సమావేశాలు మతాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. భద్రతా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గణేష్ ఉత్సవాల సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారని ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు: మండపాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలి. ఎలక్ట్రికల్ వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి, షార్ట్ సర్క్యూట్లు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలి. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. పౌరుల భద్రత కోసం మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం సమయంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలి.వదంతులపై అప్రమత్తత "సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న అవాస్తవ సమాచారం, వదంతులను ప్రజలు నమ్మవద్దు. అలాంటి సందేహాలు ఉంటే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీసు అధికారులను సంప్రదించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం," అని ఆయన హెచ్చరించారు. అల్లర్లను రెచ్చగొట్టే సందేశాలు, పోస్టులు పెట్టేవారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు ఏ సమస్య ఎదురైనా పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. "మీ సమస్యలను ధైర్యంగా చెప్పండి, వాటి పరిష్కారానికి మా పూర్తి సహకారం అందిస్తాం. పండుగను జరుపుకునేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, సౌండ్ సిస్టమ్స్ విషయంలో కోర్టు ఆదేశాలను గౌరవించాలని" ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి , వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, పీస్ కమిటీ సభ్యులు, వినాయక మండపాల నిర్వాహకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కై సమరశీల పోరాటాలు

- గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కై సమరశీల పోరాటాలు
- CITU జగిత్యాల జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖరం



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి: ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ గొల్లపల్లి మండల మహాసభల జంగిలి ఎల్లయ్య అధ్యక్షణ జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ పంచాయతీ యూనియన్ మండల సమావేశం జరిగింది ఈ సమావేశానికి జీ పీ యూనియన్ సీఐటీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షులు %జ×ుఖ% జగిత్యాల జిల్లా కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రానున్న రోజుల్లో యంపి టీసీ జెడ్పీటీసీ స్థానిక ఎన్నికలు వస్తున్నాయి కావున ఈ ఎన్నికలలో కీలక పాత్ర పోషించేది గ్రామ పంచాయతీలో పని చేసే ఈ పేద దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన వారనేది ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హైదరాబాద్ రాష్ట్ర నాయకత్వం తో జరిపిన చర్చలలో ఇచ్చిన హామీల ప్రకారం 51 జీవోకు ముందున్న వారియొక్క పేర్లు ఆన్ లైన్ లో నమోదు చేయుటకు క్రింది స్థాయి అధికారులకు ఆదేశం జారీ చేస్తాం అని హామీలు ఇవ్వడం జరిగింది కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 2020 వరకైనా ఉన్న వారి పేర్లు ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసి వారికి కూడా వేతనాలు ఇవ్వాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, జీవో నెంబర్ 51 నీ సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జూలై వేతనం గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని మాట్లాడడం జరిగింది అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ గొల్లపల్లి మండల గౌరవ అధ్యక్షులుగా కలువాల లత, మండల అధ్యక్షులు గా జంగిలి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గా మాలోతు రాజు నాయక్, కోశాధికారి గా జెరిపోతుల అంజయ్య, ఉపాధ్యక్షులు ఎం.శేఖర్,ఎం తిరుపతి, సహాయ కార్యదర్శిగా పి.మల్లేశం, ప్రచార కార్యదర్శి గా సి.హెచ్.సాయికుమార్ లతో పాటు 17 మందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.